www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 359

సోమవారం | 14-4-2025

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి ఉ.8:26 తదుపరి విదియ, నక్షత్రం: స్వాతి రా.12:13 తదుపరి విశాఖ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: మ.12:40-1:29, మ.3:09-3:58, అమృతఘడియలు: మ.2:18-4:06, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:03, సూర్యాస్తమయం: 6:27

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





పేలుడు ధాటికి ఆనవాళ్లు లేకుండా పోయిన బాణసంచా తయారీ కేంద్రం. (ఇన్‌సెట్) అయినవారిని కోల్పోయి విలపిస్తున్న మహిళ

బతుకులు బుగ్గిపాలు

'అనకాపల్లి' బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు

8 మంది మృతి.. మరో 8 మందికి తీవ్ర గాయాలు

- షాట్ బాక్స్‌లో మందుగుండు కూరుతుండగా ఘటన
- అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో ఘోరం
- క్షతగాత్రులను పరామర్శించిన హోం మంత్రి అనిత
- మృతుల కుటుంబాలకు 15 లక్షల చొప్పున పరిహారం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం.. సీఎం ఆదేశం
- ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ దిగ్భ్రాంతి

కోటవురట్ల/నర్సీపట్నం/అనకాపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు మృతిచెందగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం

మిగతా 3వ పేజీలో...

భారత్ అమ్ముల పొదిలో

లేజర్ అస్త్రం!





ఎంకే-2(ఏ) ద్వారా లేజర్‌తో యూఏవీని ధ్వంసం చేస్తున్న దృశ్యం

- లేజర్ పుంజాలతో డ్రోన్ల విధ్వంసక వ్యవస్థ
- దేశంలో తొలిసారి అత్యంత అధునాతన
- డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్.. ఎంకే-2(ఏ) ప్రయోగం
- కర్నూలులో పరీక్షలు నిర్వహించిన డీఆర్‌డీవో
- 30 కిలోవాట్ లేజర్ సామర్థ్యంతో ధ్వంసం
- నిఘా సెన్సర్లకు అడ్డుకట్ట, తొలి ప్రయోగం
- సక్సెస్.. డీఈడబ్ల్యూ దేశాల సరసన భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: భారత్ అమ్ముల పొదిలో అధునాతన ఫ్యూచరిస్టిక్ 'స్టార్ వార్స్'గా పేర్కొంటున్న లేజర్ అస్త్రాలు త్వరలోనే చేరనున్నాయి. లేజర్ పుంజాలతో శత్రువుల డ్రోన్స్, క్షిపణులను విధ్వంసం చేయగల లేజర్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్(డీఈడబ్ల్యూ) ఎంకే-2(ఏ)ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తొలిసారి ప్రయోగాత్మకంగా పరీక్షించి.. విజయం సాధించింది. ఏపీలోని కర్నూలులో ఉన్న నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్‌లో ఆదివారం.. ఎంకే-2(ఏ)ను వినియోగించి లేజర్ పుంజాలతో డ్రోన్ల సమూహాలను, ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీలను ధ్వంసం చేసింది. ఈ లేజర్ పుంజాలు

మిగతా 2వ పేజీలో...

అమరావతి.. డబుల్!

రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాల భూసమీకరణ?

- 4 మండలాల్లోని 11 గ్రామాల్లో చేపట్టేందుకు ప్రతిపాదన
- కొందరు రైతుల నుంచి అభిప్రాయ సేకరణతో వెలుగులోకి
- తాజాగా అమరావతి వైపు పలు సంస్థల చూపు
- అనేక ప్రాజెక్టుల ఏర్పాటుకు సంసిద్ధత
- విమానాశ్రయం, రైల్వే లైన్, మెట్రో తదితరాలకు ఇప్పుడున్న భూములు చాలవు.. అందుకే మరిన్ని సమీకరణకు యోచన?

11



రాజధాని అమరావతి పరిధి రెట్టింపు కాబోతోందా..? మరికొన్ని వేల ఎకరాల భూములను ల్యాండ్ పూలింగ్ కింద తీసుకోవాలని సీఆర్‌డీఏ భావిస్తోందా..? కొన్ని రోజులుగా రైతులతో అధికారులు జరుపుతున్న చర్చలు దీనినే సూచిస్తున్నాయని అంటున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అమరావతికి వచ్చేందుకు ఆసక్తి చూపుతుండడంతో రాజధానిని విస్తరించాలన్న యోచనతో.. మరో 44 వేల ఎకరాల భూములను సమీకరణ కింద తీసుకునేందుకు సీఆర్‌డీఏ ప్రతిపాదన రూపొందించినట్లు తెలుస్తోంది.

గడువు వద్దు!

- బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునఃపరిశీలించాలి
- సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం

2

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ

నేటి నుంచే..

- 3 గ్రూపులు.. 59 ఉప కులాలు..
- మొత్తం 15 శాతం రిజర్వేషన్లు

9

బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

- 'వక్ఫ్' అల్లర్లలో జేఎంబీ ఉగ్ర సంస్థ
- కేంద్ర నిఘా వర్గాల ఆందోళన
- అల్లర్లతో హిందువుల పరారు
- మాల్దాకు 400 మంది.. కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించండి: బీజేపీ

2

రాళ్లేద్దాం!

మళ్లీ వైసీపీ విద్వేష క్రీడ

- కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం
- 2019 ఎన్నికల ముందు అబద్ధాలతో అందలం
- 2024 ఓటమి తర్వాత మళ్లీ కుట్ర రాజకీయం
- జనంలోకి ఐ-ప్యాక్ మార్క్ ఫేక్ ప్రచారాలు
- పాస్టర్ ప్రవీణ్ మృతిపై అసత్య ఆరోపణలు
- హత్య అంటూ అలజడి రేపే ప్రయత్నం
- తాజాగా టీటీడీ గోశాలపై దుష్ప్రచారం
- అంబేద్కర్ సెంటిమెంట్‌తో కులాల చిచ్చు
- శాంతిభద్రతలు అదుపు తప్పేలా కుతంత్రం
- అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల ముందు వైసీపీ ఫేక్ ప్రచారాలు చేసి, విద్వేషాలు రెచ్చగొట్టింది. ఐ-ప్యాక్ డైరెక్షన్‌లో చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మారు. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ఆ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టకుండా లైట్‌గా తీసుకోవడమూ దాని ఓటమికి ఓ కారణం.

2024 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన వైసీపీ ఇప్పుడు మళ్లీ పాత 'వ్యూహాల'కు పదును పెడుతోంది. ఐ-ప్యాక్ మార్క్ ప్రచారాలతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. సున్నితమైన మత, కులపరమైన అంశాల్లో చిచ్చు రేపాలని చూస్తోంది. ఇందుకు ప్రముఖ వ్యక్తులు, మతాలు, ఆలయాలను వాడుకుంటోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీటీడీలో ఉన్న పింక్ డైమండ్‌ను చంద్రబాబు తీసుకెళ్లి ఇంట్లో పెట్టుకున్నారంటూ



మిగతా 12వ పేజీలో...

సిసోడియా అవుట్

రెవెన్యూ నుంచి చేనేత-జౌళి శాఖకు బదిలీ

- సీసీఎల్ఏ జయలక్ష్మికి అదనంగా రెవెన్యూ
- కాటమనేని భాస్కర్‌కు హెచ్ఆర్‌డీఐ అదనం
- నిరీక్షణలో ఉన్న ఐదుగురికి పోస్టింగ్
- ఎస్ఐఆర్‌డీ కమిషనర్‌గా ముత్యాలరాజు
- రైతు బజార్ల సీఈవోగా మాధవీలత
- నీలకంఠారెడ్డి ఎయిడ్స్ నియంత్రణకు
- ఆయుష్ కమిషనర్‌గా దినేశ్‌కుమార్
- గిరిజన గురుకులాల సొసైటీకి గౌతమి

12







నా జాతి ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.. ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చాను.. పోరాడి రాజులవుతారో.. ఓటును అమ్ముకుని బానిసలవుతారో నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది.

\- అంబేడ్కర్



ఉక్రెయిన్‌ను బెర్లిన్‌లా విభజిద్దాం

» యుద్ధాన్ని ముగించడానికి అమెరికా రాయబారి కీత్ కెల్లాగ్ సూచన

» వివాదాస్పదం కావడంతో వక్రీకరించారంటూ వివరణ



వాషింగ్టన్, ఏప్రిల్ 13: దాదాపు మూడేళ్లకు పైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు యత్నిస్తోన్న అమెరికా కొత్త ఫార్ములా తీసుకొచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బెర్లిన్‌ను విభజించినట్లే ఉక్రెయిన్‌ను కూడా నియంత్రణ మండలాలుగా విభజించాలని అమెరికా ప్రత్యేక రాయబారి జనరల్ కీత్ కెల్లాగ్ సూచించారు. బ్రిటీష్, ఫ్రెంచ్ బలగాలు పశ్చిమ ఉక్రెయిన్‌లో భరోసా దళంగా ఉంటాయని, ఇప్పటికే ఆక్రమించిన తూర్పు ప్రాంతాలపై రష్యన్ బలగాలు నియంత్రణ కొనసాగిస్తాయన్నారు. నిస్సైనిక మండలాల్లో రెండు దేశాల బలగాలు ప్రవేశించే అవకాశం లేదు కాబట్టి ఘర్షణలకు తావుండదన్నారు. ఇది వివాదం కావడంతో కెల్లాగ్ వివరణ ఇచ్చుకున్నారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. ఉక్రెయిన్‌ను విభజించడం తన యోచన కాదన్నారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే చర్యల్లో భాగంగా సైనిక పునరుద్ధరణ గురించి మాట్లాడానన్నారు. కాగా, ఉక్రెయిన్‌లోని సుమీ నగరంపై రష్యా ఆదివారం జరిపిన క్షిపణి దాడుల్లో 32 మంది మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా ప్రతినిధి విట్కాఫ్ సమావేశమైన రెండు రోజుల వ్యవధిలోనే ఈ దాడి జరిగింది. అమెరికా, యూరప్ దేశాలు రష్యా చర్యను గట్టిగా విమర్శించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు.

విడాకుల కేసుల్లో మధ్యవర్తిత్వమే మేలు

» విఫలమైతేనే విచారణ వరకు వెళ్లాలి

» జస్టిస్ బి.వి.నాగరత్న సూచన



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల విడాకుల కేసుల్లో తొలుత మధ్యవర్తిత్వం జరపాలని, అది విఫలమయితేనే విచారణ వరకు వెళ్లాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న సూచించారు. శనివారం బెంగళూరులో 'భారత సమాజానికి కుటుంబమే పునాది' అన్న అంశంపై జరిగిన చర్చలో ఆమె ప్రసంగిస్తూ కుటుంబ న్యాయస్థానంలో కేసు విచారణకు రాకముందే తప్పనిసరిగా మధ్యవర్తిత్వం జరగాలన్నారు. కోర్టులో తొలుత వాదనలు జరిగితే దంపతుల మధ్య దూరం మరింత పెరిగే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. అందువల్ల ఫ్యామిలీ కోర్టుల్లో శిక్షణ పొందిన నిపుణులు లేదా విశ్రాంత న్యాయమూర్తులు మధ్యవర్తులుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోగతి సాధించడం దాంపత్య జీవితాల విచ్ఛిన్నానికి కారణమవుతోందన్నది కేవలం అపోహ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. అది ఏ మాత్రం సరి కాదని చెప్పారు. గత పదేళ్లలో జరిగిన వివాహాల్లో సుమారు 40 శాతం విడాకులకు దారి తీశాయని ఇటీవలే ఒక సర్వేలో తేలిందని గుర్తు చేశారు. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, ఒకరిపై మరొకరు గౌరవం కలిగి ఉండాలని చెప్పారు.



ఉపాధి పథకంపై స్వతంత్ర సర్వే!

» పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలి

» పనిదినాలను 150కి పెంచాలి

» పార్లమెంటరీ కమిటీ సిఫారసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరును అంచనా వేసేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే చేయించాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అమలులో ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని పథకాన్ని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఈ మేరకు ఒక నివేదికను గతవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఉన్న 100 పనిదినాలను 150కి పెంచాల్సిన అవసరం ఉందని కూడా కమిటీ సిఫారసు చేసింది. రోజుకు కనీసం రూ.400 ఆర్జించేలా వేతనాలను పెంచాలని కూడా సూచించింది. పథకానికి నిధుల కేటాయింపుల్లో స్తబ్ధతపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పథకం సక్రమంగా అమలవడానికి సామాజిక తనిఖీలు పెంచాలని కూడా నొక్కి చెప్పింది. పథకంలో ఆర్థిక అవకతవకలు, ఉపాధి కూలీల సంతృప్తి, వేతనాల చెల్లింపుల్లో జాప్యం, భాగస్వామ్యమవుతున్న తీరుపై సర్వేలో దృష్టి కేంద్రీకరించాలని కమిటీ పేర్కొంది. ఆధార్ వివరాలు సరిపోలకపోవడం లేదా చిన్నపాటి అక్షర దోషాల కారణంగా 2021-22లో సుమారు 50.31 లక్షల జాబ్‌కార్డులు తొలగించారని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. తద్వారా అర్హులైన కూలీలకు ఉపాధి పనులు దక్కడంలేదని తెలిపింది. పథకం నుంచి కూలీలను అన్యాయంగా తొలగించకుండా వ్యవస్థను తీసుకురావాలని కూడా కమిటీ సూచించింది..

లా కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ దినేష్ మహేశ్వరి!

» ఈ వారంలోనే నోటిఫికేషన్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: లా కమిషన్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి నియమితులయ్యే అవకాశం ఉందని ఆదివారం విశ్వసనీయవర్గాలు తెలిపాయి. 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆయనను నియమిస్తూ ఈ వారంలోనే నోటిఫికేషన్ రావచ్చని పేర్కొన్నాయి. 23వ లా కమిషన్‌ను గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాని కాలపరిమితి మూడేళ్లని పేర్కొంది. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయవచ్చా, లేదా అన్న విషయాన్ని అధ్యయనం చేసే బాధ్యతను కూడా ఈ కమిషన్‌కు అప్పగించింది. జస్టిస్ దినేష్ మహేశ్వరి తొలుత 2004లో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి 2023 మే 14న పదవీ విరమణ చేశారు.

హైవేల బలోపేతానికి 10 లక్షల కోట్లు: గడ్కరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల బలోపేతానికి వచ్చే రెండేళ్లలో రూ.10 లక్షల విలువైన ప్రాజెక్టులు చేపడతామని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో ఈశాన్యంలోని రోడ్లు అమెరికాతో సమానంగా ఉంటాయన్నారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో గడ్కరీ మాట్లాడుతూ.. తూర్పు రాష్ట్రాల్లో రూ.3.73 లక్షల కోట్ల అంచనాతో 21,355 కిలోమీటర్ల మేర 784 హైవే ప్రాజెక్టులు చేపట్టనున్నామని తెలిపారు. వాటిల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్ఏఐ, ఎన్‌హెచ్ఐడీసీఎల్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే అస్సాం, బిహార్ తదితర రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ నోటీసులు 'ప్రజాస్వామ్యంపై దాడి': సిబల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో స్థిరాస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆదివారం తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను వినియోగిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో ఈడీ నోటీసులు జారీ చేయడాన్ని ఆయన 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అభివర్ణించారు. హిందూ-ముస్లిం అజెండాపై బీజేపీ రాజకీయాలు చేయాలనుకుంటోందని, విపక్షాన్ని అంతమొందించాలనుకుంటోందని మీడియా సమావేశంలో ఆయన మండిపడ్డారు. వార్తా పత్రికకు సంబంధించిన భవనాల్లో కాంగ్రెస్ కార్యాలయాలు నడుస్తున్నందున వాటిని స్వాధీన పరచుకుని పార్టీ పని చేయకుండా చేసేందుకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. అయితే 13 ఏళ్లు ఎందుకు వేచి చూశారని ఆయన నిలదీశారు.

కర్ణాటకలో ఐదేళ్ల చిన్నారిపై హత్యాచారం.. ఎన్‌కౌంటర్‌లో నిందితుడి హతం

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి అత్యాచారానికి పాల్పడ్డాడో మానవ మృగం. అనంతరం ఎవరికైనా చెబుతుందనే భయంతో గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత పోలీసు కాల్పుల్లో హతమయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి నగరంలో ఆదివారం జరిగిందీ ఘటన. కొప్పళకు చెందిన ఓ కుటుంబం ఉపాధి నిమిత్తం హుబ్బళ్లికి వలస వచ్చింది. చిన్నారి తండ్రి పెయింటర్. తల్లి గృహిణి. ఆదివారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో పనిచేసుకుంటోంది. చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా, ఒక యువకుడు చాక్లెట్ ఆశ చూపి ఆమెను సమీపంలోని ఓ పాడుబడిన షెడ్డుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారానికి పాల్పడి కిరాతకంగా హత్య చేశాడు. తల్లిదండ్రులు తమ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ఓ యువకుడు బాలికను ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. షెడ్డులో చిన్నారి శవమై కనిపించడంతో ప్రజా, కన్నడ, యువసంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. మరోవైపు, నిందితుడిని బిహార్‌కు చెందిన రితేశ్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. అతడు తప్పించుకునే ప్రయత్నంలో ఎదురు దాడికి దిగగా పోలీసులు కాల్పులు జరిపారు. రితేశ్‌కు మార్ ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఎస్ఐ, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు.

డీకేపై రూ.2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు

» గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఫిర్యాదు

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరాభివృద్ధి శాఖలో రూ.2 వేల కోట్లకుపైగా అవినీతి జరిగిందని రాజరాజేశ్వరీనగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఆరోపించారు. బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై ఫిబ్రవరిలో లోకాయుక్త, సీబీఐ, ఈడీకి ఆయన ఫిర్యాదు చేశారు. తాజాగా గవర్నర్‌ను కలిసి సమగ్ర వివరాలు అందించారు. రాజకాలువల పనులకు సంబంధించి అవినీతి జరిగినట్టు గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి పదవి నుంచి డీకే శివకుమార్‌ను తప్పించాలంటూ మునిరత్న ముందుగా సిద్దరామయ్యకు లేఖ రాసిన విషయం తెలిసిందే.

17న బిహార్‌లో మహా కూటమి పార్టీల భేటీ

» అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చ.. సీఎం అభ్యర్థిగా తేజస్వి?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 : బిహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన ఆరు పార్టీల మహా కూటమి ఈ నెల 17న సమావేశం కానుంది. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. కూటమి పార్టీల మధ్య ఈ విషయమై ఇప్పటి వరకు ఎటువంటి సమావేశం జరగలేదని కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాన్ని రచించేందుకు ఈ సమావేశం ఎంతో ముఖ్యమైనదని ఆయన అన్నారు. సీట్ల పంపకంపైనా ప్రాథమిక చర్చలు జరపనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా ఈ కూటమి ఇప్పటి వరకు సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాతే సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలెట్ ఇటీవల చెప్పారు. అయితే ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌నే సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

గడువు వద్దు!

బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునః పరిశీలించాలి



» రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడంపై రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది. తీర్పును పునఃపరిశీలించాలని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్ ధర్మాసనాన్ని కోరనుంది. కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా సరిగా ప్రస్తావనకు రాలేదని, వాటిని పరిగణనలోకి తీసుకుని సుప్రీం తీర్పును పునః పరిశీలించాల్సి ఉంటుందని సీనియర్ అధికారులు తెలిపారు. ఈ మేరకు పిటిషన్‌ను సిద్ధం చేసే ప్రక్రియ మొదలైందని వెల్లడించారు. రాష్ట్రాల చట్టాలకు రాష్ట్రపతి ఆమోదం, ఇతర నిర్ణయాలకు సంబంధించి కేంద్ర హోంశాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు ఈ అంశానికే సంబంధించినది కావడంతో రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది.

రద్దయిన బిల్లులకూ ప్రాణం పోసేలా..!

అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... గరిష్ఠంగా 3నెలల్లో నిర్ణయం తెలపాలంటూ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో గవర్నర్లు పరిశీలన కోసం పంపిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి కూడా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అయితే సుప్రీంలో వాదనల సందర్భంగా కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సరిగా ప్రస్తావనకు రాలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రద్దయిన (ల్యాప్స్ అయిన) బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ఏదైనా బిల్లును గవర్నర్ తిప్పిపంపినా, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుండా ఆపేసినా.. ఆ బిల్లు రద్దయినట్టేనని తెలిపారు. సదరు బిల్లును యథాతథంగా గానీ, మార్పులు చేసిగానీ తిరిగి శాసనసభలో ఆమోదించాల్సిందేనని స్పష్టం చేశారు. కానీ తమిళనాడు గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఆపేసిన బిల్లులు ఆమోదం పొందినట్టుగానే భావించాలంటూ తీర్పు ఇచ్చిన ధర్మాసనం.. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. సాంకేతికంగా రద్దయిన బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఆ తీర్పు ఉందని వివరించారు. రాష్ట్రపతికి అందిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ 2016లో ఇచ్చిన ఆఫీస్ మెమొరాండం ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ ఇలా గడువు నిర్దేశించడాన్ని పునః పరిశీలించాలని పేర్కొన్నారు.

మరో వివాదంలో తమిళనాడు గవర్నర్

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి మరో వివాదంలో చిక్కుకున్నారు. మదురై జిల్లా త్యాగరాజన్ ఇంజనీరింగ్ కాలేజీలో కంబ రామాయణంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, జైశ్రీరామ్ అంటూ నినాదం చేసి, విద్యార్థుల చేత కూడా ఆ నినాదాలు చేయించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండే గవర్నర్ ఒక మతానికి చెందిన నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

పీఎంఎల్ఏ పరిధిలోకి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు!

డ్రీమ్11, గేమ్స్24x7, విన్‌జో వంటి ఆన్‌లైన్ రియల్-మనీ గేమింగ్ కంపెనీలను మనీలాండరింగ్ నిరోధక చట్టాల (పీఎంఎల్ఏ) పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. ఈ కంపెనీలకు తప్పనిసరిగా కేవైసీ వంటి వాటిని వర్తింపచేయడంతో పాటు అనుమానాస్పద లావాదేవీలను ట్రాక్ చేసి, నిఘా ఉంచేలా కేంద్రం దృష్టిసారిస్తోంది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను 'ఆర్థిక నివేదికలను లిఖితపూర్వకంగా నివేదించాల్సిన సంస్థలు'గా కేంద్రం పేర్కొంది.

భారత్ అమ్ముల పొదిలో 'లేజర్' అస్త్రం!

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత శక్తిమంతమైనవని, ఎలాంటి లక్షిత డ్రోన్స్‌నైనా ధ్వంసం చేస్తాయని డీఆర్‌డీవో తెలిపింది. ఈ అధునాతన వ్యవస్థ భారత సైనిక దళాలకు 'గేమ్ చేంజర్'గా మారనుందని పేర్కొంది. ప్రస్తుతం ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో డ్రోన్లను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో డీఆర్‌డీవో కూడా ఆ దిశగా అడుగులు వేసి విజయం సాధించింది. "కర్నూలులో నిర్వహించిన వెహికల్ మౌంటెడ్ లేజర్ ఎనర్జీ డైరెక్టెడ్ వెపన్(డీఈడబ్ల్యూ) ల్యాండ్ వెర్షన్ ప్రయోగం విజయవంతం అయింది. ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీ, డ్రోన్ల సమూహాన్ని డీఈడబ్ల్యూ ఎంకే-2(ఏ) ధ్వంసం చేసింది. అదేవిధంగా నిఘా సెన్సార్ వ్యవస్థను పనిచేయకుండా చేసింది. ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో ప్రపంచ వ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన లేజర్ డీఈడబ్ల్యూ వ్యవస్థలు ఉన్న అతి కొద్ది దేశాల సరసన భారత్ కూడా చేరినట్టయింది" అని డీఆర్‌డీవో తన 'ఎక్స్' ఖాతాలో వివరించింది. ప్రయోగానికి సంబంధించిన వీడియోను(డీఈడబ్ల్యూ ఎంకే-2(ఏ) లేజర్ పుంజాలు లక్ష్యాన్ని బూడిద చేసిన దృశ్యం)కూడా పంచుకుంది. "ఇప్పటి వరకు ఇలాంటి వ్యవస్థను ప్రదర్శించిన దేశాల్లో రష్యా, అమెరికా, చైనా ఉన్నాయి. ఇజ్రాయెల్ కూడా ఇదే తరహా ప్రయత్నాలు చేస్తోంది. దీనిని బట్టి మనం 4 లేదా ఐదో స్థానంలో ఉన్నాం" అని డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ తెలిపారు. ఇది మనకు 'స్టార్ వార్స్' సామర్థ్యాన్ని అందిస్తుందన్నారు. ఈప్రయోగంలో డీఆర్‌డీవోకు చెందిన పలుల్యాబ్‌లు, పరిశ్రమల సహకారం ఉందన్నారు. "తాజా ప్రయోగం స్టార్ వార్స్ సాంకేతికతలో ఒకటి మాత్రమే" అని పేర్కొన్నారు. దేశీయంగా రూపొందించిన ఎంకే-2(ఏ) డీఈడబ్ల్యూ లేజర్ అస్త్రం.. సుదూర లక్ష్యాలను కూడా మెరుపు వేగంతో సమర్థవంతంగా ఛేదించగలదని డీఆర్‌డీవో తెలిపింది. అదేవిధంగా డ్రోన్ల సమూహాలను, శత్రు నిఘా సెన్సార్లకు కూడా అడ్డుకట్ట వేయనుందని పేర్కొంది. ఈ అస్త్రం రూపకల్పనలో డీఆర్‌డీవోకు చెందిన సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్) హైదరాబాద్, వివిధ విద్యాసంస్థలు, పరిశ్రమలు భాగస్వామ్యం పంచుకున్నాయి.



లేజర్ పుంజంతో ధ్వంసమైన డ్రోన్

ఎలా పనిచేస్తుంది?

లేజర్ అస్త్రం ఎంకే-2(ఏ) డీఈడబ్ల్యూ- రాడార్ లేదా అంతర్నిర్మితమైన ఎలక్ట్రో ఆప్టిక్(ఈవో) వ్యవస్థ ద్వారా లక్ష్యాలను గుర్తిస్తుంది. ఆ వెంటనే కాంతి వేగంతో దూసుకుపోయి.. 30 కిలో వాట్స్ సామర్థ్యంతో కూడిన లేజర్ పుంజాలను ప్రయోగించడం ద్వారా లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. శత్రు డ్రోన్ల స్ట్రక్చర్‌ను నాశనం చేయడంతోపాటు వార్‌హెడ్‌ను విధ్వంసం చేస్తుంది. మానవ రహిత వైమానిక వ్యవస్థలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయా దేశాలు డ్రోన్ ఆధారిత యుద్ధాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో లేజర్ అస్త్రం ప్రాధాన్యం సంతరించుకుంది.

కర్నూలులో ఇది రెండో ప్రయోగం

» నాడు భూమి కేటాయించిన బాబు

కర్నూలు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కర్నూలులో నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్ నుంచి తాజాగా చేపట్టిన లేజర్ డీఈడబ్ల్యూ ప్రయోగం రెండోది. 2019, సెప్టెంబరు 11న తొలిసారి తక్కువ బరువున్న క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. తర్వాత 6 సంవత్సరాలకు డీఈడబ్ల్యూ ప్రయోగం చేపట్టారు. జిల్లాలోని ఓర్వకల్లు మండలంలో సువిశాలమైన రాక్ మైదానాలు, అటవీ ప్రాంతం ఉంది. 2015లో ఈ ప్రాంతాన్ని డీఆర్‌డీవో డైరెక్టర్లు పరిశీలించారు. పాలకొలను, దుర్గాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కాల్వ గ్రామాల పరిధిలోని ప్రాంతం డీఆర్‌డీవో ఆయుధ తయారీ పరిశ్రమ, ప్రయోగాలకు అనువుగా ఉంటుందని రక్షణ శాఖకు నివేదించారు. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు 2,781 ఎకరాలు కేటాయించారు.



ముర్షిదాబాద్‌లో భద్రతా బలగాలు

బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

» 'వక్ఫ్' అల్లర్ల వెనక జేఎమ్‌బీ ఉగ్రసంస్థ.. 7 జిల్లాల్లోకి విస్తరణ

» కేంద్ర నిఘా వర్గాల ఆందోళన.. పారిపోతున్న హిందువులు


కోల్‌కతా, ఏప్రిల్ 13: కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్‌లో హింస వెనుక బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ప్రమేయం ఉన్నట్టు కేంద్ర అత్యున్నత నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతంలో బెంగాల్‌లో దాడులు చేసిన చరిత్ర జమాతుల్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్‌కు(జేఎమ్‌బీ) ఉంది. ప్రస్తుతం ఆ సంస్థ తిరిగి బెంగాల్‌పై పట్టు బిగిస్తున్నదని, ఏడు సరిహద్దు జిల్లాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నదని ఈ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆ జిల్లాల్లోని మదర్సాల నుంచి యువకులను భారీగా జేఎమ్‌బీ నియమించుకుంటోందని చెబుతున్నాయి. ముర్షిదాబాద్, 24 పరగణాల జిల్లాల్లో మొదలైన అల్లర్ల వెనుక ఉన్నది ఈ సంస్థయేనని అంటున్నాయి. దీనివల్ల బెంగాల్ తీవ్రమైన శాంతిభద్రతల సమస్యను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇస్లామిక్ ఎజెండా కింద తాజాగా వక్ఫ్ ఆందోళనలను రగుల్చుతున్నదనే భయాందోళనలను నిఘా సంస్థలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అల్లర్లు జరుగుతున్న ప్రాంతాల్లో ఆదివారం బీఎస్ఎఫ్‌కు చెందిన 8కంపెనీల జవాన్లు, వెయ్యిమంది పోలీసులను మోహరించారు. ఇప్పటివరకు 150 మందిని అరెస్టు చేశారు. డీజీ స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు.. కీలక పోలీసు అధికారులు పరిస్థితులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇదిలాఉండగా, అల్లర్ల తర్వాత దాదాపు 400 మంది హిందువులు ముర్షిదాబాద్, ధూలియన్ తదితర ప్రాంతాలను వదిలిపెట్టి భగీరథి నదిని దాటి పొరుగు జిల్లా మాల్దాకు పారిపోయినట్టు బెంగాల్ బీజేపీ చీఫ్ సువేందు అధికారి తెలిపారు. సీఎం మమతా బెనర్జీ బుజ్జగింపు రాజకీయాల కోసం కావాలనే బెంగాల్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదం విస్తరించడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు. అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలను సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కింద కల్లోలిత ఏరియాలుగా ప్రకటించాలంటూ కేంద్రానికి బీజేపీ ఎంపీ జ్యోతిర్మయి సింగ్ లేఖ రాశారు.

దక్షిణ కొరియా పిలుస్తోంది!

» టెక్ నిపుణులకు 'టాప్ టైర్ వీసా'తో కొరియా స్వాగతం

» ఉన్నత చదువు, అనుభవం ఉంటే గొప్ప అవకాశాలు

» మూడేళ్ల తర్వాత శాశ్వత నివాసానికీ అవకాశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: ఇటీవలి కాలంలో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న దేశాల్లో దక్షిణ కొరియా కూడా ఒకటి. ఆ దేశ సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి అందాలు, రుచికరమైన వంటకాలు, ఉర్రూతలూగించే కొరియన్ మ్యూజిక్.. ఇలాటింవెన్నో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో చాలామంది భారతీయులు సెలవుల్లో ఎంజాయ్ చేయడానికి దక్షిణ కొరియాలో వాలిపోతున్నారు. పర్యాటకంగా ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న దక్షిణ కొరియా తాజాగా తమ దేశంలో స్థిరపడాలనుకునే వారికి కూడా మంచి అవకాశాలు కల్పిస్తోంది. 'మీ వద్ద అద్భుతమైన నైపుణ్యం ఉంటే.. మా దేశానికి రండి.. ఇక్కడే పనిచేసుకుంటూ కోట్లు సంపాదించుకోండి.. కావాలనుకుంటే ఇక్కడే స్థిరపడండి..' అంటూ సాదర స్వాగతం పలుకుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన 'టాప్ టైర్ వీసా వ్యవస్థను ప్రారంభించిన కొరియా.. భారతీయులతో సహా వివిధ దేశాలకు చెందిన నిపుణులకు తమ దేశంలోని హైటెక్ కంపెనీల్లో పనిచేసుకునేందుకు, ఇక్కడే ఎక్కువకాలం నివాసం ఉండేందుకు మార్గం సుగమం చేసింది. నూతన ఆవిష్కరణలకు తోడ్పడే సీనియర్ ఇంజనీర్లకు, వారి కుటుంబాలకు దీర్ఘకాలిక రెసిడెన్స్ పర్మిట్‌కు అవకాశం కల్పించే ఎఫ్-2 వీసాను అందిస్తోంది. "ప్రపంచ టాప్-100 విశ్వవిద్యాలయాల్లో ఏదో ఒకదానిలో మాస్టర్స్ లేదా పీహెచ్‌డీ చేసినవారు. టాప్ గ్లోబల్ కంపెనీల్లో కనీసం ఎనిమిదేళ్ల పనిచేసిన అనుభవం ఉన్నవారు" ఈ ఎఫ్-2 వీసాలకు అర్హులు. దరఖాస్తుదారులు కనీసం రూ.88.6 లక్షల వార్షిక వేతనాన్ని అందుకుంటూ ఉండాలి. రూ.1.2 కోట్ల వార్షిక వేతనం అందుకునేవారికి విద్య, పని అనుభవం వంటి అర్హతల్లో సడలింపు ఉంటుంది. ఈ ఏడాది మార్చిలో రూపొందించిన ప్రణాళికలో గ్లోబల్ టెక్ సంస్థల నుంచి కనీసం 1000 మంది సీనియర్ ఇంజనీర్లను తీసుకోవాలని నిర్ణయించినట్టు దక్షిణ కొరియా అధికారులు తెలిపారు.

కులగణన నివేదిక అమలుపై కంగారు లేదు!

» హడావుడి నిర్ణయాలు ఉండవు: డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కులగణన నివేదికను శుక్రవారం కేబినెట్ స్వీకరించిదని, అమలు విషయంలో కంగారు లేదని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నివేదికపై రాజకీయ విమర్శలు ఉన్నాయని, అమలు విషయంలో హడావుడి నిర్ణయాలు ఉండబోవన్నారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా అన్ని కులాలకు న్యాయం చేయదలిచామన్నారు. మంత్రులకు నివేదిక ప్రతులు చేరాయని, సమగ్రంగా అధ్యయనం చేసి ఈ నెల 17న చర్చించేందుకు ప్రత్యేక కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య శనివారం బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ.. నివేదిక స్వీకరించామని, 17న జరిగే కేబినెట్ తర్వాత స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం బీసీలకు 32శాతం రిజర్వేషన్ ఉందని, నివేదిక సిఫారసు ప్రకారం 52 శాతానికి పెరగనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 7శాతంతో కలిపి రిజర్వేషన్లు 75శాతానికి చేర్చాలని సిఫారసులు ఉన్నాయి. కాగా.. కులగణన నివేదికను రాష్ట్రంలో బలమైన సామాజికవర్గమైన వీరశైవలింగాయతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నివేదిక ప్రకారం రాష్ట్రంలో ముస్లింలు 75.25 లక్షల మంది ఉన్నారు. దీంతో ప్రస్తుతం 4 శాతంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్ 8 శాతానికి పెరిగే అవకాశం ఉంది.



మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి.. అందుకు దేవుని మీద కానీ,
మహనుభావుల మీద కానీ ఆధారపడవద్దు - అంబేద్కర్



అశ్వవాహనంపై రామయ్య దర్శనం



అశ్వ వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వారి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిదో రోజు ఆదివారం రాత్రి అశ్వవాహనంపై దశరథరాముడు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీరామచంద్రుడు కాళీయమర్దన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైసీపీ బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ఆర్థికంగా బలోపేతానికి మార్గం చూపిస్తాం
- ఆత్మకూరు ఎస్సీ కుటుంబాలకు సీఎం హామీ
- జూలకంటి సారథ్యంలో బాబుతో బాధితుల భేటీ


అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ బాధిత కుటుంబాలన్నిటినీ పార్టీ తరఫున ఆదుకుంటామని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతల దాష్టీకాలకు గురైన పల్నాడు జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన పలు ఎస్సీ కుటుంబాలు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉండవల్లి నివాసంలో సీఎంను కలిశాయి. ఆ ఐదేళ్లలో తమ కష్టాలను వారు వివరించారు. 127 ఎస్సీ కుటుంబాలు వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలకు గురయ్యాయని తెలిపారు. ప్రాణాలు కాపాడుకోవడానికి పుట్టిన ఊరు వదిలి ఐదేళ్లపాటు వేరే గ్రామాల్లో తలదాచుకున్నామని చెప్పారు. తాము ఊళ్లో లేకపోవడంతో తమ ఇళ్లను కూడా ధ్వంసం చేశారని తెలిపారు. సీఎం స్పందిస్తూ.. పార్టీ కోసం పోరాడిన ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న ఇళ్లను మరమ్మతులు చేయిస్తామని.ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా బలోపేతం చేసే మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు.

బతుకులు బుగ్గిపాలు



పేలుడు ధాటికి ధ్వంసమైన బాణసంచా తయారీ కేంద్రంలో షెడ్లు

సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి



కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో 8మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలకు ఫోన్‌చేసి మాట్లాడారు. క్షతగాత్రులకు అత్యవసరంగా, మెరుగైన వైద్యసేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని సూచించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కాగా, మృతుల కుటుంబాలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. కైలాసపట్నానికి చెందిన మదపాల జానకీరామ్ గ్రామ శివారులో శ్రీవిజయలక్ష్మీ ఫైర్‌వర్క్స్ పేరుతో సుమారు 15ఏళ్ల నుంచి బాణసంచా తయారీ కేంద్రాన్ని నడుపుతున్నారు. ఆదివారం ఈ కేంద్రంలో యజమానితో పాటు మొత్తం 16మంది పనిచేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొంతమంది కార్మికులు షాట్ బాక్స్‌లో మందుగుండు కూరుతుండగా ఒత్తిడి అధికమై నిప్పురవ్వలు రేగి రెప్పపాటులో అక్కడ ఉన్న ముడిపదార్థాలు, తయారైన బాణసంచాకు మంటలు అంటుకుని భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పెద్దఎత్తున మంటలు లేచాయి. పేలుడు ధాటికి కైలాసపట్నం, రాట్నాలపాలెం, కోటవురట్ల, జగ్గంపేట గ్రామాల్లో భూమి కంపించింది. కోటవురట్ల పోలీసులు ఇచ్చిన సమాచారంతో నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే పలువురు మృతిచెందారు. క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంలో అప్పికొండ తాతబ్బాయి(50), పురం పాప(40) గుంపిన వేణు(40), సేనాపతి బాబురావు(56), దాడి రామలక్ష్మి(38) సంగరాతి గోవింద(45), మెడిసి హేమంత్ (25), దేవర నిర్మల(38) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మదపాల జానకీరామ్, సియాద్రి గోవింద, సంగరాతి శ్రీను, గుంపిన సూరిబాబు, జల్లూరు నాగరాజు, వేళంగి సంతోషి, వేళంగి షరోణి, వేళంగి రాజును తొలుత కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేళంగి రాజు, సూరిబాబు, సంగరాతి శ్రీనును నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి, మిగిలిన ఐదుగురిని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.



పేలుడు ధాటికి ఆనవాళ్లు లేకుండా పోయిన బాణసంచా తయారీ కేంద్రం

ప్రధాని మోదీ సంతాపం

బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నిధుల నుంచి మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న హోంమంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్

ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ: హోంమంత్రి

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఎంపీ సీఎం రమేశ్‌తో కలిసి పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేలుడు ఘటన అత్యంత దురదృష్టకమరని అన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు రూ.15లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులు ఉన్నాయని, లైసెన్స్‌దారుడు అన్ని జాగ్రత్తలు తీసుకొని కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ సీఎం రమేశ్ చెప్పారు.

మృతుల కుటుంబాలకు పవన్ సానుభూతి

బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడులో ఎనిమిది మంది దుర్మరణం చెందారని తెలిసి దిగ్భ్రాంతి గురైనట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుందన్నారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్య, సూక్ష్మ పరిశ్రమల్లో పర్యావరణ సంబంధిత అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలతో పాటు భద్రతాపరమైన జాగ్రత్తల గురించి తదుపరి విశాఖ పర్యటనలో దృష్టిపెడతానని పేర్కొన్నారు. ప్రమాదంపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

ఆరోగ్యశాఖ మంత్రి ఆరా

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆరాతీశారు. ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం అదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

ఆలయానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ముగ్గురు మహిళల దుర్మరణం, 11 మందికి గాయాలు
- ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొన్న కంటైనర్
- శ్రీసత్యసాయి జిల్లాలో దుర్ఘటన
- సీఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి



ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో, ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్న మృతదేహాలు

హిందూపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయంలో జాగరణ చేసి తిరిగివస్తున్న భక్తుల ఆటోను కంటైనర్ ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలు మృతి చెందగా, 11 మంది గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం క్రాస్ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. హిందూపురం మండలం కొటిపిలోని చౌడేశ్వరీమాత ఆలయంలో పౌర్ణమి జాగరణ కోసం రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన 13 మంది గోనిమేకలపల్లి వాసి బాబు ఆటోలో శనివారం రాత్రి వచ్చారు. రాత్రి జాగరణ చేసి, తెల్లవారుజామున 4.30గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో పరిగి మండలం ధనాపురం క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కన ఆటో ఆపి, డ్రైవర్ బాబు మొహం కడుక్కుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. ఆటో రోడ్డు పక్కనున్న ముళ్ల పొదల్లోకి ఎగిరిపడటంతో అందులోని ఆదిలక్ష్మమ్మ(60), అలివేలమ్మ(40), సాకమ్మ (70) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో పరిగి పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో అంజినరెడ్డి, ఆయన భార్య ప్రమీల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కంటైనర్‌ను సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బెంగళూరులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరాతీశారు. జిల్లాకి చెందిన బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. బాధిత కుటుంబాలను ఫోన్‌లో పరామర్శించారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. గాయపడిన వారిని పరామర్శించారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ.. తండ్రీకొడుకు దుర్మరణం

బలిజిపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ కొన్న ఘటనలో తండ్రీకొడుకు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. బలిజిపేటకు చెందిన ముడుసు రామయ్య (30) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. తన మూడేళ్ల కుమారుడు పవన్ పేరిట మొక్కు చెల్లించేందుకు శనివారం సాయంత్రం ఆటోలో శ్రీకాకుళం జిల్లా గార మండలం వత్సవలస రాజులమ్మ యాత్రకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రాజాంలో బంధువులను ఎక్కించుకుని వెళ్లాడు. దర్శనం అనంతరం బంధువులను రాజాంలో విడిచిపెట్టి తండ్రీకొడుకు స్వగ్రామానికి వస్తుండగా కొల్లివలస సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామయ్య, పవన్ అక్కడికక్కడే మృతి చెందారు.

పాడేరు ఘాట్‌లో అదుపుతప్పిన బొలెరో



లోయలో పడిన బొలేరో వాహనం

మాడుగుల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బతుకు తెరువుకోసం పొట్ట చేత్తో పట్టుకొని వలస వెళుతున్న కూలీలు ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బొలెరో వ్యాన్ లోయలోకి దూసుకుపోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా సిద్ధలమామిడి, రాళ్లగెడ్డ, కొత్తవలస, బొడ్డుగూడ గ్రామాలకు చెందిన 18 మంది కూలీలు, తెలంగాణలో కూలి పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం బొలెరో వాహనంలో బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పాడేరు ఘాట్‌రోడ్డులో వంట్లమామిడి దాటిన తరువాత కోమాలమ్మ పనుకు వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలై వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. చీకటిగా ఉండడంతో లోయలో నుంచి పైకి రాలేక, బాధితులు పెద్దగా కేకలు వేస్తున్నారు. కొంతసేపటి తరువాత ద్విచక్ర వాహనదారులు గమనించి, సెల్‌ఫోన్ లైట్లతో పరిశీలించారు. క్షతగాత్రులను రోడ్డుపైకి తీసుకువచ్చే అవకాశం లేకపోవడంతో తెల్లవారుజామున 3గంటల సమయంలో మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి లోయలో నుంచి క్షతగాత్రులను మాడుగుల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడిన ఏడుగురిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన మిగిలిన వారికి మాడుగులలో చికిత్స అందించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు అనకాపల్లి, మాడుగుల ఆస్పత్రులకు చేరుకుని చికిత్స పొందుతున్న వారిని తీసుకెళ్లారు. కోరాపుట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటామని చెప్పారు.

హోమియోపతిలో త్వరలో సూపర్ స్పెషాలిటీ కోర్సులు

- ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివమూర్తి వెల్లడి
- గుంటూరులో ఘనంగా హోమియో వైద్యుల రాష్ట్ర సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివమూర్తి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హోమియోపతిలో త్వరలో సూపర్ స్పెషాలిటీ (డీఎం) కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి వెల్లడించారు. ఆదివారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన హోమియోపతి వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ 18వ వార్షిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హోమియోపతిలో ఇప్పటివరకు పీజీ (ఎండీ), పీహెచ్‌డీ వంటి కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఈ వైద్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు డీఎం సూపర్ స్పెషాలిటీ కోర్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. గుడివాడ, రాజమండ్రి, కడప, అనంతపురం, గుంతకల్లు, తాడేపల్లిగూడెంలోని హోమియోపతి కాలేజీల్లో ఖాళీగా ఉన్న వైద్య బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐఐహెచ్‌పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ పంకజాక్షన్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.సంగమేశ్వరరావు త దితరులు ప్రసంగించారు.

ఐఐహెచ్‌పీ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా నరేంద్రనాథ్

ఐఐహెచ్‌పీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా డాక్టర్ నరేంద్రనాథ్ (గుంటూరు) ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీబీకే సతీష్ (విశాఖపట్నం), కోశాధికారిగా ఎంఎస్ఎస్ శాస్త్రి (కాకినాడ), గుంటూరు జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ లక్ష్మీకుమారి (పొన్నూరు) ఎన్నికయ్యారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అనంతలో ర్యాలీ

- పాలస్తీనా జెండా ప్రదర్శనపై వివాదం



అనంతరంలో మైనారిటీ సంఘాల ర్యాలీలో పాలస్తీనా జెండాను ప్రదర్శిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలస్తీనా జాతీయ జెండాను ప్రదర్శించడంపై వివాదం చెలరేగింది. ర్యాలీల పేరుతో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పాలస్తీనా జెండాలను ప్రదర్శిస్తే సహించబోమని బీజేపీ నేత, రాష్ట్రాడు అసెంబ్లీ కన్వీనర్ రావి చైతన్య కిషోర్ స్పష్టంచేశారు. పాలస్తీనా జెండాలను ప్రదర్శించిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశానికి రెడ్‌షర్ట్ వలంటీర్ల సేవలు అవసరం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో అనాలోచిత నిర్ణయాలు, వికృత చర్యలతో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. జగన్ వైఖరితో రాష్ట్రంలో లక్షలాది గృహ, భవన, దుకాణ సముదాయాలు నిరుపయోగంగా మారి అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినాకాకాని గ్రామంలో జరుగుతున్న సీపీఐ జన సేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆదివారం ఆయన సందర్శించి యువకుల విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జాతీయ విపత్తులు, వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సీపీఐ అనుబంధ సంఘం జన సేవాదళ్ వెలకట్టలేని సేవలు అందిస్తుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 26న సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా సేవల కోసం దేశవ్యాప్తంగా రెడ్‌షర్ట్ వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి రెడ్ షర్ట్ వలంటీర్ల సేవలు అవసరమన్నారు.

టీటీడీపై చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- భూమనకు మంత్రి సుభాష్ హెచ్చరిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానంపై చౌకబారు రాజకీయాలు చేస్తూ తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సహజంగా మరణించిన గోవుల మరణాలపై చిల్లర రాజకీయాలు చేయొద్దని కరుణాకరరెడ్డిని హెచ్చరించారు. టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయన చేసిన అక్రమాలు భక్తులు, ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఎక్కడో చనిపోయిన గోవులను తిరుమల గోశాల గోవులుగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఇటువంటి వదంతులు నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

అసత్య ప్రచారం తగదు: మంత్రి కొండపల్లి

గజపతినగరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గోవుల మృతిపై సంబంధం లేని ఆరోపణలు చేయడం, తిరుమల తిరుపతి దేవస్థానంపై తప్పుగా మాట్లాడడం తగదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా గజపతినగరంలో టీడీపీ శ్రేణులు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో తిరుమల పవిత్రతను భ్రష్టు పట్టించిన నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత దేవస్థానంపై తప్పుడు ప్రచారానికి ఒడిగట్టడం సరికాదన్నారు. గోవుల మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఎటువంటి అవినీతి జరిగిందీ ప్రజలందరికీ తెలుసని చెప్పారు. నెయ్యిలో కల్తీ చేసి వ్యాపారాలు చేసిన వారు తిరుమల పవిత్రత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు.



ఎవరైతే నా ఇంటికి ఎన్నటికీ రాబోరో

ఎవరైతే నా ఇంటికి ఎన్నటికీ రాబోరో
వాళ్లను కలవడానికి
నేనే వాళ్ల దగ్గరికి పోతా

ఓ పొంగుతున్న నది ఎన్నటికీ రాదు నా ఇంటికి

నదుల్లాంటి మనుషుల్ని కలవడానికి
నదీ తీరానికి వెళ్తా
ఈతలు కొడతా, మునిగిపోతా

కొండలు గుట్టలు శిలలు చెరువులు
అసంఖ్యాకమైన చెట్లు పొలాలు
ఎన్నటికీ రావు నా ఇంటికి

పొలాలూ గాదెల్లాంటి మనుషుల్ని కలవడానికి
ఊరూరికీ, అడవులూ వంకలకూ వెళ్తా

ఎప్పుడూ పనిలో ఉండే వాళ్లను
నేను తీరికగా కాదు
వాళ్లతో ఒక అవసరమైన పని లాగా

కలుస్తూ ఉంటా—

దీన్ని నా ఏకైక చివరి కోరికలా
మొట్టమొదటి కోరికగా ఉంచుకోవాలనుంది.

హిందీ మూలం ■ **వినోద్ కుమార్ శుక్లా**

అనువాదం ■ **సుమనస్పతి రెడ్డి**

✆ 96761 80802

సోమవారం 14 ఏప్రిల్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

గోవిందరాజు సీతాదేవి పురస్కారం

గోవిందరాజు సీతాదేవి జాతీయ సాహితీ పురస్కారాన్ని నవలా విభాగంలో ఆర్.సి. కృష్ణస్వామి రాజు ('మేకల బండ'), కథా సంపుటి విభాగంలో కె.ఎ. మునిసురేష్ పిళ్లె ('గారడీవాడు') ఎంపికయ్యారు. త్వరలో నెల్లూరులో పురస్కార ప్రదానం జరుగుతుంది. పురస్కారానికి మొత్తం 10 నవలలు, 35 కథా సంపుటాలు వచ్చాయి. పంపిన రచయితలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

గోవిందరాజు సుభద్రాదేవి

బిరుదురాజు శతజయంతి

సాహిత్య అకాడమీ – శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బిరుదురాజు రామరాజు శతజయంతి సదస్సు ఏప్రిల్ 16 ఉ.10గంటలకు ఎన్‌టిఆర్ కళామందిరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. స్వాగతోపన్యాసం సి.మృణాళిని, అధ్యక్షులు టి. ఉడయవర్లు, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు, కీలకోపన్యాసం అమ్మంగి వేణుగోపాల్, గౌరవ అతిథి కె. లీలావతి. పాకనాటి జ్యోతి, గౌరీ శంకర్, తిరునగరి దేవకీదేవి తర్వాతి మూడు సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. శతజయంతి స్మారక సంచిక ఆవిష్కరణ ఉంటుంది.

సాహిత్య అకాడమీ

నాగభైరవ సాహితీ పురస్కారం

నాగభైరవ సాహిత్య పీఠం ఈ సంవత్సరం అనువాద సాహిత్యాన్ని ఆహ్వానిస్తున్నది. తెలుగు లోకి అనువాదమై 2021–2024 సంవత్సరాల మధ్య ప్రచురితమైన కథా సంపుటాలు, నవలలను నాలుగేసి ప్రతులను మే 10 లోపు పంపాలి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రచనలకు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు. 2025 ఆగస్టు 17న బహుమతి ప్రదాన సభ. ప్రతులు పంపాల్సిన చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202 – శ్రీ వెంకటసామి రెసిడెన్సీ, 2వ లైన్, రామయ్య నగర్, ఒంగోలు – 523 002, ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. వివరాలకు: 98497 99711.

నాగభైరవ ఆదినారాయణ

మలిశెట్టి పురస్కారం

జజ్జూరి వేణుకు మలిశెట్టి సీతారాం సాహిత్య పురస్కార ప్రదానం, ఎమ్మెస్సార్ కథల పోటీలో బహుమతి పొందిన కథలతో 'కథా ప్రపంచం' కథా సంకలనం 2024 ఆవిష్కరణ, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి నవల 'సాక్షాత్కారం' ఆవిష్కరణ, పలమనేరు బాలాజి కవితా సంపుటి 'లోపలేదో కదులుతున్నట్టు' ఆవిష్కరణ... ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 20 ఉ.10గంటల నుండి రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. వివరాలకు: 99850 13234.

మలిశెట్టి శ్యాం ప్రసాద్

'Final Mission' ఫైనల్ కాదు

చిన్నదాన్ని నేను
చిన్నతల నాది
అందులో తెలివి ఉందో లేదో తెలీదు
లేదనే అనుకుంటున్నాను
ఉంటే ఇలా మాట్లాడను కదా!

పాతకాలం దాన్ని నేను
శాంతి, గాంధీ, అహింస అనుకుంటూ
పాత మాటల్ని మననం చేసుకుంటూ
తిరుగుతున్నాను

అడవిని నమ్మిన దాన్ని నేను
అడవి అంటే అమ్మ
అడవి అంటే అన్నం
అందుకే అడవి అంటే మక్కువ

Insurgency, counterinsurgency
దశాబ్దాల రక్త చరిత్రను చూసింది అడవి
సల్వాజుడుం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్,
ఇప్పుడేమో కగార్ – ఫైనల్ మిషన్

హింస ప్రతిహింసల మధ్య తల్లడిల్లిపోతుంది అడవి
ఆదివాసీలు అడవి బిడ్డలు
పాపం, ఇప్పపూలు రాలినట్టు రాలిపోవడం
చూడలేకపోతున్నాను



ఆదివాసీలు ప్రజలే కదా!
ప్రజలు రాజ్యానికి పిల్లలే కదా!
సొంత పిల్లల్ని చంపుకోవడం న్యాయమేనా?
Genocide! ఈ ఊచకోత ఎవరి కోసం?
'శాంతి చర్చలు' శాంతిని ఇస్తాయి గాని,
'ఆపరేషన్ సమాధాన్'తో శాంతి వస్తుందా?

సెకండ్ సిటిజన్‌ని నేను
తెలీక ప్రశ్నిస్తున్నాను
ఏమీ అనుకోవద్దు
ముందే చెప్పాను
చిన్నతల నాది

■ **మహెజబీన్**

అంబేడ్కర్ తాత్వికతకు ఆనాటి కవితాభాష్యం

జాతీయోద్యమం, తదనంతర వామపక్ష, విప్లవోద్యమాల నేపథ్యంలో వెలువడిన కవిత్వంలో మహాత్మా గాంధీ, కారల్ మార్క్స్, లెనిన్, మావోల ప్రభావం ప్రగాఢంగా కనిపిస్తుంది. ఈ దిశగా కొంత పరిశోధన జరిగింది. ఆధునిక సాహిత్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రభావం గురించి సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముంది. సమకాలీన సంక్లిష్ట సందర్భానికి ఈ చర్చ దారిదీపంలా వెలుగునిస్తుంది. రాజ్యాంగ నైతికత దిశగా సృజనకారులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఆది ఆంధ్ర ఉద్యమం నుండి ఈనాటి దళిత ఉద్యమం వరకూ వెలువడిన వందేళ్ల సాహిత్యంలో అంబేడ్కర్ స్ఫూర్తిని విశ్లేషిస్తేనే తెలుగు విమర్శ పరిపుష్టమవుతుంది.

కుసుమ ధర్మన్న నుండి ఈనాటి దళిత కవుల వరకూ ఎంతోమంది అంబేడ్కర్ ఆశయాలను సముచితంగా కవిత్వీకరించారు. అంబేడ్కర్ తాత్వికతను శ్వాసగా ఏకైక ధ్యాసగా భావించి ప్రభావశీలమైన కవిత్వం, పాటలు రాసిన ప్రజాకవి రావూరి ఏకాంబరం. నిబద్ధుడైన 'భీమ' కావ్యకర్తగా కార్యకర్తగా అణగారిన వర్గాల్లో ఏకాంబరం అనంత చైతన్యాన్ని కలిగించాడు.

అంబేడ్కర్ సిద్ధాంతాన్ని 'సిరానిష్టం' చేసుకొన్న ప్రజాకవి రావూరి ఏకాంబరం, కృష్ణా జిల్లా పామర్రు సమీపంలోని నల్లకుంట గ్రామంలో 1924 సెప్టెంబర్ 24న జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబంలో పుట్టిన ఏకాంబరం ఎంతో కష్టపడి కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించాడు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పౌర సంబంధాల అధికారిగా 20ఏళ్ళ సేవలందించాడు. గన్నవరం శాసన సభ్యుడిగా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ పార్టీ నుండి పుచ్చలపల్లి సుందరయ్యపై పోటీ చేసి ఓడిపోయాడు. అంబేడ్కర్ అడుగుజాడల్లో మడమ తిప్పకుండాసాగిపోయిన ఈ ధన్యజీవి 2001 ఏప్రిల్ 21న తుది శ్వాస విడిచాడు.


విజయవాడ, గుడివాడ ప్రాంతాల్లో 1944లో జరిగిన బహిరంగ సభల్లో అంబేడ్కర్ ఆంగ్ల ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఏకాంబరం, ఆ మహా నాయకుని దృష్టిని ఆకర్షించాడు. ఈ సందర్భంలోనే ఏకాంబరం రాసిన "డాక్టరో అంబేడ్కరా! నీ నాయకత్వం లోకమెల్లను మేలు కొల్పెను" అనే పాట ఉభయ గోదావరి జిల్లాల్లో 'భీమ' మంత్రమై మారుమోగింది. "ఇంత పెద్ద విశాలదేశము/ సెంటు భూమి మాకు లేదు/ కసవు గుంటలే కాపురాలు/ జోరుగా పెనుగాలి వీచెను/ బోరుమని జడివాన కురిసెను/ కూలి నాలి జనాళి కొంపలు/ కూలిపోతే కష్టమెవరికి/ మాలవాడని మాదిగోడని మారు పేరు చండాలుడాయని/ మాల మాదిగ లేకమైతే మారిపోదా కాలచక్రం" అంటూ లయాన్వితంగా సాగే ఈ పాటకు నేటికీ ప్రాసంగికత ఉంది. చోడగిరి చంద్రరావు వందలాది సభల్లో ఈ పాటను ఆలపించి, ప్రజలను ఉద్రూతలూగించాడు. ఈ పాట విని అంబేడ్కర్ ఆనంద పరవశుడై కన్నీరు పెట్టుకున్నాడని పొనుగుమట్ల విష్ణుమూర్తి తన పరిశోధనా గ్రంథంలో రాశాడు.

రావూరి ఏకాంబరం ఆశు కవి. ప్రజాసమూహంలో పర్యటించే క్రమంలో సందర్భానుసారంగా ఆశువుగా, భావగర్భితంగా ఎన్నో పద్యాలు, పాటలు ఆలపించేవాడు. 1944 నుండి 1980 వరకూ ఏకాంబరం ఎన్నో పద్యాలు, పాటలు రాశాడు. వీటిలో చాలావరకు పత్రికల్లో ప్రచురితం కాకపోయినప్పటికీ పాత తరం అంబేడ్కరీయుల గుండె గొంతుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 1984లో రావూరి ఏకాంబరం సాహితీ ప్రచురణ కమిటీ ఏర్పడి ఆయన పద్యాల్లో కొన్నింటిని సేకరించి 'అంబేడ్కరో సమర సింహ' పేరుతో పద్యకవితల సంకలనాన్ని ప్రచురించారు. 46 పద్య కవితలున్న ఈ సంకలనం ఎంతో విలువైనది. జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, బొజ్జతారకం విశ్లేషణాత్మకమైన ముందు మాటలు రాశారు. ఆంధ్ర ప్రాంతంలో అంబేడ్కర్ పర్యటించడానికి మూలకారకుడైన నందనార్ హరికి ఈ గ్రంథాన్ని అంకితం చేశాడు కవి.

అంబేడ్కర్ ఔన్నత్యాన్ని, ఆయన బహుముఖీన ఉద్యమ కార్యాచరణ ఆవశ్యకతను, దేశ పునర్నిర్మాణానికి అవసరమైన సాంస్కృతిక విలువలను ఈ కావ్యం ద్వారా ఏకాంబరం చాటిచెప్పాడు. "నీ మహోజ్వల నిరుపమ నిర్విరామ/ సర్వతోముఖ విప్లవ సమర జ్వాల/ సమతకు పునాది వేసెను భీమ రాయ! భావ విప్లవ సామ్రాజ్య సార్వ భౌమ" అంటూ, నాలుగు దశాబ్దాల పాటు సాగిన అపూర్వమైన అంబేడ్కర్ పోరాటాన్ని నాలుగు పాదాల్లో ఏకాంబరం సముచితంగా పద్యీకరించాడు. "దేశభక్తుడెవడొ, దేశద్రోహియెవడొ/ గత చరిత్ర తవ్వి కథలు చెప్పి" పాలకులకు అంబేడ్కర్ దిక్సూచిగా నిలిచాడని ఈ కవి నిర్ధారించాడు. కులం, మతం, సంస్కృతి, భగవద్గీత, ప్రజాస్వామ్యం, బ్రాహ్మణవాదం, ప్రతిభ, గాంధీ తత్త్వం, రిజర్వేషన్లు, కులాంతర వివాహాలు తదితర అంశాలను అంబేడ్కర్ ఆలోచనల వెలుగుల్లో ఈ కవి నిర్వచించాడు. వాటి చుట్టూ రాజకీయ రహస్యాలను బట్టబయలు చేశాడు.

ఈ పద్య కవితా సంపుటి అంబేడ్కర్ తాత్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టోలాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్ఠూరమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు. "బోధిసత్వుపైన పోటీగా బ్రాహ్మణుల్/ మాంస భక్షణమును మానివేసి/ మాంసభక్షకులని" (గో మాంస భక్షణ) అంటరాని ప్రజలను వెలివేశారని బౌద్ధానికి వ్యతిరేకంగా రగిలిన అలనాటి కుహనావ్యూహాలను కవి తెలియపరిచాడు. 'పీడిత జననేత భీమరాయ!', 'భీమరాయ అంబేడ్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఏకాంబరం ఈ కావ్యాన్ని రచించాడు. 'విశ్వకళ్యాణదాయక', 'విప్లవాలరేడ', 'దళిత సాహితీ విధాత', 'నవ్య బౌద్ధధర్మ కావ్యశిల్పి' లాంటి ఔచితీమంతమైన విశేషణాలు అంబేడ్కర్ అసాధారణ మూర్తిమత్వానికి నిదర్శనంగా కనిపిస్తాయి.

ప్రాచీన, ఆధునిక సాహిత్యధోరణులపై ఏకాంబరం కన్నెర్రజేశాడు. బాస, కాళిదాస, వ్యాస, వాల్మీకులు వస్తుపరంగా ఒకే మూస పద్ధతిలో కావ్య రచన గావించారని, "బ్రాహ్మణాధిక్యమున్, బ్రాహ్మణోద్ధరణమున్ బోధించు గ్రంథాలు" (వ్యాసాదులు) రాసారని తద్వారా "బ్రాహ్మణేతరులను మానసిక బానిసలుగా" మార్చివేశారని ఏకాంబరం తీవ్రంగాఆరోపించాడు. "పాలు బోసి పెంచు పాడు సాహిత్యము/ మూఢ నమ్మకాలు ముదిరి పోవ" అంటూ అంధవిశ్వాసాలను పోషించేది పాడు సాహిత్యమని కవి త్రోసిపుచ్చాడు. సాహిత్యాన్ని మలుపు తిప్పిన అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం పరిమితులను సాహసోపేతంగా ప్రశ్నించాడు. సాహిత్యంతో సమరభేరి మోగించిన ప్రగతి శీల రచయితలకు "దండెత్త కులముపై దమ్ములు లేవని" వాదించాడు. "అడ్డుగోడ కులము, అడ్డమస్పృశ్యత/ వర్గదృష్టి జంపు, ప్రగతి జంపు/ అడ్డుగోడ మరిచి అరచెదరేలరా!" (అరసం, విరసం) అంటూ కుల మనే అడ్డు గోడలు కూల్చకుండా విప్లవం విజయవంతం కాదని చెప్పిన అంబేడ్కర్ దృష్టితో ఏకాంబరం రచయితలను నిరసించాడు. "మార్క్సును స్మరియించు, మావోను స్మరియించు/ పిల్లి మొగ్గలేయు కుల మడ్డు పడగానే" అని మేధావుల వైఖరిని దుయ్యబట్టాడు. "పిట్సుబర్గులోన వెంకన్న ప్రతిమను/ దర్శనంబు చేసి పరవశించు/ శ్రీశ్రీయా మార్క్సిస్టు?" అని మహాకవిని కూడా నిలదీశాడు. దళితేతరులు అంబేడ్కర్ స్మారక సభలను, వైశ్యేతరులు గాంధీ సభలను, కమ్మజనేతరుల్ త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక సభలను నిర్వహించినపుడే విశ్వ సోదర భావము వెల్లివిరుస్తుందని ఈ కవి పిలుపునిచ్చాడు.



'అంబేడ్కరో సమరసింహ' పద్య కవితాసంపుటి అంబేడ్కర్ తాత్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టో లాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్ఠూరమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు 'పీడిత జననేత భీమ రాయ!', 'భీమరాయ అంబేడ్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఈ కావ్యాన్ని ఏకాంబరం రచించాడు.



దళిత విద్యావంతులు, మేధావులు తమ జాతి లోని నిరుపేదల, నిరక్షరాస్యుల ఉద్ధరణకు ఏమాత్రం పాటుపడటం లేదని చివరి దశలో అంబేడ్కర్ బాధపడ్డాడు. "దళిత మేధావులు దాసానుదాసులైరి/ దళిత మేధావులు దండగ సరుకైరి, దళితుల తెగనమ్ము త్రాష్టులైరి" అంటూ ఏకాంబరం విమర్శించాడు. దళిత ప్రతినిధులు పాలక 'పార్టీల పాలేర్ల'గా మారిపోతున్నారని ఆవేదన చెందాడు. ఈ మేధావులు దండకమ్ములు మాని, దళితుల చరిత్రను వెలికి తీయాలని, దాస్యభాష్యాలు మాని సూటిగా సత్యాలు తెలియ చెప్పాలని హితవు పలికాడు. "నీవు పెట్టిన భిక్షకు నిజము తండ్రి! కుక్క మూతి పిందెలు కాచెనకట! అని కవి వాపోయాడు." "దాస్య జాడ్య జనిత దౌర్భాగ్య శేఖరుల్" అని తన జాతి జనులను ఆగ్రహంగా నిందించాడు. "సిద్ధాంతములు నాస్తి, రాద్ధాంతములు జాస్తి/ సిగపట్లు జాస్తయ్యె సిగ్గులేక/ స్వార్థ ప్రయోజనాల్, బహునాయకత్వాలతో" అంబేడ్కరీయులే అంబేడ్కరీయులకు ఆగర్భశత్రువులగా మారుతున్నారని ఆత్మ విమర్శ దృక్కోణంలో నుండి ఆరోపించాడు. బహుజనులకు మాల మాదిగలన్న చులకన అని, పై కులాలకు వీరు పచ్చి బానిసలని, కులపిశాచిని కూల్చంగా కలిసి రావాలని బహుజనులకు కవి పిలుపు చెప్పాడు. "మతకలహాలలో మృతి చెందు బహుజనుల్/ అగ్రకులోన్మాదులాదరికె రారు" అని మతకలహాల్లోని హింసను వ్యతిరేకించాడు.

ప్రత్యేకంగా తెలుగు భాషా సాహిత్యాలను, వ్యాకరణాన్ని అధ్యయనం చేయనప్పటికీ ఏకాంబరం ప్రతిభావంతంగా పద్య రచన చేశాడు. పంచమాత్రా గణాల ప్రయోగంతో అలవోకగా సీస పద్యాలను పాఠకుల హృదయ క్షేత్రాల్లో కదం తొక్కించాడు. ప్రజాకవుల పాటల్లా వ్యవహారిక భాషలో ఆటవెలది, తేటగీతి పద్యాలను తీర్చిదిద్దాడు. కావ్య శిల్పానికి ప్రాధాన్యత నివ్వకుండా జనజాగృతియే ధ్యేయంగా, అంబేడ్కర్ ఆశయాల ప్రచారానికి, దళిత చైతన్యానికి వాహికగా పద్యాన్ని మలుచుకున్నాడు. నిశిత భావ ప్రకటనకు యతి ప్రాసలు ప్రతిబంధకమైన సందర్భంలో ఛందో నియమాలను కూడా ధిక్కరించాడు. అర్థశతాబ్దం క్రితమే స్పష్టమైన అంబేడ్కర్ దృక్పథంతో, ప్రగాఢమైన భావ సాంద్రతతో రావూరి ఏకాంబరం రాసిన 'అంబేడ్కరో సమరసింహ' కావ్యం సమకాలీన సాహిత్యానికి గొప్ప స్ఫూర్తిని అందిస్తుంది.

(నేడు అంబేడ్కర్ జయంతి)

■ **కోయి కోటేశ్వరరావు**

✆ 94404 80274

ఒక గాయం రంగులేసుకునే కల

వ్యక్తిగతం కావచ్చు, సమాజగతం కావచ్చు, నైరాశ్యం నుండి ఆశవైపు తీసుకెళ్ళడమే ఏ కవితకైనా తొలి విజయం. ప్రేమలో ఒకటవడం, కారణాలేవైనా విడిపోతూ గాయపడటం వీటిని డీల్ చేసిన కవితను చదివి ప్రియమైనదిగా అనుకున్నామంటే ఆ కవిత నిర్మాణంలో కొత్తదనం మనల్ని వెంటాడుండవచ్చు. ఎత్తుగడలోనే- గాయాల మీద నడవడం ఇప్పుడు జీవితానికి పెద్ద పరీక్ష అంటాడు కవి.



ఆ సమయంలో ఎదురయ్యే హాయిగొలిపే గాలికి ప్రతిగా ఆనందం వ్యక్తం చేయలేని స్థితిని గుర్తుచేస్తూనే, ఇది పరామర్శలనో సానుభూతులనో వెతికి పెట్టే గీతం కాదు... కన్నీళ్ళకు మలుపులే తప్ప మజిలీలు ఉండవు అంటూ కొత్త ఆలోచనల పేటిక తెరుస్తాడు. ఏ విషయం పదేపదే కల్లోల పరుస్తుందో ఎంతకీ బోధపడక ఏ నిర్ధారణకూ రాలేని స్థితిలో ఉన్న మనిషిని బహుసున్నితమైనది కూడా బాధపెడుతుంది. ఎవరినైనా ప్రేమించడం, తనలోకి ఆహ్వానించడం, హృదయానికున్న జబ్బుగా ప్రకటించి, ప్రేమ పొందిన వాళ్లే చివరికి గాయపరిచినపుడు భరించలేనివారిగా తయారయ్యాక, గుండెని ఓదార్చేవాళ్ళెవరూ ఉండని నిస్సహాయతను చెబుతూ వెంటనే ఆ హృదయం చీకట్లో కిచకిచమని వెర్రి పాట పాడుకుంటుందంటాడు.

గాయపడినవాడిగా నీకు నీవే తోడు అంటూ తనకు తానే దిశానిర్దేశం చేసుకుంటాడు. చిట్టిపిల్లలాంటి తన హృదయాన్ని తానే ముద్దులాడుకోవాలంటాడు. చీకట్లో ప్రయాణం చేసే కళ్ళు తప్పనిసరిగా హాయిని ప్రసాదిస్తాయన్న నిర్ధారణకొస్తాడు. గుండెల్ని తవ్వుకున్న గాయాల దేహంలోనే అలసట దాహం తీర్చే నదులున్నాయని గుర్తుచేసుకుంటాడు. కన్నీళ్ళను కూడా తీయగా అనుభవించడమనేది రాబోయే జీవితాన్ని అందంగా మలచుకోగలిగే ఆలోచన. చివరిగా రాత్రి పూసే నక్షత్రాలను చూస్తూ గడపడం ఊరటగా వాటిని తెంపుకుంటే అవి ఉదయానికి పరిమళించే పూవులవుతాయనడమే గొప్ప ఊహ. దానికి కొనసాగింపుగా పువ్వులు మనుషుల్లా గాయపరచవు, సువాసన కొడతాయి అంటూ ముగిస్తాడు. ఈ కవితలో గాయం దుఃఖాన్ని ప్రేరేపిస్తుందన్న సామాన్య భావనను దాటి చూడగల అనుభూతిని అందుకోగలిగితే ఇది నాకే కాదు అందరికీ ప్రియ పద్యమే అవుతుంది.

■ **పాయల మురళీకృష్ణ**

✆ 83094 68318



లోపలికి

ప్రియ పద్యం

ఇది కొంత రాసుకునే పూట
ఏవేవో రంగులేసుకునే కల

గాయాల మీద నడుస్తూ పోతే ఏ ఊరొస్తుంది.
తీపిసలిపే గాలికి ఏం చెప్పాలి. ఇదేమీ
వెతుకులాటల గీతం కాదు. పరామర్శల పాచిక
లాడేందుకు తెగిన హృదయాలకు చేతులుండవు.
కన్నీళ్లకు మలుపులే కానీ మజిలీల ఊసుండదు.

ఏ గాలిపొర సర్రున కోసిపోతుందో అర్థం కాదు.
తల తెగిపడేవరకూ కత్తి పట్టుకుందెవరో బోధ
పడదు. ముద్దుచేసి తలుపులు తీయడమే
హృదయాలకున్న జబ్బు. గుండెల్లో కూర్చోపెట్టు
కున్న తర్వాత మనుషులు బరువు పెరుగుతారు.

లోపలి సావాసగాడా విను...
హృదయాలు మనుషుల్లో ఎగిరే చిట్టిపిల్లలు.
వాటికేడుపొస్తే అమ్మలుండరు. చీకటిగట్టు మీద
కిచకిచమంటమే తెల్సు. అదో వెర్రి పాట.
కన్నీళ్ల ఊట.

గాయాల వాడా...
నీ లోపలకి దర్జాగా నడువు. హృదయానికో
ముద్దుపెట్టు. చీకటిముసురు మీద పాకుతున్న
కళ్లల్లోనే హాయిని పాడే పావురాలుంటాయి.
గుండెల్ని తవ్వి దారిచ్చిన వాళ్ల దేహాల్లోనే
దాహాలని తీర్చే నదులుంటాయి. కన్నీళ్లకూ నవ్వు
తెప్పించే మార్మికతల యేరులుంటాయి.

పిచ్చివాడా...
వెళ్తూవెళ్తూ నాలుగు నక్షత్రాలు తెంపుకుపో.
తెల్లారికి మల్లెపూలవతాయి. దిగులు పడకు.
పూలు మనుషులు కాదు. పొద్దుటకు సువాసన
కొడతాయి.

■ **సిద్దార్థ కట్టా**



172 ఎకరాలు డీనోటిఫై!

ఓఆర్ఆర్ కోసం ఎన్టీఆర్ జిల్లాలో అటవీ భూములు

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కోసం ఎన్టీఆర్ జిల్లాలో అటవీ భూముల డీ నోటిఫై చేయటానికి వీలుగా ఎన్‌హెచ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. మొత్తం 172 ఎకరాల అటవీ భూములను డీ నోటిఫై చేయనున్నారు. ఈ భూములన్నీ కొండపల్లి (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరం గ్రామాల పరిధిలో ఉన్నాయి. ఇవన్నీ డీ నోటిఫికేషన్ పరిధిలోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లో పర్యావరణ అనుమతుల కోసం అధికారులు సిద్ధమవుతున్నారు.

- కొండపల్లి (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరంలో గుర్తింపు
- ప్రత్యామ్నాయంగా 172 ఎకరాలు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- పర్యావరణ అనుమతులకు ఎన్‌హెచ్ అధికారులు సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం ఐదు కిలోమీటర్ల పరిధిలో అటవీ భూములు ఉన్నాయి. ఒక కిలో మీటరు అంటే ఏడు హెక్టార్లు. ప్రస్తుతం 70 మీటర్ల వెడల్పు లెక్కన చూసుకుంటే 86 ఎకరాల అటవీ భూములు అవసరమవుతున్నాయి. అదే అవుటర్ రింగ్ రోడ్డు వెడల్పు 140 మీటర్లు అయితే మరో 86 ఎకరాల అటవీ భూములను తీసుకోవాల్సి వస్తుంది. అంటే ఈ లెక్కన 172 ఎకరాల అటవీ భూములు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు కాకపోయినా భవిష్యత్తులో అయినా సరే ఈ మేరకు అటవీ భూములను డీనోటిఫై చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎప్పుడు పడితే అప్పుడు డీ నోటిఫై అనేది చేసేది కాదు కాబట్టి.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముందుగానే 172 ఎకరాల అటవీ భూములకు సంబంధించి డీనోటిఫికేషన్‌కు ప్రతిపాదించాలని ఎన్‌హెచ్ వర్గాలు భావిస్తున్నాయి.

వెడల్పుపై కేంద్రం నుంచి రాని స్పష్టత!

కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా అవుటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి వెడల్పు ఎంత అనే దానిపై స్పష్టతనిచ్చేలా వినిట్స్ రాకపోవడంతో దీని కోసం ఎన్‌హెచ్ అధికారులు ఎదురు చూస్తున్నారు. మినిట్స్ రాగానే అవసరాన్ని బట్టి అటవీ భూముల డీ నోటిఫికేషన్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరం అటవీ ప్రాంతాల మీదుగా ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ వస్తోంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు ఈ భూములు అవసరం అవుతున్నాయి. ఈ భూముల డీ నోటిఫై చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని, ఇబ్బందులు తలెత్తవని ఎన్‌హెచ్ అధికారులు అంటున్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఎన్టీఆర్ జిల్లాలో ఆంధ్ర - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో రెండు టన్నెల్స్ నిర్మాణం చేపట్టవలసి మిగతా 6లో..



అవుటర్‌లోనూ 'హై టెన్షన్'

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు కూడా హై టెన్షన్ లైన్స్ సమస్య ఉంది. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం 34 చోట్ల హై టెన్షన్ విద్యుత్ వైర్లు అడ్డొస్తున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో 16 చోట్ల ఈ పరిస్థితి ఉంటే, అవుటర్ రింగ్ రోడ్డులో 34 చోట్ల హై టెన్షన్ విద్యుత్తు లైన్స్ వస్తున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో హై టెన్షన్ విద్యుత్తు లైన్ల మార్పిడికి అనేక సమస్యలు ఏర్పడ్డాయి. దాదాపు మూడేళ్లుగా ఈ సమస్యలు తెగటం లేదు. తేలటం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్‌హెచ్ అధికారులు ముందస్తుగా ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో వస్తున్న సమస్యలు, అభ్యంతరాలు, కోర్టు కేసులను దృష్టిలో పెట్టుకుని అమరావతి అవుటర్ రింగ్ రోడ్‌లో అలాంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండడానికి ఇప్పటి నుంచే తగిన అలైన్‌మెంట్స్‌ను సిద్ధం చేసుకోవాలని, స్థానిక రైతులతో ఇబ్బందులు లేకుండా వారితో సంప్రదింపులు జరపాలని కూడా ఎన్‌హెచ్ అధికారులు సూచిస్తున్నారు.

అలైన్‌మెంట్ లొకేషన్ల మార్పు పూర్తి

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు మొత్తం ఇప్పటి వరకు 13 లొకేషన్లలో మార్పులు, చేర్పులు జరిగాయి. మొదటి దశలో తొమ్మిది లొకేషన్లలో ఈ మార్పులు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎనిమిది లొకేషన్లలోనూ, గుంటూరు జిల్లాలో ఒక లొకేషన్‌లోనూ అలైన్‌మెంట్ మార్పులు జరిగాయి. ఆ తర్వాత కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, పేరేచర్లలో మరో నాలుగు చోట్ల అలైన్‌మెంట్ మార్పుకు సూచించింది. రెండో దశలో అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాలో అయితే లేవు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శ్మశానాలు, చెరువులు ఆక్రమణల వంటివి ఉండడంవల్ల అలైన్‌మెంట్‌లో స్వల్ప సవరణలు చేపట్టాల్సి వచ్చింది.

ఆలయం ముందు రోడ్డు మధ్యగా నిర్మించిన ప్రహరీ



కబ్జా కాలనీ

సన్‌సిటీ కాలనీలో విచ్చలవిడిగా కబ్జాలు

ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి విక్రయాలు

- నిర్మాణాలకు అనుమతులిస్తున్న టౌన్‌ప్లానింగ్
- కబ్జా స్థలాలకు రోడ్లు వేసిన ఇంజనీరింగ్ విభాగం
- అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ ఆలయ పూజారి
- 1.20 ఎకరాల విలువ సుమారు రూ.15 కోట్లు

అది అజిత్‌సింగ్‌నగర్‌లోని సన్‌సిటీ కాలనీ.. పేరుకు కాలనీ అయినా ఇది కబ్జాల పుట్ట. ఇక్కడ ఒక్క ప్రైవేట్ స్థలం కూడా ఉండదు. అన్నీ ఇరిగేషన్ శాఖ భూములే. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములను కబ్జాచేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న కబ్జాకోరులు ఏకంగా వాటన్నింటినీ ఓ కాలనీగా సృష్టించారు. ఇటు ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అటు నగరపాలక సంస్థ అధికారుల కాసుల కక్కుర్తి కారణంగా ఇక్కడ నెలకొక కబ్జా వెలుగుచూస్తూనే ఉంటుంది. స్థానికంగా ఉండే ఓ ఆలయ పూజారి అన్నీతానై చక్రం తిప్పుతూ ఈ కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నాడు.

ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్ : స్థానికంగా బుడమేరును ఆనుకుని సర్వే నెంబరు 32లో 1.20 ఎకరాల ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.15 కోట్ల పైమాటే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో కబ్జాదారులు సదరు స్థలాన్ని ముక్కలు చేశారు. కబ్జాలకు పాల్పడి సర్వే నెంబరు 31/1ఏతో నకిలీ డాక్యుమెంట్లు, వీలునామాలు సృష్టించి అమ్మకాలకు పెట్టేశారు. అయితే, సదరు స్థలాల్లో ప్రస్తుతం పదుల సంఖ్యలో భవనాలు వెలిశాయి. ఇరిగేషన్ భూములని తెలిసి కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులు విచ్చలవిడిగా ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్లు ఇచ్చేశారు. దీంతో నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల రోడ్లను కూడా ఏర్పాటు చేసేశారు. ఇక తామేమి తక్కువ కాదన్నట్టు విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్లు ఇచ్చారు. దీంతో అనేక మంది.. స్థలాలు తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో కొని మోసపోతున్నారు.

ఏకై వచ్చి మేకయ్యాడు..!

పదేళ్ల క్రితం బుడమేరు పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కొందరు కబ్జాచేసి అమ్మకానికి పెట్టగా, తక్కువ ధరకు 250 గజాల ప్రభుత్వ భూమిని దక్కించుకున్న ఓ ఆలయ పూజారి అక్కడి నుంచి తన కబ్జాల పరంపర కొనసాగిస్తున్నారు. ఏకై వచ్చి మేకయినట్లుగా మిగతా 6లో..


గ్యాంగ్ సంగమేశ్వరం!

- ఆర్టీసీ బస్సుల్లో సంగమేశ్వరం తరలింపు
- గుర్తింపు కార్డులు, ఫోన్లు లాక్కుని వెట్టి చాకిరి
- తప్పించుకుని వచ్చిన విజయవాడ యువకుడు

విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు

రైల్వే స్టేషన్ వద్ద నిఘా.. వలస కూలీల ట్రాప్

రైల్వే స్టేషన్ వద్ద పాగా వేస్తారు. రైలు దిగి స్టేషన్ నుంచి బయటకు వచ్చిన వారిని నిశితంగా గమనిస్తారు. ఉపాధి కోసం వచ్చిన వారితో మాట కలుపుతారు. ఊరు, వాడ తెలుసుకుంటారు. ఆ తర్వాత వారి వ్యసనాలను కనిపెట్టి ఓ చోట పనిచేస్తే ఊహించని డబ్బు వస్తుందని ఆశ చూపుతారు. వారు సరే అనగానే కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరానికి పంపుతారు. ఆ తర్వాత అక్కడ వారిని నిర్బంధించి వెట్టి చాకిరి చేయించుకుంటారు. ఉపాధి కోసం ఎదురు చూస్తున్న కార్మికులను ట్రాప్ చేసే ముఠా బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ కూలీలను టార్గెట్ చేస్తున్నారు. ఇలా సంగమేశ్వరం వెళ్లి చిత్రహింసలు ఎదుర్కొన్న ఓ యువకుడు తప్పించుకుని రావడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది.


బాధితుడు పవన్ కుమార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రాజీవ్ నగర్‌కు చెందిన కూతాడి పవన్ కుమార్‌పై నున్న పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీటు ఉంది. అతడు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. గతేడాది నవంబరులో తనతోపాటు ఆటోడ్రైవర్‌గా పనిచేసే రాము అనే యువకుడు అద్దెకు ఆటో ఇప్పిస్తానని తీసుకెళ్లాడు. రైల్వే స్టేషన్ వద్దకు తీసుకువెళ్లి అక్కడ వదిలేశాడు. తర్వాత కాసేపటికి సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్‌షీట్ ఉన్న ఓ వ్యక్తి అతని వద్దకు వెళ్లాడు. కాసేపు మాట్లాడి మందు తాగించాడు. తానే ఉపాధి చూపిస్తానని పవన్ కుమార్‌ను నమ్మించాడు. కొద్దిసేపటికి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారితో కల్పించుకుని మాట్లాడాడు. వాళ్లందరిని ఉపాధి చూపిస్తానని అక్కడే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. అతడు వారిని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కర్నూలు బస్సు ఎక్కించాడు. అక్కడ బస్సు దిగిన తర్వాత ఒక వ్యక్తి ఆటోలో సంగమేశ్వరం తీసుకెళ్లాడు. అక్కడ నది ఒడ్డున ఏర్పాటు చేసిన షెడ్లలో వారిని ఉంచారు. అక్కడ నదిలో ఏర్పాటు చేసిన వలలను లాగే పనులకు వారిని మిగతా 6లో..

అర్ధరాత్రి పని.. ఒక పూటే భోజనం

విజయవాడ రైల్వేస్టేషన్‌కు ఉపాధి పనుల నిమిత్తం వచ్చిన వారిని ట్రాప్ చేయడానికి ఒక గ్యాంగ్ ప్రత్యేకంగా పనిచేస్తున్నట్టు పవన్ కుమార్ వాంగ్మూలం ద్వారా తెలుస్తోంది. సంగమేశ్వరంలో చేపల వేటకు నదిలో వేసిన వలలను బయటకు లాగడానికి అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు రాత్రి వరకు పనిచేస్తున్నట్టు పవన్ కుమార్ పోలీసులకు వివరించాడు. సంగమేశ్వరం చేరుకోగానే వారి నుంచి ఆధార్ కార్డు, ఫోన్లు, డబ్బులు లాగేసుకుంటారు. ఆ తర్వాత అక్కడే నిర్మించిన షెడ్‌ల్లో వసతి ఇస్తారు. రోజుకు ఒకసారి మాత్రమే భోజనం పెడతారు. రాత్రిపూట టాయిలెట్‌కు వెళ్లనివ్వరు. ప్రతి షెడ్డు వద్ద పని చేయించుకునే యజమానుల కుటుంబ సభ్యులు కర్రలతో కాపలా కాస్తారు. ఎవరైనా పారిపోవడానికి ప్రయత్నిస్తే కర్రలతో చితకబాదుతారని పవన్ కుమార్ పోలీసులకు వివరించాడు. కార్మికులను ట్రాప్ చేసిన వారికి ఒక్కో వ్యక్తిపై రూ.5వేల కమీషన్ ఇస్తున్నట్టు పవన్‌కుమార్ తెలిపాడు.

రూ. అర కోటికి స్కెచ్!

కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ నిర్వాకం

- మరో దొంగ బిల్లు తయారీ.. రెండు సార్లు ఫైల్ మార్పు
- పెట్టాల్సిన బిల్లు రూ. 37 లక్షలు.. చేసిన పనికి ఇవ్వాల్సిన బిల్లు రూ. 11 లక్షలే!
- కానీ రూ.74 లక్షలకు బిల్లు పెట్టారు.. మళ్లీ ఫైల్ మార్చి రూ.కోటి చేసేశారు!
- ఇంజనీరింగ్ విభాగానికి ఫైల్
- కమిషనర్ అనుమతి కావాలని వెనక్కి తిప్పి పంపిన ఇంజనీరింగ్ విభాగం



కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ రూటే సపరేటు'. దొంగ బిల్లులు పెట్టడం వారికి రివాజుగా మారింది. నిన్నటికి నిన్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దొంగ బిల్లులు పెట్టబోయి అడ్డంగా దొరికిపోయారు. తాజాగా వరదల సమయంలో పనుల పేరుతో మరో భారీ దొంగ బిల్లుకు రంగం సిద్ధం చేశారు. రూ.37 లక్షల బిల్లును రూ.74 లక్షలకు పెంచటంతో పాటు తాజాగా దానిని రూ. కోటి చేసేశారు. బిల్లులు పెట్టేందుకు సరికొత్త యూవో నోట్‌లతో ఫైల్‌ను సిద్ధం చేస్తున్నారు. అతి త్వరలో దీనిని కమిషనర్ టేబుల్ మీదకు, ఆ తర్వాత స్టాండింగ్ కమిటీ సమావేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ పరిధిలో బుడమేరు వరదల సమయంలో దోమల నిర్మూలన, పారిశుధ్య నిర్వహణకు సంబంధించి కమిషనర్ ఆదేశాల మేరకు అదనంగా బయట నుంచి కార్మికులను తీసుకొచ్చారు. కమిషనర్ ఇచ్చిన శాంక్షన్‌కు భిన్నంగా ప్రజారోగ్య శాఖ అధికారులు వ్యవహరించారు. మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం 150 మందితో పనిచేయించుకోవాల్సి ఉండగా.. క్షేత్ర స్థాయిలో అందులో 30 శాతం మందితో కూడా పనిచేయించలేదన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అందరూ పనులు చేశారన్న దానికి ఆధారాలు కూడా లేవు. పనిచేస్తున్న వారికి తాత్కాలిక ఐడీలు ఇవ్వటం కానీ, ఎంత మంది ఏయే ప్రాంతాల్లో పనిచేస్తున్నారని ట్యాగ్ చేయటం కానీ చేయలేదు. డిజిటలైజేషన్ కూడా చేయలేదు. దీంతో ఖచ్చితంగా ఇంతమందే మిగతా 6లో..

అంతర్మథనంలో ప్రజారోగ్యశాఖ

ఇంజనీరింగ్ విభాగం వెనక్కి పంపడంతో ఫైల్‌ను ఏం చేయాలన్న దానిపై ప్రజారోగ్య శాఖ అధికారులు అంతర్మథనం చెందుతున్నారు. ఈ వ్యవహారంలో కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖలో ఇంతకు ముందు పనిచేసిన అధికారిణి పాత్ర ప్రధానంగా ఉందని తెలుస్తోంది. తాను ఇక్కడి నుంచి రిలీవ్ కావటానికి ఒక రోజు ముందు ఈ ఫైల్‌పై సంతకం పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న అధికారులు, ఉద్యోగుల పాత్ర కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే ప్రజారోగ్యశాఖాధికారుల నిర్వాకాలు బయట పడుతున్నాయి. రెండు సార్లు ఫైల్‌ను మార్చారంటేనే తప్పు చేశారన్నది అర్థమవుతోంది. మొదటి సారి ఇంత మంది పనిచేశారని, రెండో సారి మరికొంత మంది చేశారని ఫైల్స్ మార్చటం గమనార్హం. కమిషనర్ అనుమతి లేకుండా ఫైల్‌ను ముందుకు తీసుకువెళ్లటం పెద్ద తప్పు అయితే.. ఎలాగోలా ఆమోదింపచేసుకోవటం ద్వారా రూ.అరకోటి పైగా డబ్బులు మిగుల్చుకునేందుకు స్కెచ్ వేయటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఈ వ్యవహారంపై విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోప్‌వే!

బెర్మ్ పార్క్ నుంచి భవానీ ఐల్యాండ్ వరకు..

ప్రణాళికలు రచిస్తున్న ఏపీటీడీసీ అధికారులు

ఒకటిన్నర దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నగర వాసులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ఐల్యాండ్‌కు రోప్‌వే ఏర్పాటుపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. దశాబ్దంన్నర కాలంగా విజయవాడ నగరానికి రోప్‌వే ఊరిస్తూనే ఉంది. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ సాకారం కావటానికి వీలుగా అడుగులు పడుతున్నాయి. గతంలో ఏర్పడిన అడ్డంకులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి రోప్‌వే ప్రాజెక్టు కోసం ఏపీటీడీసీ అధికారులు డిజైన్ చేస్తున్నారు. గతంలో రాజీవ్ గాంధీ పార్కు నుంచి ఇంద్రకీలాద్రికి, అక్కడి నుంచి భవానీ ద్వీపం రోప్‌వే నడపాలన్న ప్రతిపాదన వచ్చింది. ఇంద్రకీలాద్రి దిగువన ఆర్కియాలజీ సంరక్షణలో అక్కన్నమాదన్న గుహలు ఉండటంతో అభ్యంతరాలు వచ్చాయి. ఆ తర్వాత దేవస్థాన వైదిక కమిటీ కూడా ఎత్తు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సారి అతి తక్కువ నిడివి కలిగిన రోప్‌వే ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హరిత బెర్మ్ పార్క్ నుంచి కృష్ణానది మీదుగా సాగుతూ భవానీ ఐల్యాండ్‌కు చేరుకునేలా రోప్‌వే ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. బెర్మ్‌పార్క్ నుంచి భవానీ ద్వీపం వరకు 0.88 కిలోమీటర్ల మేర రోప్‌వేకు ఏపీటీడీసీ అధికారులు ప్రణాళికలు రచించారు. అతి త్వరలో దీనిపై బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుని పీపీపీ విధానంలో అప్పగించే అవకాశం ఉంది.

మంగినపూడిలో బీచ్ ఫెస్టివల్

- మే 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం తెలిపారు. బీచ్ వద్ద జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువతలో చైతన్యం నింపేలా వివిధ రంగాల ప్రముఖుల ఉపన్యాసాలు, ఆహ్లాదం, ఆనందం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బీచ్ ఫెస్టివల్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు వివరించారు.

మరోసారి బీభత్సం

- ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- పూర్తిగా రాలిపోయిన మామిడి కాయలు
- తిరువూరులో వరి, ఏ కొండూరులో మొక్కజొన్నకు తీవ్ర నష్టం
- రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసిన అకాల వర్షాలు

6లో





విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరిక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని విజ్ఞాన భారతి హైస్కూల్ డైరెక్టర్ కేఆర్ఎస్ రావు అన్నారు. పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా అండర్-11 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్, ఓపెన్ టోర్నమెంట్ ఆదివారం జరిగింది. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో 19 మంది, బాలికల విభాగంలో 13 మంది పాల్గొనగా 5 రౌండ్ల పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో కె.సండెన్ సమవేద్, కార్తికేయ, బాలికల విభాగంలో ప్రణీత, గుణశ్రీ విజేతలుగా నిలిచారు. ఓపెన్ కేటగిరిలో 20 మంది క్రీడాకారులు పాల్గొనగా నలుగురు రుషిల్ సాయి, లలిత్ కౌశిక్, సందీప్, మణిరత్నం విజేతలుగా నిలిచారు. అనంతరం వీరికి బహుమతులు అందజేశారు. మొదటి 2 స్థానాల్లో నిలిచిన వారిని ఏప్రిల్‌లో జరిగే అండర్-11 స్టేట్ చాంపియన్‌షిప్‌లో కృష్ణాజిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ న్యాయవాది కె.అజయ్, ప్రియాంక, చీఫ్ ఆర్బీటర్ ఎమ్.పావని, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆర్గనైసింగ్ సెక్రటరీ ఎన్.ఎం.ఫణి కుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తోలితే కఠినచర్యలు

- సీఐ గిరిబాబు హెచ్చరిక

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరువూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తోలకాలు చేస్తే, వాహనాల సీ జ్‌తో పాటుగా, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని సీఐ గిరిబాబు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఆగని మట్టి, ఇసుక మాఫియా శీర్షికతో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పోలీస్ నిఘా మరింతగా అప్రమత్తం చేస్తామన్నారు. ఇటీవల అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అయిదు ఇసుక టిప్పర్లను సీజ్ చేశామని, వాహనదారులు కోర్టు ఉత్తర్వులు పొందడంతో ఆయా వాహనాలను రిలీజ్ చేశామన్నారు. సర్కిల్ పరిధిలో అక్రమ మట్టి, ఇసుక తొలకాలు ఎవరు చేసిన కఠినచర్యలు తీసుకుంటామన్నారు. విస్సన్నపేట మండలం కొండపర్వ మల్లయ్యస్వామి గట్టువద్ద అక్రమ మట్టితోలకాలు జరుగుతున్నట్టు సీఐ దృష్టికి తీసుకువెళ్లగా, సిబ్బందిని పంపి దర్యాప్తు చేయిస్తామని సీఐ తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో సత్యమ్మ అమ్మవారు, పూజల్లో ఎమ్మెల్యే దంపతులు

సత్యమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే వసంత దంపతుల పూజలు

నందిగామ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారుపేట గ్రామంలో నిర్వహిస్తున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముందుగా అర్చకులు నందిగం సుబ్బారావు, కోటేశ్వర శాస్త్రి, టీటీడీ వేద పండితుడు దుర్భాకుల రఘునాద శర్మ అవధాని ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు, అర్చనలు, హోమాద్రి క్రతువులు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయ భాను, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమాదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వారికి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. మహోత్సవాలను విజయవంతానికి సహకరించిన ప్రజలు, అధికారులకు ఈవో హరిగోపీనాథ్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది.

ధాన్యం కొనుగోలుకు కాల్ సెంటర్

కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం ● నున్నలో పర్యటన

విజయవాడ రూరల్, ఏప్రీల్ 13 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల విషయమై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలవరం కాలువ వద్ద ధాన్యపు రాశులు పేరుకుపోవడాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం చేశారు. పంట కోతకోసి 10 రోజులు దాటుతున్నా అధికారులు ధాన్యం తరలించేందుకు వాహనాలు, సంచులు సమకూర్చడం లేదని, కనీసం ఫోన్‌లు కూడా ఎత్తడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఒక్క నున్న గ్రామంలోనే 700 మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్లపై, కల్లాల్లో ఉండిపోయిందని, దీంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ సివిల్ సప్లై, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వాహనాలు పెట్టి తరలించాలని ఆదేశించారు. రైతులెవరూ ఆందోళన పడవద్దని, ప్రతి ధాన్యపు గింజకూ మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు. అలాగే ప్రతి మిల్లు దగ్గర ఓ అధికారిని నియమిస్తామన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీడీపీ నేతలు యార్మారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామప్రసాద్, గంపా శ్రీను, మాజీ ఎంపీపీ యార్మారెడ్డి నాగిరెడ్డి ఉన్నారు.



ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

మరోసారి బీభత్సం

ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలు

- తిరువూరులో వరికి, ఏ కొండూరులో మొక్కజొన్నకు తీవ్రనష్టం
- పూర్తిగా రాలిపోయిన మామిడి కాయలు
- రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసిన అకాల వర్షాలు

తిరువూరు/ఏ కొండూరు, ఆంధ్రజ్యోతి: అన్నదాతల్ని అకాల వర్షాల భయం వీడటం లేదు. వారం పది రోజుల వ్యవధిలో మూడు సార్లు ఈ అకాల వర్షాలు, ఈదురు గాలులు అన్నదాతల నడ్డి విరిచేశాయి. ఇప్పటికే రెండు సార్లు వీచిన ఈదురు గాలులకు నష్టపోయి పీపీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతులకు మరోమారు ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. ఏకంగా వడగండ్ల వాన పడటంతో పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. మొత్తం మీద రైతులను రూ.లక్షల్లో నష్టపోయేలా చేశాయి. అంతేకాక ఈదురు గాలులు కారణంగా పట్టణంలో పెద్ద ఎత్తున చెట్లు నేలవాలాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు విరిగిపోయాయి. బోర్డులు నేలమట్టమయ్యాయి.

పట్టణంలో అల్లకల్లోలం

తిరువూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి ఈదురు గాలులతో కూడి భారీ వడగండ్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి వేసవి వేడితో అల్లాడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా చల్లగాలులతో వర్షం పడటంతో కొంత సేదతీరినా, వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పోల్ విరగిపోయి రోడ్డుపైకి ఒరిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి నేలపై పడ్డాయి. ప్రధాన రహదారిలో వివిధ షాపులకు చెందిన విద్యుత్ నేమ్ బోర్డులు గాలులకు విరిగి సమీపంలోని ద్విచక్రవాహనాలపై పడటంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిపేయడంతో పట్టణం పూర్తి అంధకారంలో చిక్కుకుంది. డ్రెయిన్స్ పూడిక తీయకపోవడంతో వరద నీరు రహదారిపై ప్రవహించి పంట కాలువలను తలపించాయి. పలు గ్రామాల్లో చెదువు మదురు జల్లులు పడ్డాయి. ధాన్యం కోసిన రైతులు కల్లాల్లో ఉంచిన ధాన్యంపై పట్టాలు కప్పినా ఎగిరిపోయి తడిచిపోయాయి. వారంలో రెండు సార్లు వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోగా కొద్దో గొప్పో చెట్లకున్న కాయలు పూర్తిగా రాలిపోయాయి.



తిరువూరులో నేలకొరిగిన లైటింగ్ బోర్డు

మొక్కజొన్న రైతుల కుదేల్

ఈదురు గాలులకు మొక్కజొన్న రైతులు పూర్తిగా కుదేలయ్యారు. కొందరు రైతులు మొక్కజొన్న విరిపించి ఒలిపించి కల్లాల్లో పెట్టారు. వాటిపై కప్పిన పట్టాలు ఎగిరిపోవడంతో పంట పూర్తిగా తడిచిపోయింది. కొన్ని చోట్ల నేలవాలిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కంభంపాడు - గోపాలపురం మధ్య రహదారి పక్కనున్న పలుచెట్లు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మండలం అంధకారంలో ఉండిపోయింది.



అశోక్‌నగర్‌లో నేలకొరిగిన వేప చెట్టు



తిరువూరులో కురుస్తున్న వడగండ్ల వాన

కష్టకాలంలో ఆదుకున్న 'కామధేను'

● విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ● 16న చినజీయర్ చేతుల మీదుగా దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



వీరవల్లి కామధేను యూనిట్‌లో నిర్మించిన దాసాంజనేయ ఆలయం, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చలసాని (ఇన్‌సెట్)

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వీరవల్లిలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో స్థాపించిన కామధేను యూనిట్ బుడమేరు వరద ముంపు సమయంలో ఆదుకుందని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి యూనిట్ లేకపోతే 2024లో అకస్మాత్తుగా సంభవించిన వరద ముంపుతో కృష్ణామిల్క్ యూనియన్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడే పరిస్థితి ఎదురయ్యేదన్నారు. ఈ యూనిట్‌లో నిర్మించిన దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 16న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం చలసాని సతీసమేతంగా వీరవల్లి తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయం ఎదుట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జంక్షన్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి స్వామి ముంగిట ఆహ్వానపత్రిక పెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2023లో ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఆలయానికి భూమి పూజ నిర్వహించామన్నారు. ఆలయం నిర్మాణం శరవేగంగా పూర్తవడంతో 16న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం త్రిదండి చినజీయర్ స్వామి చేతులు మీదుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ఆదివారం నుంచి 15 వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా 15వేల మందికి అన్నసంతర్పణ చేయనున్నట్టు తెలిపారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి పాడి రైతు కుటుంబాలు, సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొని జీయర్ స్వామి ఆశీస్సులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాది అన్వర్‌పై రౌడీషీట్

విజయవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లకోటు ధరించినా అతడు చేసే పనులన్నీ నేరాల కోవకు చెందినవే. న్యాయం చేయమని వచ్చిన కక్షిదారులను బంధించి దాడి చేసి డబ్బులు వసూలు చేస్తాడు. ఇదీ ఆ న్యాయవాది స్టైల్. ఒకదాని తర్వాత మరో కేసు నమోదవడంతో వన్‌టౌన్‌కు చెందిన న్యాయవాది అన్వర్‌పై కొత్తపేట పోలీసులు రౌడీషీట్ తెరిచారు. అన్వర్‌పై మొత్తం ఆరు కేసులున్నాయి. భవానీపురం, కొత్తపేట, సూర్యారావుపేట, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్లలో అన్వర్‌పై కేసులు నమోదయ్యాయి. ఒక కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లోనే మొత్తం 3 కేసులున్నాయి.తాజాగా బెయిల్ పిటిషన్ దాఖలు చేయాలని కక్షిదారులుగా వచ్చిన వైజాగ్‌కు చెందిన మహిళలను బంధించి దాడి చేశాడు. బలవంతంగా వారి ఫోన్లు తీసుకుని గూగుల్‌పే ద్వారా రూ.50 వేలను బదిలీ చేయించుకున్నాడు. దీనిపై సత్యనారాయణపురం పోలీ సు స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా కారుతో తన బంధువుల కారును ఢీ కొట్టి వారిపై దాడి చేశాడు. దీనిపై కొత్తపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనితో అన్వర్‌పై రౌడీషీట్ తెరిచారు.

దుర్గగుడిలో సిబ్బంది అలసత్వం

- ఉద్యోగులపై ఈవో ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో పలువురు ఉద్యోగులు భక్తులకు అసౌకర్యం కలిగించేలా వ్యవహరించటంపై ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగుతున్నా పట్టించుకోరా అంటూ ఏఈవో స్థాయి అధికారులను ప్రశ్నించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో దంపతులు పాల్గొన్నారు. ఆయన యాగశాల నుంచి ప్రధాన ఆలయం వైపు వస్తుండగా రావి చెట్టు వద్ద భక్తులు రద్దీగా ఉన్నారు. ఒక్క సెక్యూరిటీ లేకపోవటంతో ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇటీవల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టిన ప్రహరీ

కబ్జా కాలనీ

(5వ పేజీ తరువాయి)

కాలనీలోని ప్రతిస్థలం తనదేనంటూ చక్రం తిప్పుతున్నారు. 250 గజాల స్థలాన్ని కొని ఆ ప్రాంతంలో అడుగుపెట్టిన ఈయన ప్రస్తుతం 31సెంట్ల స్థలం తనదేనంటూ నకిలీ డాక్యుమెంట్లు, వీలు నామాలు సృష్టించి బేరాలు పెట్టి అమ్మేస్తున్నారు. ఈయన పుణ్యమాని అనేక స్థలాలను చాలామంది కొనేసి ఇళ్లు నిర్మించేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ఏ అధికారీ ఆ వైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రోడ్డును సైతం మింగేశారు

ప్రభుత్వ భూమిలో ప్లాట్లు సృష్టించి రోడ్లు వేసిన సదరు పూజారి ఆ పనిని విజయవంతంగా పూర్తిచేసి.. ఇక రోడ్లపై పడ్డారు. ఇటీవల రోడ్డు కోసం తీసిన 300 గజాల స్థలాన్ని కూడా కబ్జా చేసి ప్రహరీ నిర్మించడంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. 1.20 ఎకరం ప్రభుత్వ భూమిలో కొంత భూమి అమ్మకాలు జరపగా, ఇంకా ప్రస్తుతం ఇతని చెరలో సుమారు 13 నుంచి 15 సెంట్ల ప్రభుత్వ భూమి ఉన్నట్టు తెలుస్తోంది. తనతో పాటు తన కుటుంబ సభ్యుల పేర్లతో కూడా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

అదంతా ఇరిగేషన్ భూమే

సన్‌సిటీ కాలనీ వ్యవహారం మాకొక తలనొప్పిగా మారింది. ఈ కాలనీలో ఎక్కువభాగం ఇరిగేషన్ స్థలాలు ఉన్నాయి. ఆ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటాం.

\- రాజశేఖర్, ఇరిగేషన్ ఏఈ

గ్యాంగ్ సంగమేశ్వరం!

(5వ పేజీ తరువాయి)

ఉపయోగించారు. బయటకు వెళ్లిన పవన్‌కుమార్ తిరిగి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది.

కర్ణాటక సరిహద్దుకు పారిపోయి..

సంగమేశ్వరంలో వలలు లాగే పనుల కోసం తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టడంతో విజయవాడకు చెందిన పవన్ కుమార్ తప్పించుకుని కర్ణాటక సరిహద్దులకు పారిపోయాడు. అక్కడి నుంచి హోస్పేట్‌కు చేరుకుని కొద్దిరోజుల క్రితం విజయవాడలో ఉన్న తన సోదరులకు ఫోన్ చేశాడు. తినడానికి తిండి లేదని, చేతుల్లో డబ్బులు లేవని కన్నీరు పెట్టుకున్నాడు. తనతోపాటు మరో నలుగురు తప్పించుకుని ఇలా వచ్చేశామని వివరించాడు. వారిని ఒక షాపు వద్దకు పంపి, దాని యజమానికి గూగుల్‌పే ద్వారా భోజనాల కోసం కొంత డబ్బులు పంపారు. పవన్‌కుమార్‌తోపాటు తప్పించుకుని వచ్చిన మిగిలిన నలుగురు ఆ డబ్బులతో మద్యం తాగి నిద్రపోయారు. దీనితో చేసేది లేక పవన్‌కుమార్ సమీపాన ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అతడితో మాట్లాడిన తర్వాత కుటుంబ సభ్యులు నున్న పోలీసులకు విషయం చెప్పారు. పోలీసులు హోస్పేట్ పోలీసులతో మాట్లాడారు. పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు వస్తున్నారని పోలీస్ స్టేషన్లో ఉంచాలని తెలిపారు. తర్వాత పవన్ కుమార్ కుటుంబ సభ్యులు వెళ్లి అతడిని విజయవాడకు తీసుకువచ్చారు. సంగమేశ్వరంలో జరిగిన చిత్రహింసల గురించి అతడు నున్న పోలీసులకు వివరించాడు. ఉత్తర మండలం ఏసీపీ స్రవంతిరాయ్ అతడిని విచారించారు. పవన్ కుమార్‌కు ట్రాప్ జరిగిందంతా రైల్వేస్టేషన్ వద్ద కాబట్టి సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అతడిని అక్కడికి పంపారు.

ప్రజల ఆరోగ్యాలపైనా రాజకీయం

- మంత్రి సత్యకుమార్ ధ్వజం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దారుణంగా ఛీత్కరించినా ప్రజల ఆరోగ్యాలతో రాజకీయం చేసే దుర్మార్గ ప్రతిపక్షం, రోతపత్రిక తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి పట్టణ పరిధిలో పీవీఆర్ గార్డెన్స్‌లో జరిగిన జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే నియోజకవర్గ ఉచిత కంటి వైద్య శిబిరాల ప్రారంభోత్సవంలో ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్ధన్‌లతో కలిసి పాల్గొన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆరోగ్య భారతావని కోసం, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం తపిస్తున్నారన్నారు.

రూ. అర కోటికి స్కెచ్!

(5వ పేజీ తరువాయి)

పనిచేశారన్నదానికి ప్రజారోగ్యశాఖ అధికారుల దగ్గర ఎలాంటి ఆధారం కూడా లేదు. వాస్తవానికి కార్మికులు 30 శాతం మించి పనిచేయలేదన్నది అర్థమవుతోంది. కమిషనర్ ఆదేశాల మేరకు 150 మంది పనిచేసి ఉంటే రూ.37 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవంగా పనిచేసిన ప్రకారం చూస్తే రూ. 11 లక్షల బిల్లు మేర మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారులు తెలివితేటలు చూపించారు. అదేమంటే 150 మంది పూర్తి స్థాయిలో పనిచేశారని, రెండు షిఫ్టులలో కలిపి మొత్తం 250 మంది పనిచేశారని లెక్క చూపారు. ఇలా చూపుతూ రూ. 74 లక్షలతో బిల్లులు రూపొందించారు. నామినేషన్ విధానంలో పనులు కట్టబెట్టడానికి, పేమెంట్లు తేలిగ్గా జరపటానికి వీలుగా రూ. 4.90 లక్షలతో కూడిన యూవో నోట్లు జారీ చేసినట్టు తెలిసింది.

రెండో షిఫ్ట్ పనికి కమిషనర్ అనుమతి లేదు

కమిషనర్ ఇచ్చిన శాంక్షన్ ప్రకారం ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాల్సి ఉండగా.. రెండు షిఫ్టుల్లో పనిచేయించామని చెప్పటం విడ్డూరంగా ఉంది. రెండో షిఫ్ట్ పనికి కమిషనర్ అనుమతి లేదు. ఒకవేళ కమిషనర్ అనుమతి లేకపోతే రెండో షిఫ్ట్ అవసరం ఉందని కమిషనర్‌కు తెలియపరిచి అంగీకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఇవేమీ జరగకుండానే రెండో షిఫ్ట్ చేయించినట్టుగా బిల్లుల ఫైల్ తయారు చేశారు. మళ్లీ తాజాగా ఈ ఫైల్‌ను కాదని.. మరో ఫైల్‌ను ప్రజారోగ్యశాఖ అధికారులు తయారు చేశారు. ఈ సారి ఏకంగా 310 మంది పనిచేశారంటూ 25 యూవో నోట్లు జారీ చేస్తూ రూ. కోటి మేర బిల్లును రూపొందించారు. ఈ ఫైల్‌ను ఇంజనీరింగ్ సెక్షన్‌కు పంపించి ఆమోదానికి సిఫార్సు చేయాల్సిందిగా కోరారు. ఇంజనీరింగ్ విభాగం ఈ ఫైల్‌ను పరిశీలించగా.. కమిషనర్ ఇచ్చిన శాంక్షన్‌కు భిన్నంగా బిల్లులు పెట్టడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజారోగ్యశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయం కాబట్టి తమకు సంబంధం లేదని, కమిషనర్ అనుమతి తీసుకున్న తర్వాతే ఫైల్ పంపాల్సిందిగా దానిని ఇంజనీరింగ్ విభాగాధికారులు వెనక్కు పంపారు.

172 ఎకరాలు డీనోటిఫై!

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ టన్నెల్స్ అటవీ, కొండ ప్రాంతాల పరిధిలోనే ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

అటవీ భూముల్లో చెట్ల లెక్కింపు

అటవీ భూముల డీ నోటిఫికేషన్‌కు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ అధికారులు ముందుగానే తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పెట్టుకున్నారు. పలు సర్వేలు కూడా నిర్వహించారు. ప్రతిపాదిత అటవీ భూముల్లో ఎన్నిచెట్లున్నాయన్న వివరాలన అధ్యయనం చేశారు. అటవీ ప్రాంతాన్ని డీజీపీఎస్ రోవర్ల ద్వారా జల్లెడ పట్టించి విస్తీర్ణాన్ని కూడా మదింపు చేశారు. అటవీ భూముల సర్వే కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం 70 మీటర్ల వెడల్పునకు మాత్రమే ఈ సర్వే చేపట్టినా.. 140 మీటర్ల వెడల్పుకు కూడా ఎన్ని చెట్లు ఉంటాయి? ఎంత మీరా విస్తీర్ణం అవసరమవుతుంది? అన్నదానిపై కూడా ముందుగానే సర్వే చేయించి సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతమేర అటవీ ప్రాంత భూములకు డీ నోటిఫికేషన్ ఇస్తే అంత విస్తీర్ణం మేర రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భూములు కల్పించాల్సి ఉంటుంది. అటవీ ప్రాంతంలో ఎన్నిచెట్లు ఉన్నాయో అంతకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చూపించే భూముల్లో మొక్కలను నాటాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి పరిధిలో కానీ మరెక్కడైనా కానీ డీనోటిఫై చేసినంత మేరకు భూములను తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉంది.

త్వరలో పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదన

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కోసం అతి త్వరలో ఎన్‌హెచ్ అధికారులు పర్యావరణ అనుమతులు కోరనున్నారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన ప్రక్రియను కూడా ఎన్‌హెచ్ అధికారులు చేపట్టారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అనేది గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు కాబట్టి ఖచ్చితంగా పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిందే. అవుటర్ రింగ్ రోడ్డు వల్ల అమరావతి రాజధాని ప్రాంత పరిధిలోని ప్రజలపై ప్రత్యక్షంగా పరోక్షంగా పర్యావరణంపై ఏ విధంగా ప్రభావం చూపిస్తుందన్న దానిపై అధ్యయన రిపోర్టును కేంద్రానికి పంపించాల్సి ఉంటుంది. అమరావతి ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి భౌగోళిక పరిస్థితులను చూస్తే పర్యావరణ విఘాతానికి ఎలాంటి ఆస్కారం లేదు కాబట్టి పర్యావరణ అనుమతుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. పర్యావరణ అనుమతులకు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు రింగ్ రోడ్డు పరిధిలోని మిగిలిన మూడు జిల్లాల్లో కూడా స్థానికంగా ప్రజల నుంచి అభ్యంతరాలను కూడా స్వీకరించడం జరుగుతుంది. ప్రజల అభ్యంతరాలను కూడా తీసుకొని దానికి అనుగుణమైన మార్పులు చేర్పులు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసే అవకాశం ఉంది.

వైభవంగా పూర్ణాహుతి, వసంతోత్సవం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి పై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి వైభవంగా జరిగింది. అనంతరం వేదోక్త, శాస్త్రోక్తంగా ధాన్యకొట్నోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. తదుపరి అవభృత స్నానం (పవిత్ర కృష్ణానదిలో) కోసం గంగా, పార్వతీ (దుర్గా) సమేత మల్లేశ్వరులను అర్చకులు, వేద పండితులు ఊరేగింపుగా ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణానదికి తీసుకువెళ్లి, పుణ్యనదిలో అవభృత స్నాన కార్యక్రమం నిర్వహించారు. పూర్ణాహుతి, ధాన్యకొట్నోత్సవం, తదితర కార్యక్రమాల్లో దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



కృష్ణానదిలో నదీ విహారం చేస్తున్న ఆది దంపతులు

కృష్ణానదిలో ఆది దంపతుల విహారం

ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గగుడిలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గంగా, పార్వతీ (దుర్గా) మల్లేశ్వర స్వామి కృష్ణానదిలో హంసపై నదీ విహారం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు సాయంత్రం 5 గంటలకు మల్లేశ్వరాలయం నుంచి దేవ దేవేరీలను ఊరేగింపుగా దుర్గాఘాట్ కృష్ణానది వద్దకు తీసుకువెళ్లారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మహామండపం నుంచి కూచిపూడి నృత్యకారుల నృత్యం, తప్పెట్లు, కోలాటం, భజన సంకీర్తనలతో కోలాహలంగా దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన హంసపై స్వామివారు, అమ్మవారులను అధిరోహింపజేశారు. అనంతరం కృష్ణానదిలో అమ్మవార్లు, స్వామివారి నదీ విహారం ప్రారంభమైంది. కల్యాణోత్సవ ఆది దంపతులను కృష్ణానదిలో విహరింపజేశారు. స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

మొగల్రాజపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బూత్ కన్వీనర్ మస్తాన్ గిరిబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం గద్దె క్రాంతికుమార్ రూ. 15వేలు ఆర్థిక సాయం చేశారు. 8వ డివిజన్ రఘురామ్ వీధిలో ఉంటున్న గిరిబాబుకు రెండు మూత్ర పిండాలు దెబ్బతిని ఇబ్బందులు పడుతుండటం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి రావడంతో ఆదివారం ఆయన తన కుమారుడు గద్దె క్రాంతికుమార్‌ను పంపి నగదు సాయం అందేలా చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉషారాణి, డివిజన్ కార్యదర్శి మల్లెల రామకృష్ణ, కొత్త పల్లిరమేష్, గద్దె రంగారావు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు తెల్లకాగితాల బుక్‌లెట్

ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ హర్షం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏపీపీఎస్సీ తెల్లకాగితాల బుక్‌లెట్‌లు ఇస్తామని చెప్పడం పట్ల ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మెయిన్స్ పరీక్షలు మొత్తం 7 పేపర్లు ఉంటాయని, అన్ని పేపర్లలోని ప్రశ్నలకు వ్యాస రూపంలో మాత్రమే జవాబులు రాయాల్సి ఉంటుందన్నారు. అయితే గతంలో ఈపరీక్షలకు రూల్డ్ పేపర్లతో కూడిన బుక్‌లెట్ ఇచ్చేవారని, దీంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బంది పడేవారని పేర్కొన్నారు. దీనికి చెక్ పెట్టేందుకు తెల్లకాగితాల బుక్‌లెట్ ఇస్తుందని ఆయన తెలిపారు.

దత్తపీటంలో దత్త క్రియా యోగా తరగతులు



యోగాభ్యాసం చేస్తున్న యోగ సాధకులు

పటమట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నేటి కాలంలో యోగాభ్యాసం మంచి జీవన విధానమని, క్రమం తప్పకుండా అందరూ అభ్యసనం చేయాలని దత్తపీఠాధిపతి గణపతి సత్యదానంద స్వామిజీ సూచించారు. గత రెండ్రోజుల నుంచి దత్తపీటంలో జరుగుతున్న ఉచిత దత్త క్రియా యోగా తరగతుల్లో స్వామిజీ స్వయంగా పాల్గొని సాధకులకు ఆశీస్సులు అందించారు. దత్త క్రియ యోగా అంతర్జాతీయ కేంద్రం మైసూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రకాష్ సాధకులకు శిక్షణనిచ్చారు. ప్రతి రోజు కనీసం 40 నిముషాల పాటు ధ్యానం చేయాలన్నారు. అరుణ, జ్యోతి రాణి, విజయ్‌కుమార్, కుసుమ, రమాదేవి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నలందలో క్రౌన్ ది టాలెంట్ అవార్డుల ప్రదానం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్‌లో 2024-25 వార్షిక సంవత్సరానికి సీసీ యాక్టివిటీస్‌లో విన్నర్స్‌కు క్రౌన్ ది టాలెంట్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథులు ఎం.రాగదీప, శుభాకర్‌లు వివిధ ఒలంపియాడ్స్‌లో, యాక్టివిటీస్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో అభిరామ్ పాండేకు ఫస్ట్ ర్యాంక్, జస్‌జోత్ భక్షికి ఇంటర్నేషనల్ సోషల్ ఒలింపియాడ్‌లో 3వ ర్యాంకు, నేషనల్ సైన్స్ ఒలంపియాడ్‌లో శరయస్ 3వ ర్యాంకు సాధించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పాఠశాల హెచ్ఎం ఉషారాణి, సీసీఏ ఇన్‌చార్జిలు, హౌస్ మాస్టర్లను అభినందించారు.

ఆదమరిచారో ...

- నాలుగడుగుల లోతులో బాలాజీనగర్ డ్రెయిన్
- భయం గుప్పిట్లో వాహనదారులు
- వాహనాల పార్కింగ్‌తో కుచించుకుపోయిన రోడ్డు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: 16వ డివిజన్ బాలాజీనగర్‌లో అవుట్‌ఫాల్ డ్రెయిన్ ప్రమాదకరంగా మారి స్థానికులకు ప్రాణసంకటంగా మారింది. డివిజన్ అభివృద్ధిలో భాగంగా కరకట్ట సర్వీస్ రోడ్డును గతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఆ సమయంలో అవుట్ ఫాల్ డ్రెయినేజీని కూడా అభివృద్ధి పరిచారు. అయితే అంతర్గత రోడ్లలోని సైడ్ డ్రెయిన్ల నుంచి పారే మురుగు నీరు ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తాయి. ఇది సుమారు నాలుగడుగులు లోతు ఉండడంతో ఇటు వైపు రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇటు వైపుగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి తోడు రోడ్డుకు ఒక వైపు కార్లు, ఆటోలు, వ్యాన్లు పార్కింగ్ చేయడంతో రోడ్డు కుచించుకుపోయి వాహనదారులు తప్పని సరిగా ఈ డ్రెయిన్ పక్కనుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదమరిచి ఈ డ్రెయిన్‌లో పడితే తీవ్ర గాయాల పాలవడంతో పాటు ప్రాణాలు పోయే అవకాశం ఉందని, ఈ ప్రాంతంలో ప్రతి రోడ్డు మలుపు ప్రమాదభరితంగా ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనాల్లో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై సిమెంట్ బిళ్లలు వేయడం, ప్రహరి కారి నిర్మించాలని, అదేవిధంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా అవుట్‌ఫాల్ డ్రెయిన్



మాట్లాడుతున్న చిత్ర హీరో రాజ్, దర్శకుడు రాచకొండ రాజ్, హీరోయిన్ తన్మయ, రామ్స్ థియేటర్ యజమాని

చిలకలూరిపేట బస్సు దహనం ఘటన

మా 23 చిత్రం ఇతివృత్తం

దర్శకుడు రాచకొండ రాజ్

గుణదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 1990 దశకంలో చిలకలూరిపేటలో జరిగిన బస్సు దహనం ఘటన మా 23 చిత్ర ఇతివృత్తమని చిత్ర దర్శకుడు రాచకొండ రాజ్ చెప్పారు. గుణదలలోని రామ్స్ థియేటర్‌లో ఆదివారం 23 చిత్ర ప్రీమియర్ వేశారు. దర్శకుడు రాచకొండ రాజ్ మాట్లాడుతూ అప్పటి బస్సు ప్రమాదంలో మరణించిన వారంతా 20 నుంచి 23 ఏళ్లలోపు వారేనని, అందుకే ఈ చిత్రానికి 23 అని పేరు పెట్టామన్నారు. ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరిగిందా, ఘటనకు కారణం అయినవారికి శిక్ష పడిందా అనే సన్నివేశాలను ఆలోచింపచేసే విధంగా తీశామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చట్టం న్యాయం సామాన్యులకు అందడం లేదనే భావన ఉందన్నారు. హీరో రాజ్, హీరోయిన్ తన్మయ మాట్లాడుతూ చిత్రంలో సన్నివేశాలు ప్రేక్షకులను ఆలోచింపచేసే విధంగా ఉంటాయన్నారు. నిజ జీవితానికి దగ్గరగా ఉండే విధంగా ఉన్న పాత్రలను పోషించినట్లు చెప్పారు. ఓటీటీల నుంచి ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమా చూస్తే అద్భుతమైన ఫీల్ ఉంటుందని చెప్పారు.



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -316డీ జిల్లా గవర్నర్ శేషగిరి, వెంకటేశ్వరరావు తదితరులు

దివ్యాంగులకు అండగా లయన్స్ క్లబ్

● జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి

మొగల్రాజపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ అవయవాలు అందిస్తూ దివ్యాంగులకు తమ క్లబ్స్ అండగా ఉంటున్నాయని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -316డీ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి చెప్పారు. సున్నబట్టీల సెంటర్‌లో ఉన్నఅమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ 27వ వార్షిక జిల్లా కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం సుమారు కోటి రూపాయల వ్యయంతో దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, తోపుడు బండ్లు, ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్‌లు, రిక్షా బండ్లు అందచేస్తున్నామని చెప్పారు. అనంతరం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, పాస్ట్ గవర్నర్‌లు మిరియాల వెంకటేశ్వరరావు, కంకణాల శ్రీనివాసరావు, వీవీ సాయి వరప్రసాద్, యర్రంశెట్టి శ్రీనివాసరావు, శివరామకృష్ణ, సుంకర కృష్ణ, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లయన్స్ క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా భూమన వ్యాఖ్యలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పటమట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంపై అసత్య ప్రచారాలు చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు భూమన కరుణాకర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మండిపడ్డారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి గతంలో వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని నల్లరాయి అని, దానిపై చెప్పులు విసిరితే ఏమవుతుందని వ్యాఖ్యలు చేసిన విషయాన్ని యావత్ భక్త ప్రపంచం మరువదన్నారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టతకు భగ్నం కలిగించే కుట్రలు చేస్తున్నారన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయని భూమన చేసిన ఆరోపణలు అవాస్తమన్నారు. గోశాలలో ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయాల్లో కొన్ని మృత్యువాత పడుతుంటాయని, జనన మరణ రిజిష్టర్‌లో వాటి వివరాలు ఉన్న విషయాన్ని పక్కదారి పట్టించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఆయనపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



మట్టలు చేత పట్టుకుని ఐటీఐ కాలేజీ రోడ్డులో ఊరేగింపుగా వెళుతున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

భారతీనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండుగను పురస్కరించుకుని, ఈస్టర్ పండుగ ముందు ఆదివారం జరుపుకునే మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. నాల్గవ డివిజన్ పరిధిలోని వరలక్ష్మీనగర్ చర్చిలో, సున్నపుబట్టీల సెంటర్‌లోని సాలెం రాజు ప్రేయర్ హాల్, బాడవపేట, ఉడ్‌పేట, క్రీస్తురాజుపురం, మొగల్రాజపురం, గుణదల, కృష్ణలంక, రాణిగారితోట, పటమట, బెంజిసర్కిల్ ప్రాంతాల్లోని చర్చిలలో మట్టల ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారులు పూలతో మట్టలను అలంకరించి ర్యాలీగా వీధులలో తిరుగుతూ దావీదు కుమారుడుకు జై అంటూ నినాదాలు చేశారు. దీంతో తూర్పులోని పలు డివిజన్లలో ఈస్టర్ పండుగ వాతావరణం నెలకొంది.



మట్టలు చేత పట్టుకుని ఉడ్‌పేటలో ఊరేగింపుగా వెళుతున్న తెలుగుబాప్టిస్టు చర్చి చిన్నారులు

పెంటాథ్లాన్ గేమ్‌కు విస్తృత ప్రచారం

అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

పటమట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెంటాథ్లాన్ గేమ్‌కు విస్తృత ప్రచారం కల్పించి రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా మోడరన్ పెంటాథ్లాన్ అసోసియేషన్ కృషి చేస్తుందని చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్లో జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేఘాలయాలో వచ్చే ఏడాది జనవరిలో జరిగే జాతీయ క్రీడలకు ఎక్కువ మందిని పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఉజ్వల ప్రసాద్, చైర్మన్‌గా చప్పిడి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా డింపుల్ కృష్ణ, కార్యదర్శి ఆర్.కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ, కాకినాడ, తిరుపతిలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ క్రీడను మరింత ముందుకు తీసుకెళతామని వారు స్పష్టం చేశారు.



జనరల్ బాడీ సమావేశంలో సంస్థ సభ్యులు



విక్రమ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వన్‌టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ ముంజనిలోని విక్రమ్ విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థులు (1960) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విజయవాడలో జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాకుండా, దేశంలో పలు ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కొందరు పనిచేస్తున్నారు. మరికొందరు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు. వారికి సుమారు 70 సంవత్సరాలపైబడి ఉంటాయి. ఉత్సాహంగా పాల్గొని ఆనాటి తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలుత ఆనాటి ప్రొఫెసర్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అప్పటి తమ గురువులను తలచుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రస్తుత వీసీ అర్పణ్ భరద్వాజ్ వీడియో ద్వారా సందేశాన్ని అందజేశారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. వచ్చే సమావేశాన్ని యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తామని, అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఇంటర్‌లో సత్తా చాటిన త్రివేణి విద్యార్థులు



ఎస్.మౌనిక ,965



ఎస్.జోత్స్న, 965



ఎ.సాయిమనోజ్ఞ ,942

పటమట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు సీనియర్ ఇంటర్‌లో 97 శాతం, జూనియర్ ఇంటర్‌లో 92 శాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాపతు సీతారామిరెడ్డి శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 1000కి ఎస్.కె ముస్తాన్ 983, ఎస్.మౌనిక 965, సీనియర్ ఇంటర్ ఎంఈసీలో పి.జ్యోత్స్న 955, నజీర్‌హుస్నీసా 951, సీనియర్ ఇంటర్ సీఈసీలో ఎ.సాయి మోనోజ్ఞ 942, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎస్.కె సమీరకు 460 మార్కులు, అబ్దుల్ సమీరకు 445, ఎంఈసీలో 500లకు బి.శివదీక్షిత 484, ఈ.సాయి సౌమ్య 482, జూనియర్ ఇంటర్ సీఈసీలో జి.భాగ్యశ్రీకి 482, ఎస్.కావ్యకు 448 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల డైరెక్టర్ సాంబిరెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చినవిద్యార్థులను, అధ్యాపక సిబ్బందిని కళాశాల ఇన్‌చార్జిలు శ్యామల, పుష్పలతలు అభినందించారు.

శునకాన్ని తప్పించబోయి ...

విద్యాధరపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పై శునకాన్ని తప్పించబోయి రోడ్డుమీద పడిన వ్యక్తి (35)ని గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున గొల్లపూడిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మాచవరం ఎస్ఆర్ఆర్ కాలేజీ ఎదురు కొండప్రాంతంలో పడాల లచ్చయ్య కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతను చీపుర్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఇతని పెద్ద అల్లుడు భాస్కర్‌రావు కూడా మామ లచ్చయ్య వద్దే ఉంటూ చీపుర్లు అమ్ము కుంటూ జీవనం సాగిస్తున్నాడు. భాస్కర్‌రావు ఆదివారం తెల్లవారుజామున తన బైక్‌పై నంది గామ బయలుదేరాడు. గొల్లపూడి, ఎస్‌కెటీ వసుధ అపార్టుమెంట్ వద్దకు వెళ్లేసరికి జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన శునకంను తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడ్డాడు. అతని వెనుక వేగంగా ప్రయాణించిన గుర్తు తెలియని వాహనం భాస్కర్‌రావును ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలం దగ్గరకు వెళ్లి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మామ ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెండి పట్టీలతో ప్రయోజనాలెన్నో...!

పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆడపిల్లలు, యువతులు, మధ్యవయసు మహిళలు తమ పాదాల అలంకరణలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తూ ఉంటారు. కేవలం అందానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా ఈ వెండి పట్టీలు దోహదం చేస్తాయి. ఆ వివరాలు తెలుసుకుందాం....



- పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. పాదాల నొప్పి, వాపులు తగ్గుతాయి. ఎముకలు బలపడతాయి. మోకాళ్ల నొప్పి, నడుం నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- వెండిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. అందుకే వెండి పట్టీలు పెట్టుకుంటే పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావు.
- వెండి శీతల లోహం. నిత్యం వెండి పట్టీలు పెట్టుకుని ఉండడం వల్ల మహిళల్లో శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. శరీరానికి చలువదనం చేకూరుతుంది. వేసవిలో పాదాలు వేడెక్కడం, అరికాళ్లలో చెమటలు పట్టడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- వెండి... శరీరంలోని విద్యుత్ చలన శక్తిని సమన్వయం చేస్తుంది. అందుకే మహిళలు తమ పాదాలకు వెండి గొలుసులు, పట్టీలు పెట్టుకోవడం వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని హార్మోన్లు సమతౌల్యంలో పనిచేస్తాయి. రుతు సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- రంగురంగుల రాళ్లు, మువ్వలతో విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పట్టీలు పెట్టుకోవడం వల్ల మహిళలకు మానసిక ఆనందం కలుగుతుంది.
- అధిక బరువున్న పట్టీలు కాకుండా తేలికగా ఉన్నవాటిని ధరిస్తే నడవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. నాణ్యమైన వెండితో రూపొందించిన పట్టీలు ఎంచుకోవడం మంచిది.



అందం అంటే అంతకుమించి

మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ 85 ఏళ్ల జూలియా మోర్లీని చూస్తే 60 ఏళ్లు అనిపిస్తుంది. ఈ ప్రపంచానికి ఏదో చేయాలనే తపన అనుక్షణం కనిపిస్తూ ఉంటుంది. "అందం అనేది బాహ్యశరీరంలో మాత్రమే ఉండదు.. వ్యక్తిత్వంలో కూడా ఉంటుంది.. ఈ రెండూ కలిసినదే అసలైన అందం" అంటారు జూలియా. కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) సహా అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన జూలియాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం ఉంది. వచ్చే నెల ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవటానికి కారణమేమిటి?

ప్రపంచ సుందరి పోటీలను ప్రతి ఏడాది వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తూ ఉంటాం. ఈ సారి తెలంగాణను ఎంపిక చేశాం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. నేను ఇక్కడ ఎవరికీ చెప్పని ఒక విషయం చెబుతాను. నాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం. ఎందుకంటే సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను, ఎరిక్ (జూలియా భర్త) భారత్‌కు వచ్చి అనేక ప్రాంతాలు తిరిగాం. ఆ సమయంలో మేము మహిళలకు శానిటరీ నేప్‌కిన్స్ ఇచ్చే ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాళ్లం. ఆ సమయంలో హైదరాబాద్‌కు కూడా వచ్చాం. ఆ కార్యక్రమ నిర్వహణలో మాకు పోలీసులు చాలా సాయం చేశారు. అందుకే హైదరాబాద్ అనగానే పోలీసుల ఔదార్యం గుర్తుకు వస్తుంది. ఇది చాలా కాలం క్రితం జరిగి నంఘటన. కానీ నిన్న జరిగినట్లు అనిపిస్తోంది. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. వారందరికి నా ధన్యవాదాలు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో హైదరాబాద్ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలియని ఒక రహస్యం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల ఆఫీసులు ఇక్కడ ఉన్నాయి. ఇదొక అందమైన నగరం. కానీ దీని గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రపంచ సుందరి పోటీలు ఈ నగరానికి కొత్త గుర్తింపు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడకు మరింతగా రావాలని కోరుకుంటున్నా.

ప్రపంచ సుందరి పోటీలు దేనికి చిహ్నంగా భావించాలి?

ఒక అందమైన అమ్మాయిని ప్రపంచ సుందరిగా ప్రకటించటం మా ఉద్దేశం కాదు. నా దృష్టిలో అందం అంటే శరీర సౌందర్యం కాదు. అందమైన మొహం.. పెదాలు.. అవయవ సౌష్టవం ఉంటే ప్రపంచ సుందరిలు కారు. వారికి అందమైన వ్యక్తిత్వం ఉండాలి. ఇతరులకు సాయం చేసే గుణం ఉండాలి. అందుకే ఈ పోటీలను నేను 'బ్యూటీ విత్ పర్పస్' అని పిలుస్తాను. ఇక్కడికి వచ్చే అందగత్తెలందరూ వారి వారి దేశాల్లో చేయదలుచుకున్న ప్రాజెక్టులను తీసుకువస్తారు. వారు ఏ ప్రాజెక్టులు చేయాలనే విషయాన్ని మేము వారికి చెప్పం. వారి ఊహాశక్తి.. కొన్ని అంశాలపై వారికి ఉన్న నిబద్ధతల ఆధారంగా వాటిని వారు ఎంపిక చేసుకుంటారు. ఇలా ప్రతి ఏడాది సుమారు 130 ప్రాజెక్టులు వస్తాయి. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసి వాటికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. అందుకే ప్రపంచ సుందరి పోటీలంటే భౌతికపరమైన అందం మాత్రమే కాదని చెప్పగలుగుతున్నాను.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలలో ఫార్మాట్ మార్చినట్లున్నారు కదా..

ఫార్మాట్‌లో మార్పులు జరుపుతూనే ఉంటాం. ఉదాహరణకు ఒకప్పుడు స్విమ్‌సూట్ రౌండ్ ఉండేది. అది ఇప్పుడు లేదు. బీచ్‌లో ఉన్నప్పుడు స్విమ్ సూట్ వేసుకుంటాం. ప్రతి రోజు దాన్ని వేసుకొని తిరగం కదా! అంతే కాదు ...వ్యక్తిగతంగా కూడా నాకు స్విమ్‌సూట్ వేసుకొని ఇతరుల ముందుకు నడుచుకుంటూ రావటం ఇష్టం ఉండదు. కానీ కొన్ని పరిస్థితులకు తగ్గట్టుగా ఆ రౌండ్ ఉండేది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. మేము 1953లో ప్రపంచ సుందరి పోటీలను ప్రారంభించినప్పుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రపంచమంతా రెండో ప్రపంచయుద్ధ ఒత్తిడి నుంచి తేరుకుంటోంది. ఈ సమయంలో ప్రజలందరిలోను ఒక విధమైన నిరాశ, ఆందోళన ఉండేవి. ఆ సమయంలో వారిలో సంతోషం నింపటానికి ఏదైనా చేస్తే బావుండననిపించింది. ప్రపంచసుందరి పోటీలు అలా పుట్టాయి. దీనిని ప్రపంచ ప్రజలందరూ ఆదరించారు. పరిస్థితులకు అనుగుణంగా మేము ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూనే ఉంటాం.

ప్రపంచ సుందరి పోటీల ద్వారా వచ్చిన సంపాదనను ఏం చేస్తారు? ఎలా ఖర్చు పెడతారు?

మాకు ఈ పోటీల నుంచి వచ్చే డబ్బులో ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. డబు సంపాదించటం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు. వచ్చిన డబ్బు మొత్తం మేము నిర్వహించే ప్రాజెక్టులపైనే ఖర్చు పెడతాం. ఈ ప్రాజెక్టులు విజయవంతమయినప్పుడు కలిగే ఆనందానికి వెల లేదు. ఉదాహరణకు మేము ఇండోనేషియాలో ఒక ప్రాంతంలో ఒక వంతెన నిర్మించాం. దాని వల్ల కొన్ని వందల మందికి లబ్ధి చేకూరుతోంది. అక్కడున్న పిల్లలు స్కూలుకు వెళ్లగలుగుతున్నారు. ఆ పిల్లలను కలిసినప్పుడు వారు చూపించిన ప్రేమ అమూల్యమైనది. అంతేకాకుండా- ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వేల మంది వలంటీర్లు తమ పరిధిలో సమాజంలో మార్పు తేవటానికి చేస్తున్న ప్రయత్నాలను డబ్బులతో వెలకట్టలేం.

మీరు ఇన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు కదా.. మరచిపోలేని సంఘటనలు ఏవైనా ఉన్నాయా?


చాలా ఉన్నాయి. కానీ ఒక సంఘటన మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను. మేము నైజీరియాలో పోటీలను నిర్వహించాలనుకున్నాం. అక్కడి ప్రభుత్వం కూడా చాలా సాయం చేసింది. పోటీల సమయంలోనే అమీనా అనే అమ్మాయిని రాళ్లతో కొట్టి చంపారని ఒక అంతర్జాతీయ పత్రికలో వార్త వచ్చింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనం చెలరేగింది. వాస్తవానికి ఆ సంఘటన జరగలేదు. కొందరు పాశ్చాత్య జర్నలిస్టులు కావాలని రాసిన వార్త. ఆ విషయం మాకు తెలుసు. కానీ ప్రపంచానికి తెలియదు కదా! ప్రపంచమంతా అలజడి ప్రారంభమయింది. దీనితో రాత్రికి రాత్రి పోటీలను రద్దు చేసుకున్నాం. ఒక విమానాన్ని అద్దెకు తీసుకొని పోటీదారులందరితో ఇంగ్లాండ్ వచ్చేశాం. రాత్రికి రాత్రి వందల మందిని ఒక దేశం నుంచి మరొక దేశానికి తీసుకురావాలంటే ఎంత ఒత్తిడి ఉంటుందో ఆలోచించండి! ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం.

ఈ పోటీలలో బీద.. ధనిక దేశాల నుంచి వచ్చిన యువతులు ఉంటారు. వారిలో కొందరికి విపరీతంగా ఖర్చు పెట్టే స్తోమత లేకపోవచ్చు. అలాంటప్పుడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు..

ప్రతి దేశంలోను మిస్‌వరల్డ్ తొలి రౌండ్ పోటీలను నిర్వహించటానికి కొందరు లైసెన్స్ హోల్డర్స్ ఉంటారు. వారు వారి దేశాలలో నెగ్గిన వారికి స్పాన్సరర్స్‌ను తీసుకువస్తారు. ఒకప్పుడు దుస్తుల మీద ఎక్కువ ఖర్చు పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ ఖర్చు విపరీతంగా ఉంటోంది. అందుకే నేను జ్యూరీ సభ్యులకు "మీరు ఎవ్వరి ఒత్తిడికి లొంగవద్దు. ఇతరులు ఏం చేస్తున్నారే విషయాన్ని చూడద్దు. మీరు స్వయంగా నిర్ణయాలు తీసుకోండి.." అని చెబుతూ ఉంటా. "ఒక అమ్మాయి అద్భుతమైన డ్రస్సు వేసుకుంటే ప్రపంచ సుందరి అయిపోతుందా? ఇంకో అమ్మాయి ఇతరుల కన్నా బాగా మాట్లాడగలిగితే ప్రపంచ సుందరి అయిపోతుందా?" అని అడిగితే "కాదు" అని కచ్చితంగా చెప్పగలను.

- అందం అనేది చాలా చిత్రమైన పదం. ఒక అమాయకమైన పాప మొహంలో కనిపించే అందం కొందరు మాత్రమే చూడగలుగుతారు. చాలా సార్లు అందం అనే పదాన్ని తప్పుగా వాడుతూ ఉంటారు. నా ఉద్దేశంలో ప్రేమ, నిబద్ధత, ఇతరులకు సేవ చేయాలనే కోరిక, మంచి వ్యక్తిత్వం, చురుకుదనం- ఇవన్నీ కలగసినప్పుడే నిజమైన అందం కనిపిస్తుంది.
- మొత్తం ప్రపంచమంతా ఒకరితో మరొకరు ఎటువంటి అమరికలు లేకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోగలిగిన రోజు రావాలనేది నా కోరిక. అన్ని చోట్ల భిన్నాభిప్రాయాలు ఉంటాయి. రకరకాల ప్రతికూల భావాలు కూడా ఉంటాయి. వాటన్నింటినీ అధిగమించగలిగినప్పుడు అందమైన ప్రపంచాన్ని సృష్టించుకోగలుగుతాం.
- ఈ సారి పోటీల తర్వాత తెలంగాణకు ఏదో విషయంలో మేలు చేయాలనేది మా ఉద్దేశం. ముఖ్యంగా పిల్లలకు, మహిళలకు సంబంధించిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకుంటాం.

• సివిఎల్ఎన్. ప్రసాద్



చిత్రజ్యోతి
SINCE 1965

కోట్ల రూపాయలు వదులుకున్నా

సమంత



మహిళా సాధికారతపై తరచూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మానసిక ఆరోగ్యం, వ్యాపార సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గురించి మాట్లాడారు. కోట్ల రూపాయల డబ్బు వస్తున్నప్పటికీ వాటిని పక్కన బెట్టడం వెనుక బలమైన కారణం ఉందన్నారు. '20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో ఎన్ని సినిమాలు చేశాం. ఎన్ని బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నాం అనేదానిపైనే సక్సెస్‌ని నిర్ణయించేవారు. నిజానికి ఆ సమయంలో ఎన్నో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ ఇప్పుడు నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు పెద్దగా ఆలోచించకుండా కొన్ని బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడినా ఏడాది కాలంలో 15 బ్రాండ్లు వదులుకున్నా. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ నేను అంగీకరించడం లేదు. నాకు తెలిసిన వైద్యులను సంప్రదించి సదరు బ్రాండ్లతో ఎలాంటి హానీ లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత తెలిపారు.

వినోదం పంచే పాంచ్‌మినార్



రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప విజన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పాడు. రామ్ కడుముల మాట్లాడుతూ 'పాంచ్‌మినార్ అంటే ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఆద్యంతం హాయిగా నవ్వుకునే సినిమా ఇది' అని తెలిపారు. 'ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది, ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక రాశీ సింగ్ చెప్పారు.

మంచి కథను అందించాలనే..

సుమయ రెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఆసక్తి. ఇంట్లో ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలే చూసేవాళ్లం. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మోడలింగ్ చేశా. సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. అందుకని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను' అని అన్నారు సుమయ రెడ్డి. ఆమె నిర్మిస్తూ కథానాయికగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'ఓ మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో 'డియర్ ఉమ' కథ రాశాను. దర్శకుడు సాయి రాజేశ్ మహదేవ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల పరిచయం ఉంది. అర్థవంతమైన కథ అందరికీ పనికొస్తుంది అన్నారు. నన్ను నమ్మి డబ్బులు పెట్టి సినిమా తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు అనే సంశయంలో పడిపోయా. అప్పుడు మా అమ్మ సపోర్ట్‌తో నేనే నిర్మాతగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. నేడు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సొసైటీకి మెసేజ్ ఇవ్వడమే కాదు పరిష్కారాన్నీ చూపించే ప్రయత్నం చేశాం. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఈ సినిమాలో మంచి లవ్ ట్రాక్ కూడా ఉంది. హీరో, హీరోయిన్లు ఒకరి లక్ష్య సాధనకు మరొకరు ఎలా సాయపడ్డారనే అంశాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. వీరిద్దరూ కలసి వైద్య వ్యవస్థ ప్రక్షాళనకు ఎలా పోరాడారన్నది ప్రధాన ఇతివృత్తం. ఒక తెలుగమ్మాయిగా నా సినిమాలో తెలుగు హీరోనే పెట్టాలనుకున్నాను. కొంతమందిని సంప్రదించాను కానీ డేట్స్ కుదరలేదు. అందుకని హీరోగా పృథ్వీ అంబర్‌ను ఎంచుకున్నాం' అని అన్నారు.





పెద్ద విజయం అందుకోబోతున్నాం

'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో చక్కని ఆదరణ దక్కుతోంది. అన్ని చోట్లా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇది ఇక్కడితో ఆగదు. సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతోంది' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ 'మైత్రీ సంస్థ తమిళంలో చేసిన తొలి చిత్రమిది. నవీన్ గారి వల్లే సినిమా ఇంత పెద్దహిట్ అయింది. అజిత్ గారి మద్దతు మరువలేనిది' అని చెప్పారు. అజిత్‌ఫ్యాన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని సునీల్ చెప్పారు. ఈ సినిమాలో నా పాత్రకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అని ప్రియా ప్రకాశ్ వారియర్ తెలిపారు.

భావోద్వేగానికి గురైన మంచు లక్ష్మి



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించే లక్ష్యంతో నటి మంచు లక్ష్మి 'టీచ్ ఫర్ ఛేంజ్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ ఏడాదీ హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా, నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంచు మనోజ్, తన సతీమణి మౌనికతో విచ్చేసి మంచు లక్ష్మీని ఆశ్చర్యపరిచారు. చాలా రోజుల తర్వాత తన తమ్ముడిని చూసిన ఆనందంలో ఆమె, భావోద్వేగంతో మనోజ్‌ను హత్తుకున్నారు. కంటనీరు పెట్టుకున్న మంచు లక్ష్మిని మౌనిక ఓదార్చారు.

నేడు తాడికొండలో సీఎం చంద్రబాబు పర్యటన

» అంబేడ్కర్ జయంతి, పీ4, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

» మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలతో సమావేశం

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు తాడికొండలోని పొన్నెకల్లు గ్రామానికి హెలికాప్టర్‌లో చేరుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అంబేడ్కర్ కాలనీ నివాసితులతో ముఖాముఖిగా సమావేశమై వాళ్ల పని చేస్తున్న ప్రదేశాలను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నిర్మాణానికి పునాదిరాయి వేస్తారు. అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి ఉపకారవేతనం కింద లబ్ధిపొందిన వారితో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించి సన్మానిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం 2.40 గంటల నుంచి 4.10 గంటల వరకు తాడికొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాడర్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 4.15 గంటలకు తన పర్యటన ముగించుకొని ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరతారు. ఈ మేరకు సీఎంవో నుంచి గుంటూరు జిల్లా యంత్రాంగానికి సీఎం పర్యటన షెడ్యూల్ అందింది.

రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సుస్థిరం

» డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



ఉండి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సుస్థిరంగా ఉండడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో చర్యలు చేపడతామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో ఆదివారం జరిగిన ఆక్వా రైతుల ఉమ్మడి జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమెరికా ఆంక్షలతో ఇబ్బందులు ఉండవని, అక్కడికి మన రొయ్యలు ఎగుమతి చేయకున్నా నష్టం లేదన్నారు. ప్రపంచంలో ఎన్నోదేశాలు మన రొయ్యల కోసం ఎగబడుతున్నాయని చెప్పారు. పంట పండినప్పుడు రొయ్యల ధర తగ్గుతుందని, ఈ అంశం సీఎంతో దృష్టికి తీసుకువెళతామన్నారు. సదస్సులో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, కలెక్టర్ సి.నాగరాణి, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

'వనజీవి' ఆదర్శంగా రోజూ ఒక మొక్క నాటుతా

» విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



తూర్పుగోదావరి జిల్లా ప్రకాశరావుపాలెంలో మొక్క నాటుతున్న ఎంపీ కలిశెట్టి

నల్లజర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వనజీవి దరిపల్లి రామయ్య ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, ఇందులో భాగంగా నేటి నుంచి ప్రతిరోజూ తాను కూడా ఒక మొక్క నాటి సంరక్షిస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు ఫాంహౌస్ వద్ద అప్పలనాయుడు మొక్క నాటి రామయ్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామయ్య 50 ఏళ్లపాటు మొక్కలు నాటుతూ వచ్చారని, ఆయన సేవలను గుర్తించిన కేంద్రం పద్మశ్రీ అవార్డు కూడా ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. ఇకపై రామయ్య లేని లోటు తాను తీర్చేలా బాధ్యత తీసుకుంటున్నానని, ఆయనకు నివాళిగా రోజూ ఓ మొక్క నాటుతానని ప్రకటించారు. పార్లమెంట్‌లో ఉన్న సమయంలో మాత్రం తన కుమార్తె నిఖిలా చారిటబుల్ ట్రస్ట్ టీం విజయనగరం పార్లమెంట్ పరిధిలో ప్రతిరోజూ మొక్కనాటే విధంగా బాధ్యత అప్పగిస్తున్నట్టు చెప్పారు.



నా జాతి ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.. ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చాను.. పోరాడి రాజులవుతారో.. ఓటును అమ్ముకుని బానిసలవుతారో నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది. - అంబేడ్కర్



పోలవరం-బనకచర్ల పథకం వెంబడి..

విద్యుదుత్పత్తి కష్టమే!!

» సీఎం ఆదేశాలతో అధికారుల సమీక్ష

» సాధ్యాసాధ్యాలపై మేధోమథనం

» బొల్లాపల్లి రిజర్వాయరుపై పంప్డ్ స్టోరేజీ ఏర్పాటు కుదరదు

» గట్ల వెంబడి సోలార్ ప్లాంట్లతోనూ లాభం లేదు

» 2 వేల మెగావాట్ల లక్ష్యంలో 18 శాతమే ఉత్పత్తయ్యే చాన్సు!

» దీంతో ప్రత్యామ్నాయాలపై సమాలోచన



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వెంబడి పంప్డ్ స్టోరేజీ, సౌర విద్యుత్కేంద్రాల ఏర్పాటు, వాటి ద్వారా 3,430 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యమేనా అని జల వనరుల శాఖ, ఏపీ జెన్కో ఉమ్మడిగా మేధోమథనం జరుపుతున్నాయి. బనకచర్ల స్కీంలో కీలకమైన బొల్లాపల్లి రిజర్వాయరు లోతు తక్కువగా ఉండడం వల్ల నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో ఉండదని.. అందువల్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటు వల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చని ప్రాథమిక స్థాయి సమీక్షల్లో అభిప్రాయం వ్యక్తమైంది. రూ.80,112 కోట్ల భారీ అంచనా పథకంతో తలపెట్టిన ఈ పథకం నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా.. భూసేకరణ, సహాయ పునరావాసం కోసం రాష్ట్రప్రభుత్వం కూడా భారీగానే వ్యయం చేయాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. నిర్వహణ భారం కాకుండా.. స్వీయ ఆదాయ ఆర్జన పథకంగా ఈ ప్రాజెక్టును మలచాలంటే.. దాని వెంబడి జల, సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేసి అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవాలన్నది ఆయన అభిమతం. బొల్లాపల్లి రిజర్వాయరు వద్ద 230 మెగావాట్ల విద్యుదుత్పత్తిని సాధించవచ్చని జలవనరుల శాఖకు ప్రాథమిక అంచనాలు అందాయి. అదేవిధంగా సిద్ధాపురం వద్ద మరో 200 మెగావాట్లు ఉత్పత్తి చేయవచ్చని.. గుత్తికొండ వద్ద 400, 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని నివేదికలు వచ్చాయి. అదేవిధంగా కొన్ని ఎంపిక చేసిన చోట్ల సోలార్ ప్లాంట్లు పెడితే 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించవచ్చని రిపోర్టులు అందాయి. మొత్తంగా 3,430 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే వీలుందనేది వీటన్నిటి సారాంశం. ప్రాజెక్టు నిర్వహణకు 3,377 మెగావాట్లు అవసరమని.. ఇది పోను ఇంకా 53 మెగావాట్ల కరెంటు మిగులుతుందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ రిపోర్టులను సీఎం ముందు ఉంచినప్పుడు.. సమగ్ర అధ్యయనం చేయాలని ఆయన ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను ఆదేశించారు. ఇందుకోసం జెన్కో జల విద్యుత్ విభాగం సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

నివేదికలపై చర్చ

శుక్ర, శనివారాల్లో రెండ్రోజులపాటు సాయి ప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయా నివేదికలపై చర్చించారు. పంప్డ్ స్టోరేజీ ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టేందుకు వీలైన పరిస్థితులు ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తమైంది. బొల్లాపల్లి రిజర్వాయరు 60 మీటర్ల లోతులోనే ఉండడం.. అందులో నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున తోడేస్తుంటే నీరు 40 మీటర్ల వరకే ఉంటుందని.. దానిపై ఆధారపడి పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను పెట్టలేమని.. ఒకవేళ పెట్టినా ఆర్థికంగా నష్టమే తప్ప లాభం ఉండదని కొందరు నిపుణులు పేర్కొన్నట్లు తెలిసింది. బొల్లాపల్లికి బదులుగా.. సమీపంలోని కొండ ప్రదేశాల్లో పంప్డ్ స్టోరేజీ ప్లాంటు పెడితే మెరుగైన ఫలితం దక్కుతుందని వారు సూచించినట్లు సమాచారం. ఇక అనుసంధాన కాలువ గట్ల వెంబడి సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో విద్యుదుత్పత్తికి అవకాశాలు అంతగా లేవన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. పోలవరం-బనకచర్ల మధ్య నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో లక్షిత 2 వేల మెగావాట్లకు గాను 18 శాతానికిలోపే సౌర విద్యుదుత్పత్తి సాధ్యమని అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో.. ప్రత్యామ్నాయ విధానాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలన్న నిర్ణయానికి జల వనరుల శాఖ, ఏపీ జెన్కో వచ్చినట్లు తెలిసింది.

ఏపీలో 2.22 లక్షల మంది ఎయిడ్స్ రోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 18,36,983 మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. 10,22,809 మంది (56 శాతం) దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 3.53 లక్షల మంది ఉన్నారు. ఎయిడ్స్ బాధితుల సంఖ్యలో మహారాష్ట్ర టాప్‌లో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రెండు, తెలంగాణ ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా హెచ్‌ఐవీ బాధితుల గణాంకాలను కేంద్రం విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఎయిడ్స్ రోగుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఏపీలో 2.22 లక్షల మంది ఎయిడ్స్ రోగులుండగా.. వీరిలో 98,432 మంది పురుషులు, 1,23,103 మంది మహిళలు, 810 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇక తెలంగాణలో ఈ సంఖ్య 1.31 లక్షలు ఉంది. ఎయిడ్స్ రోగుల్లో ఏపీలో 7,890, తెలంగాణలో 4,278 మంది బాలబాలికలు ఉన్నారు. మహారాష్ట్రలో 3,18,492, మూడో స్థానంలో ఉన్న కర్ణాటకలో 2.01 లక్షలు, తమిళనాడులో 1.37 లక్షలు, యూపీలో 1.23 లక్షల మంది రోగులున్నారు.

తెలంగాణలో నేటి నుంచే

ఎస్సీ వర్గీకరణ అమల్లోకి

» మూడు గ్రూపులు.. 59 ఉప కులాలు.. మొత్తం 15శాతం రిజర్వేషన్లు

» గ్రూపు-1కు 1 శాతం, గ్రూపు-2కు 9%, గ్రూపు-3కు 5% వర్తింపు

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లో (ఎస్సీ) బాగా వెనుకబడి, రిజర్వేషన్ల ఫలితాన్ని సరిగా పొందలేకపోయిన కులాల కల నెరవేరుతోంది. రాష్ట్రంలో ఎస్సీలకు ఇప్పటివరకు గంపగుత్తగా అమలైన 15శాతం రిజర్వేషన్లు.. ఇక నుంచి వర్గీకరణ ప్రకారం అందనున్నాయి. అందులోనూ గ్రూపులు, కులాల ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్సీ గ్రూపులు, కులాల వారీగా అందే రిజర్వేషన్ల వివరాలతో జీవో నంబర్ 9ని విడుదల చేయనుంది. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. సెప్టెంబర్ 12న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉప సంఘం సూచన మేరకు 2024 అక్టోబర్ 11న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ 2011 జనాభా లెక్కల ఆధారంగా పరిశీలన జరిపి.. ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక అందజేసింది. కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్‌ను విభజిస్తున్నట్టు ఫిబ్రవరి 4న అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది.

మూడు అంశాల ఆధారంగా వర్గీకరణ..

జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, జనాభా శాతం ఆధారంగా 15 శాతం రిజర్వేషన్‌ను పంచింది. గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చి 1శాతం, గ్రూప్-2లో మాదిగ, దాని ఉప కులాలను కలిపి 18 కులాలకు 9శాతం, గ్రూప్-3లో మాల, దాని ఉపకులాలను కలిపి 26 కులాలకు 5శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో 1,71,625 మంది (3.288 శాతం), గ్రూప్-2లో 32,74,377 మంది (62.748 శాతం), గ్రూప్-3లో 17,71,1682 మంది (33.963 శాతం) జనాభా ఉన్నారని పేర్కొంది.

ఉద్యోగాల భర్తీల్లో గ్రూపుల వారీగా ప్రాధాన్యక్రమం..

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎస్సీ రిజర్వేషన్ల అమలుకు గ్రూపుల వారీగా ప్రాధాన్యత క్రమం అనుసరించాలని కమిషన్ ప్రతిపాదించింది. గ్రూప్-1లోని కులాల వారితో ఖాళీలు భర్తీ కాకపోతే.. గ్రూప్-2లోని వారితో, గ్రూప్-2లో భర్తీకాని ఖాళీలను గ్రూప్-3లోని కులాల వారితో భర్తీ చేయాలని సూచించింది. ఒకవేళ ఈ మూడు గ్రూపుల్లో తగిన అభ్యర్థులు లేకపోతే ఖాళీలను తర్వాతి నోటిఫికేషన్‌కు కొనసాగించాలని (క్యారీ ఫార్వర్డ్) పేర్కొంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్లు కీలకంగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వారి రిజర్వేషన్ల ప్రకారం రోస్టర్ పాయింట్లు ఉంటాయి. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గ్రూపుల వారీగా ఈ రోస్టర్ పాయింట్లను కూడా కమిషన్ విభజించింది. ఎస్సీ గ్రూప్-1కు 7వ రోస్టర్ పాయింట్, గ్రూప్-2లోని వారికి 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97 పాయింట్లను, గ్రూప్-3లోని వారికి 22, 41, 62, 77, 91 రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది. సోమవారం విడుదల చేసే ఉత్తర్వుల్లో ఈ వివరాలను పొందుపర్చనున్నారు.

దిక్సూచి
DIKSUCHI

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship

The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).
Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.
Prizes & Rewards: Financial support for covering key educational expenses.
Last Date to Apply: 30-04-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP5

UQ International High Achievers Award - India



UQ International High Achievers Award - India 2025 is offered by the University of Queensland, Australia to students pursuing undergraduate/postgraduate courses at the university.
Eligibility: Open for students of selected countries including India holding a valid passport. Applicants must have received an offer to pursue full-time undergraduate or postgraduate coursework at the University of Queensland. Students must have English language proficiency, relevant program entry rank, and competitive scores as determined by the University.
Prizes & Rewards: 20% reduction in tuition fees per semester.
Last Date to Apply: Round The Year
Application mode: Online Application
Short Url: www.b4s.in/aj/UQI1

buddy4study.com

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఈ నైపుణ్యాలు ఉంటేనే ఆఫర్

విద్యార్థుల జీవితంలో 'క్యాంపస్ ప్లేస్‌మెంట్' కీలకమైన దశ. ప్రధానంగా ఇంజనీరింగ్ డిగ్రీ పొందడానికి ముందే జాబ్ ఆఫర్ అందుకునేందుకు ఇది మంచి అవకాశం. దరిమిలా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విజయం సాధించడానికి సరైన ప్రణాళికతో సిద్ధం కావాలి.

మొదటి నుంచే ప్లానింగ్:
ఇంజనీరింగ్‌లో చేరిన మొదటి మూడు సంవత్సరాల్లోనే ప్లేస్‌మెంట్స్‌కు అవసరమైన ప్లానింగ్‌పై దృష్టి పెట్టాలి. అది ఎలా అంటే..
అకడమిక్ ఫౌండేషన్:
మొదటి సంవత్సరం నుంచి మంచి సీజీపీఏ ఉండేలా చూసుకోవాలి. చాలా కంపెనీలు 7.5 కంటే ఎక్కువ సీజీపీఏ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తాయి.
కోర్ టెక్నికల్ స్కిల్స్ :
సీ, సీ++, జావా, పైథాన్‌లతోపాటు డేటా స్ట్రక్చర్ అండ్ ఆల్గరిథమ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్‌పై దృష్టిపెట్టాలి.
సాఫ్ట్‌స్కిల్స్:
కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడంతోపాటు టీమ్ వర్క్ అలవాటు చేసుకోవాలి. క్లబ్స్/ ఈవెంట్స్ తదితరాల్లో పాల్గొనడం ద్వారా కొంతమేర నాయకత్వ లక్షణాలు అలవడతాయి.
ఇంటర్న్‌షిప్స్ అండ్ ప్రాజెక్ట్స్:
ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్, ఫ్రీలాన్స్ పనులు చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం సంపాదించుకోవాలి.
కోడింగ్: కోడ్‌చెఫ్, లీట్‌కోడ్, హాకర్‌రాంక్, కోడ్‌ఫోర్సెస్ తదితర కోడింగ్ పోటీల్లో పాల్గొంటే అనుభవం వస్తుంది.
టార్గెట్ కంపెనీస్ రీసెర్చ్:
ఫైనల్ ఇయర్‌లో చేయాల్సిన పని ఇది. ఏయే కంపెనీలు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయో తెలుసుకుని, వాటికి సంబంధించిన ప్రాథమిక సమాచారం యావత్తు సేకరించుకోవాలి.
ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌పై అవగాహన:
ప్లేస్‌మెంట్స్ కోసం పలు రకాల కంపెనీలు వస్తుంటాయి. అందులో మీ ప్రాధాన్యం ఏమిటో చూసుకుని సిద్ధం కావాలి. ఉదాహరణకు ఐటీ, కోర్, అనలిటిక్స్, కన్సల్టింగ్ తదితర పనుల్లో విద్యార్థి తనకు దేనిపై ఆసక్తి ఉన్నదో చూసుకోవాలి.
ఏ రకమైన ఉద్యోగాలు:
సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, కోర్ ఇంజనీరింగ్, కన్సల్టింగ్ తదితర ఉద్యోగాలపై అవగాహన పెంచుకోవాలి.
కంపెనీకి అనుగుణంగా ప్రిపరేషన్:
సదరు కంపెనీలు గత సంవత్సరాల్లో రిక్రూట్‌మెంట్ ఎలా నిర్వహించాయో అర్థం చేసుకోండి. ఆప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ రౌండ్స్, హెచ్‌ఆర్ ప్రశ్నలు తదితరాలు ఉంటాయి. వీటికి అనుగుణంగా సిద్ధం కావాలి.

టెక్నికల్ ప్రిపరేషన్

ప్రోగ్రామింగ్ అండ్ డీఎస్ఏ:
మాస్టర్ కీ కాన్సెప్ట్స్(అరేస్, స్ట్రింగ్స్, లింక్డ్ లిస్ట్స్, ట్రీస్, గ్రాఫ్స్, డైనమిక్ ప్రోగ్రామింగ్) పెంచుకోవాలి.
సీఎస్ ఫండమెంటల్స్:
ఓఎస్, డీబీఎంఎస్, ఓఓపీలు, సీఎన్(ఐటీ/సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం) తదితరాలను రివైజ్ చేసుకోవాలి.
కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్స్:
నాన్ ఐటీ ఉద్యోగాల కోసం కోర్ కాన్సెప్టులను రివైజ్ చేసుకోవాలి.
ప్రాబ్లమ్ సాల్వింగ్ ప్రాక్టీస్:
లీట్‌కోడ్, గీక్స్ ఫర్ గీక్స్ తదితర ప్లాట్ ఫారమ్‌లలో కనీసం 200పైన ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.



ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్

సబ్జెక్టులతోపాటు ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌పై దృష్టిపెట్టాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ వర్క్, ప్రాబబిలిటీ, పర్మిటేషన్స్
- **లాజికల్ రీజనింగ్:** పజిల్స్, సిల్లోగిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్-డీకోడింగ్
- **వెర్బల్ ఎబిలిటీ:** గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబులరీ(ఎమ్‌కాట్, కోకుబీస్ లాంటి పరీక్షలు)

రెజ్యూమె, లింక్డిన్ ప్రొఫైల్

రెజ్యూమెను ఆకట్టుకునేలా తయారు చేసుకోవాలి. ఇందుకోసం పలు విషయాలు పొందుపరచాలి. అకడమిక్ పర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేయాలి, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాలు, సాధించిన ఘనతలు పేర్కొనాలి.
లింక్డిన్, గిట్‌హబ్: ప్రాజెక్టులు, ఇతర అచీవ్‌మెంట్స్‌తో ప్రొఫైల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూనే ఉండాలి.

మాక్ ఇంటర్వ్యూ, జీడీ, పీఐ ప్రాక్టీస్

టెక్నికల్ ఇంటర్వ్యూ: వైట్‌బోర్డ్‌పై కోడింగ్ ప్రాక్టీస్ చేయాలి. సొల్యూషన్స్‌ను క్లియర్‌గా వివరించగలగాలి.
హెచ్‌ఆర్, బిహేవియరల్ రౌండ్స్: సాధారణంగా రెగ్యులర్‌గా అడిగే ప్రశ్నలు కొన్ని ఉంటాయి. వాటికి సమాధానాలు ప్రాక్టీస్ చేయండి. ఉదాహరణకు 'టెల్ మీ అబౌట్ యువర్ సెల్ఫ్', 'వై షుడ్ వి హైర్ యు', 'డిస్క్రైబ్ ఏ చాలెంజింగ్ ప్రాజెక్ట్' తదితరాలు అన్నమాట.
గ్రూప్ డిస్కషన్: కరెంట్ అఫైర్స్‌పై తాజా సమాచారంతో ఉండాలి. లాజికల్‌గా మాట్లాడడం రావాలి.
ప్లేస్‌మెంట్ రోజు: సరైన దుస్తులు ధరించాలి. ముఖ్యంగా ఫార్మల్‌గా ఉండేలా చూసుకుంటే బెటర్. టైమ్ మేనేజ్‌మెంట్ పాటించాలి. ఆత్మవిశ్వాసంతోపాటు, ప్రశాంతంగా ఉండాలి. ఇంటర్వ్యూ సమయంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే గాబరా పడవద్దు.

బ్యాకప్ ప్లాన్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం రాకపోయినా ఆందోళన వద్దు. ప్రత్యామ్నాయాలు ఆలోచించుకుంటే చాలు. లింక్డిన్, ఏంజెల్ లిస్ట్, నౌకరీ, ఇండీడ్ తదితర సైట్లలో కూడా రెజ్యూమె అప్లయ్ చేసుకోవాలి.
హయ్యర్ స్టడీస్: గేట్, క్యాట్, జీఆర్‌ఈ పరీక్షలపై కూడా దృష్టి ఉంచుకోవాలి. ఏదీ వర్కౌట్ కాకుంటే ఎంబీఏ కోర్సులో చేరొచ్చు. స్టార్టప్స్, ఫ్రీలాన్సింగ్ వైపు కూడా ఆలోచించవచ్చు.

చివరగా

కాలేజీ సీనియర్లతో నెట్‌వర్క్ మెయింటెన్ చేయాలి. హైరింగ్ పద్ధతులను తెలుసుకోవాలి. ప్రీ ప్లేస్‌మెంట్ టాక్స్‌కి వెళితే సదరు కంపెనీల అంచనాలు ఏమిటో అర్థం అవుతాయి. టెక్ ట్రెండ్స్ గురించి అవగాహన పెంచుకోవాలి.

ఉదాహరణకు

కంపెనీలు	కావాల్సిన నైపుణ్యాలు
టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో	ఆప్టిట్యూడ్, బేసిక్ కోడింగ్
మైక్రోసాఫ్ట్, గూగుల్	డీఎస్ఏ, ప్రాబ్లమ్ సాల్వింగ్
అమెజాన్, ఫ్లిప్‌కార్ట్	కోడింగ్, సిస్టమ్ డిజైన్
ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్	కోర్ ఇంజనీరింగ్ నాలెడ్జ్
జేపీ మోర్గాన్, గోల్డ్‌మెన్ సాచ్	ఆప్టిట్యూడ్, డీఎస్ఏ, ఫైనాన్స్ బేసిక్



ప్రొఫెసర్
ఎన్. వి రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటీ, రాయ్‌పూర్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నారు. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపుకోవాలి.
మొత్తం పోస్టులు: 400
విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో బీఈ, బీటెక్, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్‌లలో డిగ్రీ ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గేట్ 2023/ 2024/ 2025 స్కోరు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 30
వెబ్‌సైట్: https://npcilcareers.co.in/

డీఆర్‌డీవో జీటీఆర్‌ఈలో 150 అప్రెంటిస్

బెంగళూరులోని డీఆర్‌డీవో గ్యాస్ టర్బైన్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. 2025 మే 8వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.
గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీలు: 105
డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీలు: 20
ఐటీఐ అప్రెంటిస్ ట్రైనీలు: 25
విభాగాలు: మెకానికల్, ప్రొడక్షన్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్, ఏరోస్పేస్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, టెలికమ్, సీఎస్, ఐటీ, మెటలర్జీ, మెటీరియల్ సైన్స్, సివిల్‌లో ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణత ఉండాలి.
వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo/careers

'ఎయిర్ పోర్ట్ అథారిటీ' లో 309 ఖాళీలు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) పోస్టుల భర్తీకి భారతీయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. 2025 మే 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 309 పోస్టులు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మేథ్స్, ఫిజిక్స్) డిగ్రీ ఉండాలి. ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఏదో ఒక సెమిస్టర్‌లో మేథ్స్ ఫిజిక్స్ చదివి ఉండాలి. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఎంపిక ప్రక్రియ సమయానికి సర్టిఫికెట్ సమర్పించగలగాలి.
వయస్సు: 2025 మే 24 తేదీ నాటికి 27 సంవత్సరాల లోపుండాలి. ఓబీసీలకు మూడు సంవత్సరాలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రారంభ తేదీ: 2025 ఏప్రిల్ 25
చివరి తేదీ: 2025 మే 24
వెబ్‌సైట్: https://www.aai.aero/

నేటి మ్యాచ్ వేదిక లఖ్‌నవూ
లఖ్‌నవూ x చెన్నై రా.7.30 నుంచి

సిక్స్ కొడితే రూ.లక్ష

పీఎస్ఎల్ టీమ్ విరాళం

కరాచీ: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)కు చెందిన ముల్తాన్ సుల్తాన్స్ జట్టు పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించింది. ఇందులో భాగంగా తమ బ్యాటర్లు కొట్టే ప్రతీ సిక్సర్‌కు.. అలాగే తమ బౌలర్లు తీసే ప్రతీ వికెట్‌కు రూ.లక్ష (భారత కరెన్సీలో 30,683) చొప్పున పాలస్తీనా చారిటబుల్ సంస్థలకు విరాళంగా అందిస్తామని ముల్తాన్స్ యజమాని అలీ ఖాన్ తరాని ప్రకటించాడు. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతున్న విషయం తెలిసిందే.

ఐపీఎల్‌లో రోబో డాగ్



న్యూఢిల్లీ: ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసారంలో సరికొత్త అనుభూతిని అందించేందుకు బీసీసీఐ కృత్రిమ మేథను అందిపుచ్చుకొంది. ఈ మేరకు రోబో డాగ్‌ను ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. బ్రాడ్‌కాస్టింగ్ టీమ్‌లో చేరిన రోబో డాగ్‌ను ప్రముఖ కామెంటేటర్ డానీ మారిసన్ పరిచయం చేశాడు. ముంబై, ఢిల్లీ జట్లు సాధన చేస్తున్న సమయంలో ఆటగాళ్లను కొత్త అతిథి పలకరించింది. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాకు షేక్ హ్యాండ్ ఇచ్చింది. మారిసన్ వాయిస్ కమాండ్‌లకు తగ్గట్టుగా ఫీట్లు చేసి అలరించింది.

లూకాస్ మార్టెన్స్ ప్రపంచ రికార్డు



స్టాక్‌హోమ్: ఒలింపిక్ చాంపియన్ స్విమ్మర్ లూకాస్ మార్టెన్స్ (జర్మనీ) పురుషుల 400 మీ. ఫ్రీస్టయిల్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. స్విస్ ఓపెన్‌లో భాగంగా శనివారం జరిగిన ఈ విభాగంలో 3:39.96 సెకన్ల టైమింగ్‌తో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో 2009లో సహచర జర్మన్ స్విమ్మర్ పాల్ బీడర్‌మన్ నెలకొల్పిన రికార్డును 0.11 సెకన్ల తేడాతో అధిగమించాడు. 23 ఏళ్ల మార్టెన్స్ పారిస్ ఒలింపిక్స్‌లోనూ 400మీ. ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం అందుకున్నాడు.

ధీరజ్ టీమ్‌కు రజతం



ఫైనల్లో చైనా చేతిలో ఓటమి

న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని భారత పురుషుల రికర్వ్ జట్టు రజతంతో సరిపెట్టుకొంది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ఆదివారం జరిగిన ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కూడిన భారత్ 1-5 పాయింట్ల తేడాతో చైనా టీమ్ చేతిలో పరాజయం పాలైంది. తొలి సెట్ 54-54 పాయింట్లతో సమమైంది. అయితే, రెండో సెట్‌ను 58-55తో చైనా నెగ్గడంతో.. మ్యాచ్‌లో నిలవాలంటే మూడో సెట్‌లో భారత్ తప్పనిసరిగా నెగ్గాల్సిన పరిస్థితి. కానీ, భారత్ 54-55తో ఓడడంతో చైనాకు స్వర్ణం ఖాయమైంది. కాంస్య పతకాన్ని కూడా చైనానే సొంతం చేసుకొంది.

ఢిల్లీ రనౌట్

- సీజన్‌లో తొలి ఓటమి
- 12 రన్స్ తేడాతో ముంబై విజయం
- కరుణ్ నాయర్ పోరాటం వృథా



కర్ణ్ శర్మ (3/36)

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఆఖర్లో అనూహ్య తడబాటుతో గెలుపు ముంగిట బోల్తా పడింది. మూడేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడిన కరుణ్ నాయర్ (40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సర్లతో 89) అద్భుత ఆటతీరుతో జట్టును విజయం ఖాయమనే స్థితికి చేర్చాడు. అయితే 19వ ఓవర్‌లో అశుతోష్ (17) సహా ముగ్గురు రనౌట్‌గా వెనుదిరగడంతో డీసీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మరో ఓవర్ ఉండగానే ముంబై 12 పరుగుల తేడాతో రెండో విజయాన్నందుకుంది. అటు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఢిల్లీకిదే తొలి ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. తిలక్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 59), రికెల్టన్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), సూర్యకుమార్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), నమన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పోరెల్ (33) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు కర్ణ్‌కు మూడు, శాంట్నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కర్ణ్ శర్మ నిలిచాడు.

కరుణ్ పోరాడినా..: భారీ ఛేదనలో ఢిల్లీ మొదటి బంతికే ఓపెనర్ మెక్‌గుర్క్ (0) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో వికెట్ కోసం పది ఓవర్ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఇందుకు ఇంపాక్ట్ ప్లేయర్ కరుణ్ నాయర్ ఆటతీరే కారణం. నాయర్-పోరెల్ కలిసి రెండో వికెట్‌కు ఢిల్లీ 119 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. దేశవాళీల్లో అదరగొట్టిన కరుణ్ ఇక్కడా అదే ఫామ్‌ను కనబర్చాడు. ఈ జోడీ ప్రమాదకరంగా మారిన వేళ 11వ ఓవర్‌లో పోరెల్‌ను స్పిన్నర్ కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి ఢిల్లీ ఒక్కసారిగా తడబడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్‌ను శాంట్నర్ బౌల్డ్ చేయగా.. కర్ణ్ వరుస ఓవర్లలో స్టబ్స్ (1), రాహుల్ (15)లను అవుట్ చేసి షాకిచ్చాడు. ఇక అక్షర్ (9), విప్రజ్ (14) వైఫల్యంతో చివర్లో అశుతోష్ జోరు పెంచాడు. 12 బంతుల్లో 23 రన్స్ కావాల్సిన వేళ 19వ ఓవర్‌లో అతడు రెండు ఫోర్లు బాది ఉత్కంఠ పెంచాడు. కానీ రెండో పరుగు కోసం వెళ్లిన అశుతోష్‌తో పాటు వరుస బంతుల్లో కుల్దీప్ (1), మోహిత్ (0) కూడా రనౌట్ కావడంతో ముంబై విజయ సంబరాలు చేసుకుంది.



తిలక్ (59)

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్ రికెల్టన్, సూర్యకుమార్‌తో పాటు మిడిలార్డర్‌లో తిలక్ వర్మ జట్టుకు అండగా నిలిచారు. అతడికి డెత్ ఓవర్లలో నమన్ ధిర్ అద్భుత సహకారం అందించాడు. ఐదో ఓవర్‌లో విప్రజ్ ఎల్బీతో వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే కుల్దీప్ గూగ్లీకి రికెల్టన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సూర్య-తిలక్ జోడీ డీసీ బౌలర్లను ఆడేసుకుంది. 13వ ఓవర్‌లో సూర్య 6,4 తిలక్ 4తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో తిలక్ స్లాగ్ స్వీప్ షాట్‌ను ప్రయత్నించగా..బౌండరీ లైన్‌కు అత్యంత సమీపంలో పోరెల్ సూపర్ క్యాచ్ తీసుకోవడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఈ ఓవర్‌లో నమన్ రెండు ఫోర్లతో 11 రన్స్ రాగా 200 దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
గుజరాత్	6	4	2	0	8	1.081
ఢిల్లీ	5	4	1	0	8	1.006
బెంగళూరు	6	4	2	0	8	0.672
లఖ్‌నవూ	6	4	2	0	8	0.162
కోల్‌కతా	6	3	3	0	6	0.803
పంజాబ్	5	3	2	0	6	0.065
ముంబై	6	2	4	0	4	0.027
రాజస్థాన్	6	2	4	0	4	-0.838
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	6	1	5	0	2	-1.554

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (ఎల్బీ) విప్రజ్ 18; రికెల్టన్ (బి) కుల్దీప్ 41; సూర్యకుమార్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 40; తిలక్ (సి) పోరెల్ (బి) ముకేశ్ 59; హార్దిక్ (సి) స్టబ్స్ (బి) విప్రజ్ 2; నమన్ (నాటౌట్) 38; జాక్స్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం:** 1-47, 2-75, 3-135, 4-138, 5-200; **బౌలింగ్:** స్టార్క్ 3-0-43-0; ముకేశ్ 4-0-38-1; విప్రజ్ 4-0-41-2; కుల్దీప్ 4-0-23-2; అక్షర్ 2-0-19-0; మోహిత్ 3-0-40-0.

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జాక్స్ (బి) చాహర్ 0; పోరెల్ (సి) నమన్ (బి) కర్ణ్ 33; కరుణ్ (బి) శాంట్నర్ 89; రాహుల్ (సి అండ్ బి) కర్ణ్ 15; అక్షర్ (సి) సూర్య (బి) బుమ్రా 9; స్టబ్స్ (సి) నమన్ (బి) కర్ణ్ 1; అశుతోష్ (రనౌట్) 17; విప్రజ్ (స్టంప్) రికెల్టన్ (బి) శాంట్నర్ 14; స్టార్క్ (నాటౌట్) 1; కుల్దీప్ (రనౌట్) 1; మోహిత్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19 ఓవర్లలో 193 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-119, 3-135, 4-144, 5-145, 6-160, 7-180, 8-192, 9-193, 10-193. **బౌలింగ్:** చాహర్ 3-0-24-1; బౌల్ట్ 2-0-21-0; బుమ్రా 4-0-44-1; శాంట్నర్ 4-0-43-2; హార్దిక్ 2-0-21-0; కర్ణ్ 4-0-36-3.

ఏకపక్షం!



సాల్ట్ (65) కోహ్లీ (62 నాటౌట్)

- బెంగళూరు ఘన విజయం
- 9 వికెట్లతో రాజస్థాన్ చిత్తు
- జైస్వాల్ అర్ధ శతకం

జైపూర్: ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 65), కోహ్లీ (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (75), ధ్రువ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) రాణించారు. క్రునాల్, భువనేశ్వర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 17.3 ఓవర్లలో 175/1 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (40 నాటౌట్) దూకుడుగా ఆడాడు. **సాల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'** దక్కింది.

ఆరంభం నుంచే బాదుడు..: రాజస్థాన్ బ్యాటర్లు తడబడిన పిచ్‌పై ఓపెనర్ సాల్ట్ భారీ షాట్లతో విరుచుకుపడడంతో మ్యాచ్ ఏకపక్షమైంది. మరో ఓపెనర్ కోహ్లీతో కలసి సాల్ట్ తొలి వికెట్‌కు 52 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. బెంగళూరు అలవోకగా గెలిచింది. బౌండ్రీతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను కార్తికేయ అవుట్ చేశాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్‌తో కలసి కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 83 పరుగులు జోడించడంతో.. బెంగళూరు మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపుగీత దాటింది. ఈ క్రమంలో హసరంగ బౌలింగ్‌లో సిక్స్ బాదిన కోహ్లీ.. టీ20ల్లో తన వందో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు.

శాంసన్ విఫలం..: ఓపెనర్ జైస్వాల్ అర్ధ శతకంతో ఆకట్టుకోగా.. జురెల్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో రాజస్థాన్ గౌరవప్రద స్కోరు చేసింది. ఆరు ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 45/0తో నిలిచింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో క్రునాల్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన పరాగ్.. జైస్వాల్‌కు చక్కని సహకారం అందించాడు. ఈ క్రమంలో 13వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పరాగ్‌ను యశ్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ఇక, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ క్యాచ్‌వదిలేయడంతో బతికిపోయిన జురెల్..తర్వాత ధాటిగా ఆడడంతో స్కోరు 170 మార్క్ దాటింది.

కోహ్లీకి లైఫ్..: 7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సందీప్ బౌలింగ్‌లో కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పరాగ్ నేలపాలు చేశాడు. లాంగ్ ఆన్ నుంచి వచ్చిన పరాగ్.. నిర్లక్ష్యంగా క్యాచ్‌ను అందుకోవడంతో అది చేజారింది.

క్యాచ్ చేజార్చిన విరాట్..: ఫీల్డింగ్‌లో కోహ్లీ ఎంతో చురుగ్గా ఉంటాడనేది తెలిసిందే. అలాంటి విరాట్ చేతిలో పడ్డ బంతి కిందపడిపోవడంతో.. ఫ్యాన్స్ మండిపడుతున్నారు. 17వ ఓవర్‌లో జురెల్ కొట్టిన బంతిని బౌండ్రీ వద్ద నుంచి ముందుకు వచ్చిన కోహ్లీ పట్టినట్టేపట్టి వదిలేశాడు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 75, శాంసన్ (స్టంప్డ్) జితేష్ (బి) క్రునాల్ 15, పరాగ్ (సి) కోహ్లీ (బి) యశ్ 30, జురెల్ (నాటౌట్) 35, హెట్‌మయర్ (సి) పడిక్కల్ (బి) భువీ 9, రాణా (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 173/4; వికెట్ల పతనం:** 1-49, 2-105, 3-126, 4-169; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-32-1, యశ్ దయాళ్ 4-0-36-1, హాజెల్‌వుడ్ 3-0-26-1, క్రునాల్ పాండ్యా 4-0-29-1, లివింగ్‌స్టోన్ 1-0-8-0, సుయాష్ శర్మ 4-0-39-0.

బెంగళూరు: సాల్ట్ (సి) జైస్వాల్ (బి) కార్తికేయ 65, కోహ్లీ (నాటౌట్) 62, పడిక్కల్ (నాటౌట్) 40; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 17.3 ఓవర్లలో 175/1; వికెట్ల పతనం:** 1-92; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-36-0, తుషార్ దేశ్‌పాండే 2-0-21-0, సందీప్ 2.3-0-29-0, తీక్షణ 2-0-21-0, కుమార్ కార్తికేయ 3-0-25-1, హసరంగ 3-0-33-0, పరాగ్ 1-0-10-0.

బిజినెస్

భారత్ కోసం ఎలక్ట్రిక్ కారు

తయారీపై నిస్సాన్ కసరత్తు.. 2027 నాటికి మార్కెట్లోకి



న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ భారత మార్కెట్ కోసం అందుబాటు ధరల్లో విద్యుత్ కారు (ఈవీ) తయారీపై కసరత్తు చేస్తోంది. ఈ కారును 2026-27 ఆర్థిక సంవత్సరం చివరి కల్లా మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోంది. అలాగే ఏడు సీట్ల మల్టీ పర్పస్ వెహికల్ (ఎంపీవీ)ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో మార్కెట్లోకి తీసుకురావటంతో ఐదు సీట్ల ఎస్‌యూవీని వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స వెల్లడించారు. భారత్‌లో వ్యాపార విస్తరణపై ప్రణాళికలు ప్రకటించిన నిస్సాన్.. కొత్త వాహనాలు మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు గతంలోనే ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీ రెండు కాంపాక్ట్ ఎస్‌యూవీలు సరికొత్త మాగ్నైట్, ఎక్స్-ట్రయల్ విక్రయిస్తోంది. కాగా కొత్తగా విడుదల చేసే కార్లు రెండూ పూర్తిగా జపాన్ డీఎన్ఏ కలిగి ఉండడంతో పాటు బలమైన నిస్సాన్ టెక్నాలజీలు కలిగి ఉంటాయని సౌరభ్ పేర్కొన్నారు. భారత మార్కెట్లో ప్రవేశపెట్టాలనుకుంటున్న ఏడు సీట్ల కాంపాక్ట్ ఎస్‌యూవీ విడుదల తేదీని తదుపరి ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఈ ఏడాది దేశీయ అమ్మకాలు మూడు రెట్లు పెంచడంతో పాటు లక్ష ఎగుమతుల లక్ష్యం పెట్టుకున్నట్టు నిస్సాన్ ఇప్పటికే ప్రకటించింది.

అరబిందో 'రివారోక్సాబాన్'కు ఎఫ్‌డీఏ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా మరో ఔషధాన్ని అమెరికాలో మార్కెట్ చేయబోతోంది. కంపెనీ అభివృద్ధి చేసిన 'రివారోక్సాబాన్' టాబ్లెట్లకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. దీంతో కంపెనీ ఈ ట్యాబ్లెట్లను తయారు చేసి, అమెరికాలో మార్కెట్ చేసేందుకు అవకాశం ఏర్పడింది. గుండెపోటు నివారణ, రక్తనాళాల్లో రక్తసరఫరా మెరుగుపరిచేందుకు ఈ ఔషధం ఉపయోగపడుతుంది. ప్రస్తుతం జాన్సెన్ ఫార్మా ఇంక్ ఈ ఔషధాన్ని 'క్సారెల్టో' అనే బ్రాండ్ పేరుతో అమెరికాలో 2.5 ఎంజీ సామర్థ్యాలతో విక్రయిస్తోంది. ఇప్పుడు అరబిందో ఫార్మా ఇవే టాబ్లెట్లను జెనరిక్ వెర్షన్‌లో 'రివారోక్సాబాన్' పేరుతో మార్కెట్ చేయబోతోంది. ఈ ఏడాది జూన్‌లోగా తమ టాబ్లెట్లను అమెరికా మార్కెట్లోకి విడుదల చేస్తామని వెల్లడించింది. 2025 ఫిబ్రవరితో ముగిసిన 12 నెలల కాలానికి గాను అమెరికాలో ఈ ఔషధ విక్రయాలు 850 కోట్ల డాలర్లు (సుమారు రూ.73,610 కోట్లు)గా ఉన్నాయి.

నేడు మార్కెట్లకు సెలవు

సోమవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

సుంకాల అనిశ్చితి కొద్ది కాలమే

కొద్ది నెలల్లో అన్నీ సర్దుకుంటాయి

టీసీఎస్ సీఈఓ కృతివాసన్



ముంబై: అమెరికా తాజా సుంకాల ప్రభావం భారత ఐటీ రంగంపై పెద్దగా ఉండదని దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భావిస్తోంది. ఈ సుంకాలతో నెలకొన్న అనిశ్చితి ప్రభావం తాత్కాలికమని టీసీఎస్ సీఈఓ,ఎండీ కృతివాసన్ చెప్పారు. వచ్చే కొద్ది నెలల్లోనే ఈ అనిశ్చితికి తెర పడుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ సుంకాల నేపథ్యంలో క్లయింట్లు ధరలు తగ్గించమని ఒత్తిడి చేస్తున్నట్టు వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. తమకైతే ఇప్పటి వరకు ఆ పరిస్థితి ఎదురు కాలేదన్నారు. నిజానికి తాము కొన్ని ప్రాజెక్టుల ధర స్వల్పంగా పెంచినట్టు కృతివాసన్ వెల్లడించారు.

జీడీపీ వృద్ధికి దెబ్బే మూడీస్

అమెరికా సుంకాలతో చైనా, భారత్‌తో సహా అనేక ప్రధాన ఆసియా దేశాల జీడీపీ వృద్ధి రేటు దెబ్బతినే ప్రమాదం ఉందని మూడీస్ రేటింగ్ హెచ్చరించింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ముదిరినా ఆ ప్రభావం ఆసియా దేశాలపై తప్పదని కూడా స్పష్టం చేసింది.

బీటీఏతో మేలే

ట్రంప్ సుంకాలతో భారత కార్ల పరిశ్రమకు పెద్దగా వాటిల్లే నష్టమేమీ లేదని మెర్సిడెస్ బెంజ్ ఇండియా సీఈఓ, ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. మన దేశం నుంచి అమెరికాకు కార్ల ఎగుమతులు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. అయితే రూపాయి మారకం రేటు తగ్గటంతో దేశంలో లగ్జరీ కార్ల ధర మరింత పెరిగి ఆ ప్రభావం అమ్మకాలపై పడే ప్రమాదం ఉందన్నారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) దీర్ఘకాలంలో భారత్‌కు మేలు చేస్తుందన్నారు.

చైనా కంటే మన ఐఫోన్లే చౌక

ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు పక్కన పెడుతూ ట్రంప్ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయం కూడా మన దేశానికి మేలు చేయనుంది. దీంతో మన దేశం ఐఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వినియోగ పరికరాలను చైనా కంటే 20 శాతం తక్కువ ధరకే అమెరికాకు ఎగుమతి చేయగలుగుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. చైనాపై ఇంకా 20 శాతం దిగుమతి సుంకాలు కొనసాగడం, మన దేశ ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు లేకపోవడం ఇందుకు కారణం. అమెరికా ఏటా 2,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.16 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు దిగుమతి చేసుకుంటోంది. ఇది భారత్‌కు కలిసి వస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.31,575 కోట్లు

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెలలో ఇప్పటి వరకు భారత మార్కెట్ నుంచి రూ.31,575 కోట్లు ఉపసంహరించారు. అంతకు ముందు మార్చి 21 నుంచి 28 తేదీల మధ్య కాలంలో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.30,927 కోట్లు ఇన్వెస్ట్ చేయడంతో మార్చి నెలలో తరలించిన నికర నిధుల విలువ రూ.3,973 కోట్లకు తగ్గింది. ఫిబ్రవరిలో రూ.34,574 కోట్లు, జనవరిలో రూ.78,027 కోట్ల మొత్తాలను ఎఫ్‌పీఐలు తరలించుకుపోయారు. దీంతో ఏడాది మొత్తం మీద ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న నిధుల పరిమాణం రూ.1.48 లక్షల కోట్లకు చేరింది.

- ఫార్మా సంస్థ రెమెడియం లైఫ్‌కేర్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49.19 కోట్లు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ ఇష్యూకు రికార్డు తేదీగా ఏప్రిల్ 15ను ఖరారు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.1 ముఖ విలువతో కూడిన 49.19 కోట్ల షేర్లను జారీ చేయనుంది.
- ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి పియాజియో ఇండియా.. స్పెషల్ ఎడిషన్ వెస్పా క్యూలా, వెస్పా టెక్, వెస్పా ఎస్ టెక్ స్కూటర్లను విడుదల చేసింది. 125 సీసీ, 150 సీసీ ఇంజన్‌తో వీటిని తీసుకువచ్చింది. వీటి ధరలు రూ.1,33,681 నుంచి ప్రారంభం కానున్నాయి.
- టయోటా కిర్లోస్కర్ మార్కెట్లోకి సరికొత్త అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ను తీసుకువచ్చింది. అన్ని వేరియంట్లలో ఆరు ఎయిర్ బ్యాగులను పొందుపరచటంతో పాటు 5 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో కొత్త హైరైడర్‌ను తీసుకువచ్చింది.

23,200 పైన బుల్లిష్

(ఏప్రిల్ 15-17 తేదీల మధ్య వారా



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అప్‌ట్రెండ్

గత వారం నిఫ్టీ : 22,829 (-76)

నిఫ్టీ గత వారం 21,744-22,924 పాయింట్ల మధ్యన కదలాడి 76 పాయింట్ల నష్టంతో 22,829 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,594, 22,763, 23,138, 22,806 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,200 బ్రేక్‌డౌన్ స్థాయి: 22,425
నిరోధ స్థాయిలు: 23,025, 23,125, 23,225 (22,925 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,625, 22,525, 22,425 (22,725 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	127
కరీంనగర్	120	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	93
కర్నూలు	120	నెల్లూరు	98
విశాఖపట్నం	124	అనంతపురం	98
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	420
వరంగల్	397	గోదావరి	400
చిత్తూరు	460	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 60	

'ఫారెక్స్'లో పెరిగిన పసిడి వాటా

- తగ్గిన అమెరికా ప్రభుత్వ బాండ్స్
- పెట్టుబడుల వ్యూహాలు మార్చిన ఆర్‌బీఐ



ముంబై: విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వల పెట్టుబడుల వ్యూహాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మార్చింది. అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో (బాండ్స్) పెట్టుబడులు తగ్గించి పసిడిలో పెట్టుబడులు పెంచుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి ఉన్న 63,060 కోట్ల డాలర్ల (సుమారు రూ.54.61 లక్షల కోట్లు) ఫారెక్స్‌లో 22,570 కోట్ల డాలర్లను (సుమారు రూ.19.54 లక్షల కోట్లు) అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో మదుపు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 1,040 కోట్ల డాలర్లు తక్కువ. అమెరికా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ తాజా వివరాలు విడుదల చేసింది.

8 నుంచి 11 శాతానికి పసిడి వాటా: ఇదే సమయంలో మొత్తం ఫారెక్స్ నిల్వల్లో పసిడి వాటా 8 శాతం నుంచి 11 శాతానికి చేరింది. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద 879 టన్నుల పసిడి నిల్వలు ఉన్నాయి. గడిచిన 14 నెలల్లో 12 నెలలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి నెలా సగటున 6.3 టన్నుల చొప్పున బంగారం కొనుగోలు చేసింది.

కారణాలు ఏంటి?

ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వల్లో అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల వాటా తగ్గడానికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. మారకం రేటులో మార్పులు లేదా అమ్మకం లేదా కాలం తీరిపోవడం కారణమై ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ చెప్పారు. ఏదేమైనా ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వలను ఒకటి రెండు పెట్టుబడులకే పరిమితం కాకుండా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పసిడి, యూరో, పౌండ్ వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడుల్లోకి వివిధీకరిస్తోందన్నారు. ఇటీవల ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు గణనీయంగా తగ్గటం ఇందుకు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

నిరోధ స్థాయి 23,000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కనిష్ఠ స్థాయిల నుంచి బలమైన రికవరీ సాధించి వారం గరిష్ఠ స్థాయి 22,800 సమీపంలో ఆ స్థాయి కన్నా పైన క్లోజయింది. ఈ రికవరీతో తక్షణ ముప్పును కూడా తప్పించుకుంది. కాని ఈ బలమైన రికవరీ ప్రభావం వల్ల వచ్చే వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. అంతే కాదు, గత వారంలో మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు, భారీ ఎగుడుదిగుడులక గురయినందు వల్ల ఈ వారంలో నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇప్పుడు పాజిటివ్ ట్రెండ్‌కు ఆస్కారం ఉన్నప్పటికీ కీలక స్థాయి 23,000 వద్ద కొంత నిరోధం ఎదురుకావచ్చు. ఈ వారంలో మూడే ట్రేడింగ్ దినాలున్నందు వల్ల కన్సాలిడేషన్‌కు కూడా ఆస్కారం ఉంది. 23,000 వద్ద నిఫ్టీ పరీక్షకు గురి కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే 23,000 వద్ద స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. 1,250 పాయింట్ల ర్యాలీ అనంతరం స్వల్పకాలిక లక్ష్యాన్ని కూడా చేరింది. మరింత స్వల్పకాలిక సానుకూలత కోసం ఈ నిరోధం కన్నా పైన పటిష్ఠంగా క్లోజ్ కావాలి.

బేరిష్ స్థాయిలు: 23,000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. మైనర్ మద్దతు స్థాయి 22,700 వద్ద విఫలమైతే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22,500. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా మంచి ర్యాలీ సాధించినా 500 పాయింట్ల నష్టంతో 51,000 సమీపంలో క్లోజయింది. ఇక్కడ పరీక్ష ఎదుర్కొనవచ్చు. నిరోధ స్థాయిలు 51,600, 52,000. మైనర్ మద్దతు స్థాయి 50,600 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంటుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 23,000 సమీపంలో 25, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేకౌట్ సాధిస్తే మరింత స్వల్పకాలిక సానుకూల సంకేతం ఇస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గత వారంలో బాటమ్ ఏర్పడింది. సాధారణ పరిస్థితుల్లో తక్షణ డౌన్ ట్రెండ్ ముప్పు ఉండకపోవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,930, 23,000
మద్దతు	22,780, 22,700



దేశం అభివృద్ధి చెందడమంటే.. అద్దాల మేడలు, రంగుల గోడలు నిర్మించడం
కాదు.. పౌరుని నైతిక అభివృద్ధే నిజమైన దేశ అభివృద్ధి - అంబేడ్కర్





పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్

మీ కోసం నిలబడతా.. పోరాడతా

- మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా
- 11 నెలల్లోనే ఇళ్ల పట్టాల హామీని నిలుపుకొన్నా: మంత్రి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'మంగళగిరి ప్రజలు ఇచ్చిన మెజార్టీ నాపై బాధ్యతను మరింత పెంచింది. ఎమ్మెల్యేగా మీకోసం నిలబడతా.. పోరాడతా. మీ అందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా'నని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా ఐదో రోజైన ఆదివారం మంగళగిరి వాసులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. తొలివిడతగా మొత్తం 3,005 మందికి నూతన వస్త్రాలతో పట్టాల పంపిణీ ముగిసింది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదించినప్పుడు.. 175 నియోజకవర్గాల్లోనూ వంద పడకల ఆస్పత్రులను నిర్మించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మంగళగిరి అభివృద్ధికి సంబంధించి కేబినెట్‌కు వెళ్తే ఎలాంటి చర్చా లేకుండా ఆమోదం లభిస్తోందని, మంగళగిరి కోసం తీసుకువస్తున్న జీవోలు రాష్ట్రమంతటా ఉపయోపడుతున్నాయని చెప్పారు. ఇళ్ల పట్టాల హామీని 11నెలల్లోనే అమలు చేసి మాట నిలబెట్టుకున్నానని, తొలి విడతలో సుమారు 3వేల మందికి నూతన వస్త్రాలు పెట్టి మరీ ఇళ్ల పట్టాలు అందించామని చెప్పారు. 2019లో ఓడినప్పటికీ మంగళగిరి ప్రజల కోసం ఐదేళ్లు కష్టపడి అహర్నిశలూ సేవలందించానని, ఎన్టీఆర్ సంజీవని, ఉచిత మంచినీటి ట్యాంకర్లు, కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, తోపుడుబండ్లు, ప్రీమియర్ లీగ్ పోటీలు, పెళ్లి కానుకలు, కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు, అమెరికా వైద్యుల కన్సల్టేషన్ వంటి 26 సంక్షేమ కార్యక్రమాలను సొంతనిధులతో అమలు చేశానని లోకేశ్ గుర్తు చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారం, ప్రోత్సాహంతోనే త్వరితగతిన ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏ రంగంలోనైనా మంగళగిరి నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా నిలపాలన్నదే తన లక్ష్యమని, అందుకు ప్రజల సహకారం అవసరమని లోకేశ్ పేర్కొన్నారు.

దార్శనికుడు మోదీ : డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దార్శనికుడని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు. 'దుర్బల గిరిజనల జీవితాలను ఉద్ధరించడానికి మీ దార్శనిక నిబద్ధతకు అడవి తల్లి బాట ప్రతిబింబం. గిరిజనుల అవసరాలను తీర్చడానికి మీరు తీసుకున్న చర్యల్లో ఇది ఒకటి. వారి జీవితాలను మార్చడానికి మీరు చేసే విస్తృత ప్రయత్నాల్లో ఇది కీలకమైన భాగం. పీఎంజీఎస్‌వై, ఎన్ఆర్‌జీఎస్‌ల మద్ధతుతో రూ.1005 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 1069 కి.మీ రోడ్లను నిర్మిస్తున్నాం. 601 పీవీటీజీ ఆవాసాల్లో కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఈ పథకాలు గిరిజన ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తాయి. పర్యాటకానికి మద్ధతు ఇస్తుంది, సకాలంలో వైద్య సదుపాయాన్ని అందిస్తుంది. సమాజంలో ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక డోలీ కష్టాలకు ముగింపు పలుకుతుంది' అని 'ఎక్స్'లో ఆశాభావం వ్యక్తం చేశారు.



మతసామరస్యంపై జాతీయ సదస్సులో అభివాదం చేస్తున్న నేతలు ఇమ్రాన్ ప్రతాప్‌ఘడి, ప్రశాంత్ భూషణ్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, తులసిరెడ్డి, సీహెచ్ బాబూరావు తదితరులు

రాజ్యాంగాన్ని బలహీనపర్చేందుకు మతశక్తుల కుట్ర

- మైనారిటీలపై బీజేపీ కక్ష సాధింపు చర్యలు
- మతసామరస్యంపై జాతీయ సదస్సులో వక్తల ధ్వజం

విజయవాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తులు రాజ్యాంగాన్ని బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ మైనారిటీ విభాగం జాతీయ అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్‌ఘడి విమర్శించారు. దేశం రాజ్యాంగ పునాదులపై నిర్మితమైందని, సమైక్యత, శాంతిని కోరుకునే ప్రజలు వారి ఆటలను సాగనివ్వరన్నారు. సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మోనీ ఆధ్వర్యంలో సమైక్యతా శంఖారావం పేరుతో మతసామరస్యంపై జాతీయ సదస్సును విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత మహాత్మా గాంధీ, జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇమ్రాన్ ప్రతాప్‌ఘడి మాట్లాడుతూ దేశంలో విద్వేష వాతావరణం రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శక్తులు దేశ శాంతి, సమగ్రతలను విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. వక్ఫ్ చట్టం ద్వారా మైనారిటీల ఆస్తుల ఉనికి ప్రశ్నార్థకమైందని తెలిపారు. ముస్లింలు, మైనారిటీలు ఈ చట్టానికి వ్యతిరేకంగా చైతన్యవంతం కావాలన్నారు. సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి ఆయువుపట్టు అన్నారు. రాజ్యాంగం విలువలను, మౌలిక స్వభావాన్ని, స్వరూపాన్ని యథాతథంగా నిలుపుకోవాలని సూచించారు. దేశంలోని నియంతలకు హిట్లర్‌కు పట్టిన గతి పడుతుందని, ఆ రోజులు చాలా దగ్గరలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు కులం, మతం, ప్రాంతం మధ్య అడ్డుగోడలు నిర్మించుకుని అశాంతితో జీవిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి మొయిద్ అహ్మద్, కాంగ్రెస్ నేత కె.విజయరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి.. డబుల్!

రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాల భూసమీకరణ?.. 4 మండలాల్లో 11 గ్రామాల్లో చేపట్టేందుకు ప్రతిపాదన

- కొందరు రైతుల నుంచి అభిప్రాయ సేకరణతో వెలుగులోకి
- హరిశ్చంద్రాపురం, వడ్డమానులో పూర్తిగా
- పెదపరిమిలో పాక్షికంగా సమీకరణ
- వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తాడికొండ, కంతేరు, కాజల్లో కూడా
- సీఆర్‌డీఏ ముసాయిదాపై సర్వత్రా చర్చ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున సంస్థలు ఇటు వైపు చూస్తున్నాయి. అమరావతిలో తలపెట్టే ప్రాజెక్టుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. రాజధాని పనులను దశల వారీగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు 2014-19 నడుమ సంకల్పిస్తే.. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం మూడు ముక్కలాటతో విధ్వంసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈసారి అందుకు ఆస్కారం లేకుండా మూడేళ్లలో అమరావతి రాజధానికి నిర్దిష్ట రూపం తీసుకురావాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. 92 ప్రాజెక్టులకు గుర్తించి.. రూ.65 వేల కోట్ల అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇంకా కొన్ని కీలక ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచన కూడా చేస్తున్నారు. ఇందుకు దాదాపుగా 5 వేల నుంచి 7 వేల ఎకరాలు అవసరం. అమరావతి రైల్వేలైన్, అంతర్జాతీయ స్టేడియం, మెట్రో రైలు.. ఇలా చెప్పుకొంటూ పోతే చాలా ప్రాజెక్టులకు భూములు కావాలి. ఇవి కాకుండా నవ నగరాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యతా ఉంది. నవ నగరాలకు భూములు సిద్ధంగా ఉన్నప్పటికీ.. అమరావతికి వస్తున్న అనేక సంస్థలకు భూకేటాయింపులు చేయాల్సి వస్తోంది. ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం పెద్ద ఎత్తున భూములను తీసుకోవలసి ఉంది. పారిశ్రామిక సంస్థలు, ఆతిథ్య రంగ సంస్థలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు.. ఇలా ప్రతి ఒక్కటీ ముందుకు వచ్చి అమరావతిలో భాగస్వామ్యం కావాలనుకుంటున్నాయి. వీటికి కూడా భూములను కల్పించాల్సి వస్తోంది. అమరావతిని బెంగళూరు తరహాలో ఇండియా టాప్-10 రియాలిటీ సంస్థల భాగస్వామ్యంతో ప్రజల నివాసానికి సంబంధించిన రెసిడెన్షియల్, గ్రూప్ హౌస్‌లు, హైరైజ్ భవనాలు, కమర్షియల్ భవనాలు తదితరాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది. ఇటీవలే బెంగళూరులోని టాప్-5 రియాలిటీ సంస్థలతో సంప్రదింపులు జరిపింది. భూములు కేటాయిస్తే తప్ప ఇవి ముందుకు రావు. రియాలిటీ సంస్థలకు 60:40 వాటా ప్రాతిపదికన భూములిస్తే సీఆర్‌డీఏకు రాయల్టీ కూడా వస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. అమరావతి రాజమార్గాలుగా ఈ-13, ఈ-15 రోడ్లను జాతీయ రహదారి-16కు అనుసంధానిస్తున్నారు. గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) లకు అనుసంధానంగా అమరావతి రోడ్లను అనుసంధానించాలి. అంతర్గతంగా మౌలిక సదుపాయాల కల్పన పనులు కూడా పెరిగాయి. ఈ పనులన్నిటికీ భూములను సేకరించడం రానున్న రోజుల్లో కత్తిమీద సామే.



ఉభయతారకంగా..

అమరావతిలో రూ.కోట్లు పలుకుతున్న భూములను భూ సేకరణ ద్వారా తీసుకోవడం చాలా కష్టం. ఉభయతారకంగా ఉండాలంటే ల్యాండ్ పూలింగ్ అంటే.. భూ సమీకరణ ఒక్కటే సీఆర్‌డీఏకు మార్గంగా కనిపిస్తోంది. అమరావతిలో వరదనీటి కాలువల విస్తరణ పనుల వల్ల కూడా ప్రస్తుతం సమీకరించిన భూముల విస్తీర్ణం తగ్గుతోంది. కొండవీడువాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ వంటి వాటి పొడవు, వెడల్పులు అదనంగా మూడు రెట్లు పెరుగుతున్నాయి. ఇవి కాకుండా రిజర్వాయర్ల కోసం కొంత కోల్పోవలసి వస్తోంది. మరో కీలక విషయం ఏమిటంటే.. ప్రపంచ బ్యాంకు కూడా మరిన్ని భూములు సమీకరించాలని సూచించినట్లు సమాచారం. రాజధానికి రుణాలు సమకూరుస్తున్న ఈ సంస్థ కొన్ని ప్రయోజనకర ఫలితాలను ఆశిస్తోంది. ఇక్కడ చేపడుతున్న పనుల కారణంగా ఆర్థికంగా మెరుగుపడాల్సి ఉంటుంది. అమరావతి అభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలి. స్థానికంగా ఉద్యోగాల కల్పన దిశగా మరిన్ని ప్రాజెక్టులను అమరావతి నిర్మాణ పనులతోనే సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలి. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన మేరకు పలు నూతన ఆర్థిక ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. వీటన్నిటికీ అమరావతిలో ప్రస్తుతం సరిపడా భూమి అందుబాటులో లేదు. అలాగని భూసేకరణకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. జగన్ ఐదేళ్ల విధ్వంసంతో తలెత్తిన ఆర్థిక ఇక్కట్లతో ప్రభుత్వం సతమతమవుతోంది. ఈ కారణంగానే రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎక్కడెక్కడ భూములు సమీకరించాలో కొన్ని ప్రాంతాలను ప్రతిపాదిస్తూ సీఆర్‌డీఏ ఓ ముసాయిదాను రూపొందించినట్లు తెలిసింది.

57 వేల ఎకరాలు సమీకరించాలనుకున్నా

రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా చేస్తామని ప్రకటించిన తర్వాత భూ సమీకరణ విధానాన్ని ప్రకటించే ముందు 57 వేల ఎకరాలు సమీకరించాలని భావించారు. అప్పట్లో వైకుంఠపురం ప్రాంతానికి చెందిన రైతులు తమ భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. లంక భూములు, నదీ తీర ప్రాంత భూములను కూడా తీసుకోవాలన్న డిమాండ్ రైతుల నుంచి వచ్చినప్పటికీ 34 వేల ఎకరాలకే ఆనాడు ప్రభుత్వం పరిమితమైంది. తీసుకున్న వాటిలో వాస్తవంగా మరో 3 వేల ఎకరాలు పలు కారణాల వల్ల ఇంకా సీఆర్‌డీఏ చేతికి రాలేదు. ఈ దశలో అమరావతి పునర్నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ గ్యారెంటీతో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), కేంద్రప్రభుత్వ సంస్థ హడ్కో వంటి రుణ సంస్థలు రుణాలు సమకూర్చుతున్నాయి. ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి కూడా నిధులు తీసుకోవడానికి సీఆర్‌డీఏ సిద్ధమవుతూనే.. రాజధాని విస్తరణ ఆలోచన చేస్తుండడం గమనార్హం.

భూ సమీకరణ ప్రతిపాదిత ప్రాంతాలు..

తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి మండలాల పరిధిలోని మొత్తం 11 గ్రామాల్లో 18,080 హెక్టార్ల (సుమారు 44,670 ఎకరాలు) భూములను తీసుకోవాలనేది ఆలోచన. తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురంలో మొత్తం గ్రామంలోని 2,429.05 ఎకరాలు, వడ్డమానులోనూ పూర్తిగా 1,937.31 ఎకరాలు, పెదపరిమిలో పాక్షికంగా 6,513.69 ఎకరాలు సమీకరించాలని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. అమరావతి మండలం వైకుంఠపురంలో 3,360.63 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167.11 ఎకరాలు, కర్లపూడిలో 2,947.06 ఎకరాలు, మోతడక గ్రామంలో 2,345.03 ఎకరాలు, నిడుముక్కలలో 2,013.91 ఎకరాలు.. తాడికొండ మండలం తాడికొండలో 12,797.59 ఎకరాలు, కంతేరులో 3,671.98 ఎకరాలు, మంగళగిరి మండలం కాజ గ్రామంలో 4,492.37 ఎకరాలు పాక్షికంగా సమీకరించాలని సీఆర్‌డీఏ అనుకుంటోంది. దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అంగీకరించాయి. అయితే వీటికి అవసరమయ్యే భూముల కోసం భూ సమీకరణకు వెళ్లాలా.. భూసేకరణ జరపాలా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాయి. భోగాపురం విమానాశ్రయం మాదిరిగా అమరావతిలో కూడా భూ సేకరణ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపాయి.

శ్రీవారికి అన్నా లెజినోవా తలనీలాలు సమర్పణ

- డిక్లరేషన్‌పై డిప్యూటీ సీఎం పవన్ సతీమణి సంతకం
- మార్క్ శంకర్‌తో హైదరాబాద్ చేరుకున్న పవన్
- ప్రధాని మోదీకి పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు

తిరుమల/హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. ఇటీవల వీరి కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అన్నా లెజినోవా తిరుమల వచ్చారు. గాయత్రి అతిథిగృహానికి చేరుకున్న ఆమెకు టీటీడీ రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికారు. ఇతర మతానికి చెందిన వ్యక్తి కావడంతో నిబంధనల ప్రకారం హిందూ మతాన్ని గౌరవిస్తున్నానని, తనకు పూర్తి విశ్వాసాలు ఉన్నాయని పేర్కొంటూ డిక్లరేషన్‌పై ఆమె సంతకం చేశారు. అనంతరం క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా పద్మావతి కల్యాణకట్టకు వెళ్లి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరిగి అతిథిగృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. అన్నా లెజినోవా సోమవారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని, శ్రీవారిని దర్శించుకోనున్నారు. అన్నదానానికి విరాళం ఇవ్వనున్నారు. కాగా, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబసభ్యులతో కలసి శనివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఇటీవల సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆయన తనయుడు మార్క్ శంకర్ గాయపడి, అక్కడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకుంటున్నారు. పవన్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, కూతురు పొలెనా అంజనా పవనోవా, మార్క్ శంకర్‌తో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మార్క్ శంకర్ ఆరోగ్యం ఇప్పుడు నిలకడగా ఉందని పవన్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. ప్రమాదం నుంచి తన తనయుడు కోలుకోవాలని ఆకాంక్షించిన రాజకీయ నాయకులు, జనసేన సభ్యులు, అభిమానులు, కుటుంబసభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం చేస్తున్న అన్నా లెజినోవా



తలనీలాలు సమర్పించిన అన్నా లెజినోవా

మీ సహకారం ధైర్యానిచ్చింది..



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుమారుడిని తీసుకొస్తున్న పవన్

సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్‌కు జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంలో సత్వరమే స్పందించి, సహాయం అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సింగపూర్ అధికారులు అందించిన సహాయ సహకారాలు, క్లిష్ట సమయంలో ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పవన్ పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్లకు మహర్దశ

- 26.72 కి.మీల రోడ్లకు రూ.154.60 కోట్లు!
- 7 రోడ్లు మంజూరుకు మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతీయ అభివృద్ధి అథారిటీ పరిధిలో పలు మాస్టర్‌ప్లాన్ రోడ్లకు మహర్దశ పట్టింది. 26.72 కి.మీల రోడ్ల నిర్మాణాలకు రూ.154.60 కోట్లు మంజూరు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో మాస్టర్ ప్లాన్‌కు కనెక్ట్ అవుతున్న ముఖ్యమైన రోడ్ల పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల సమీక్షలో అధికారులను ఆదేశించారు. ఏడు రోడ్లను ఒకే ప్యాకేజీ కింద ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో చేపట్టాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం చిప్పాడ డివిజన్ రోడ్డు సర్వే నం.48 నుంచి విశాఖపట్నం చిప్పాడ డివిజన్ రోడ్డు సర్వే నెం.140 వరకు, పోలిపల్లి సర్వే నంబర్ 304 వరకు 24 మీటర్ల వెడల్పుతో 6.32 కి.మీ రోడ్డును రూ.37.92 కోట్ల అంచనాతో నిర్మించనున్నారు. అదే విధంగా నేరెళ్లవలస సర్వే 8 నుంచి కొత్తవలస దొరతోట మీదుగా తాళ్లవలస సర్వే నంబర్ 161 వరకు 4 కి.మీ రోడ్డును రూ.24 కోట్లతోను, బోయళ్లపాలెం జంక్షన్ వద్ద పరదేశీపాలెం సర్వే నంబర్ 11 నుంచి మంగమ్మారిపేట జంక్షన్ కాపులుప్పాడ సర్వే నంబర్ 302 వరకు 3.10 కి.మీ రోడ్డును రూ.7.46 కోట్లతోను, గంభీరం సర్వే నంబర్ 125 నుంచి ఎన్‌హెచ్-16 గంభీరం సర్వే నంబర్ 63 వరకు 2.20 కి.మీ రోడ్డును రూ.11.97 కోట్లతో, పరదేశీపాలెం ఏహెచ్-26 సర్వే నంబర్ 1 నుంచి గంభీరం సర్వే నంబర్ 125 వరకు 1.40 కి.మీ రోడ్డును రూ.5.60 కోట్లతో, జీవీఎంసీకు సంబంధించి శివశక్తి నగర్ 18మీటర్ల వెడల్పు రోడ్డు నుంచి హరిత ప్రాజెక్టు ఉడా 30మీటర్ల వెడల్పు రోడ్డు వరకు 1.70 కి.మీ రోడ్డును రూ.7.63 కోట్లతో, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించి బీఆర్‌టీఎస్ సొంట్యాం రోడ్డు జంక్షన్ వద్ద అడివివరం జంక్షన్ నుంచి గండిగుండం ఎన్‌హెచ్ జంక్షన్ వరకు 8 కి.మీ రోడ్డును రూ.60 కోట్లతోను మొత్తం 26.72 కి.మీ రోడ్లకు రూ.154.60 కోట్లు మంజూరుచేస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది.

హేతుబద్ధీకరణపై గందరగోళం!

- సాగు విస్తీర్ణం ఆధారంగా సమాన పని విధానం ఉండాలి
- సచివాలయ వ్యవసాయ సహాయకుల డిమాండ్
- ఆ దిశగా దృష్టిపెట్టని ఉన్నతాధికారులు!

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జనాభా ఆధారంగా గ్రామ సచివాలయాల్ని హేతుబద్ధీకరించడం వల్ల రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ అనుబంధ శాఖల సహాయకులు గందరగోళానికి గురవుతున్నారు. గత ప్రభుత్వం 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పట్టు సహాయకులుగా ఒక్కొక్కరిని నియమించింది. అయితే ఒక సచివాలయం పరిధిలో 100ఎకరాల సాగు భూమి ఉంటే.. ఇంకో సచివాలయ పరిధిలో 5వేల ఎకరాల దాకా ఉంది. దీని వల్ల ఒకరికి పని ఎక్కువగా ఉంటే.. మరొకరికి పని తక్కువగా ఉండేది. దీంతో కూటమి ప్రస్తుత ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మార్చుతోంది. ఫలితంగా ఒక క్లస్టర్‌లో వ్యవసాయ, ఉద్యాన సహాయకుల్లో ఒక్కరే ఉండనున్నారని సమాచారం. అయితే ఇప్పుడు మిగులు సహాయకులు ఎవరన్నది అధికారులు తేల్చలేని పరిస్థితి. ఎవరిని ఉంచుతారు? ఎవరిని తప్పిస్తారోనన్న ఆందోళన వ్యవసాయ అనుబంధ శాఖల సహాయకుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు రైతుసేవా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ అనుబంధ సహాయకుల బదిలీల ప్రక్రియను హేతుబద్ధీకరణ కోసం వాయిదా వేశారు. గత ఆరేళ్లుగా వీరికి బదిలీలు కూడా జరగలేదు. వ్యవసాయ అనుబంధ శాఖల సహాయకులను జనాభా ప్రతిపాదికన కాకుండా, సాగు భూమి విస్తీర్ణం ఆధారంగా హేతుబద్ధీకరించడంతో పాటు గ్రామ సహాయకులను ఆయా శాఖల్లో విలీనం చేయాలని వారు కోరుతున్నారు. దీని వల్ల ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా, రైతులకు రాయితీపై అందించే పథకాలు, ప్రకృతి వ్యవసాయ విధానం పెరుగుదల లక్ష్యాలు సాధించడానికి వీలు ఉంటుందని వ్యవసాయ సహాయకులు పేర్కొంటున్నారు. కానీ సాగు భూమి ప్రాతిపదికన వ్యవసాయ సహాయకుల హేతుబద్ధీకరణ చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్ట వచ్చన్న సూచనపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. దీంతో సచివాలయాల హేతుబద్ధీకరణలో వ్యవసాయ అనుబంధ సహాయకుల పరిస్థితి అయోమయంగానే ఉంది.

పెద్ద చదువులకు గిరాకీ!

- ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత
- 2024లో 3.06 లక్షల మంది పాస్ కాగా.. ఈ ఏడాది 3.51 లక్షల మంది
- పెరిగిన ఉత్తీర్ణులు 44,993 మంది
- ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులకు డిమాండ్
- ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగే అవకాశం



అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యకు డిమాండ్ పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం భారీగా పెరగడమే ఇందుకు కారణం. సెకండియర్ విద్యార్థులు 2024లో 3,06,528 మంది ఉత్తీర్ణులైతే, ఈ ఏడాది ఆ సంఖ్య 3,51,521కు పెరిగింది. అంటే గతేడాదితో పోలిస్తే 44,993 మంది అదనంగా ఇంటర్ పాస్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల తర్వాత ఉత్తీర్ణులు ఇంకా పెరుగుతారు. వీరిలో ఎక్కువ మంది ఉన్నత విద్యకు వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ట్రెండ్‌ను గమనిస్తే విద్యార్థులు ఇంజనీరింగ్‌కు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. మిగిలిన వారు సాధారణ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. ఇదే సమయంలో డిగ్రీలోనూ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు బీసీఏకు గత కొన్నేళ్లుగా డిమాండ్ భారీగా పెరిగింది. రాష్ట్రంలో గతేడాది 1.81 లక్షల ఇంజనీరింగ్ సీట్లకు ఏఐసీటీఈ అనుమతివ్వగా.. వాటిలో 1.2 లక్షల వరకు భర్తీ అవుతున్నాయి. ఇక డిగ్రీ కోర్సుల్లో 4.47 లక్షల సీట్లు ఉంటే లక్షన్నర మాత్రమే భర్తీ అవుతున్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ సీట్లు ఇంకా పెరిగే పరిస్థితి ఉంది. అయితే ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సు సీట్లు మాత్రమే ఎక్కువగా భర్తీ అవుతున్నాయి. మొత్తం సీట్లలో దాదాపు సగం సీఎస్ఈ సీట్లే ఉంటున్నాయి. సీఎస్ఈలో అనుబంధ గ్రూపులు పెరిగిపోవడంతో విద్యార్థులు తొలుత వాటినే కోరుకుంటున్నారు. ఆ తర్వాత ఈసీఈ కోర్సుకు డిమాండ్ ఉంది. మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల సీట్లు చాలా వరకు మిగిలిపోతున్నాయి. కాలేజీ యాజమాన్యాలు కూడా సీఎస్ఈ సీట్లు మాత్రమే పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ సీట్లు రానివారు డిగ్రీలో బీసీఏ కోర్సుకు వెళ్తున్నారు. ఈ ఏడాది ఇంటర్‌లో 45 వేల మంది ఉత్తీర్ణులు పెరగడంతో అందుకు అనుగుణంగా ఉన్నత విద్యలో అడ్మిషన్లు పెరగనున్నాయి.

డిగ్రీ కోర్సుల్లో పెరగనున్న అడ్మిషన్లు

మరోవైపు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ భారీగా ఉత్తీర్ణత శాతం పెరగడంతో డిగ్రీలో అడ్మిషన్లు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో చదివే విద్యార్థులే ఎక్కువగా సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ లాంటి గ్రూపులను ఎంచుకుంటారు. వారంతా డిగ్రీలో చేరే అవకాశం ఉంది. తాజా ఇంటర్ ఫలితాల్లో గ్రూపుల వారీగా ఉత్తీర్ణతను పరిశీలిస్తే.. సెకండియర్‌లో ఎంపీసీలో 4 శాతం, బైపీసీలో 7 శాతం ఉత్తీర్ణత పెరిగింది. సీఈసీలో 7 శాతం, హెచ్ఈసీలో 6 శాతం, ఎంఈసీలో 8 శాతం చొప్పున ఉత్తీర్ణత పెరిగింది. ఇంజనీరింగ్ వైపు వెళ్లే విద్యార్థుల్లో కొంత మంది ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటారు. అలాగే జాతీయ విద్యా సంస్థల్లోనూ సీట్లు పొందుతుంటారు. కానీ సాధారణ డిగ్రీ చేసే వారు రాష్ట్రంలోని కాలేజీల్లోనే చేరతారు. కాగా, గతేడాది నుంచి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ డిగ్రీ కోర్సులు ప్రారంభించడంతో డిగ్రీకి కూడా డిమాండ్ పెరుగుతోంది. కానీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీల్లో మాత్రం అడ్మిషన్లు పడిపోతున్నాయి.



గోశాలలో ఆవు దూడలతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

తిరుపతి 'తొక్కిసలాట' వెనుక కుట్రకోణం!

- గోవుల మృతిలో టీటీడీ సిబ్బంది నిర్లక్ష్యం లేదు
- భూమనపై చట్టపరమైన చర్యలు: టీటీడీ చైర్మన్

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు ముఖ్య కారకుడు గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి అని, దీని వెనుక కుట్ర కోణం ఉండొచ్చని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలను ఆయన ఆదివారం సందర్శించి, గోవులను పరిశీలించారు. అక్కడి అధికారులతో సమీక్షించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. గతంలో హిందూ వ్యతిరేక వ్యక్తి టీటీడీ చైర్మన్ కావడం మనందరి దురదృష్టమని అన్నారు. 'ఆయన హిందువు కాదు. కుమార్తెకు ఏ సంప్రదాయం ప్రకారం వివాహం చేశారో అందరికీ తెలుసు. అలాంటి వ్యక్తి ఈరోజు టీటీడీ గురించి విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా పోరాటం చేయాలి కానీ టీటీడీపై ఆరోపణలు చేయడమేంటి? టీటీడీ ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.1,600 కోట్లు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారు. గడువు ముగిసిన మందులు, పురుగులు పట్టిన దాణా ఇచ్చిన వ్యక్తి గోవుల గురించి మాట్లాడుతున్నారు. కొన్ని సహజంగా, మరికొన్ని అనారోగ్యంతో, వృద్ధాప్యంతో చనిపోవడం సాధారణం. ఇందులో టీటీడీ నిర్లక్ష్యం ఏమీ లేదు. ఇలాంటి వ్యక్తి భూమిపై పుట్టకూడదని స్వామివారిని కోరుకుంటున్నా. హిందూ మతంపై పడటం కాదు. వేరే మతస్తులపై పడితే తెలుస్తుంది. కరుణాకర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎక్కడో చనిపోయిన గోవులను ఇక్కడివే అన్నట్లు చూపిస్తున్నారు' అని విమర్శించారు.

తిరుమలను ధనార్జన క్షేత్రంగా మార్చేశారు

2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చిందని టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. భగవంతుడిపై నమ్మకం, విశ్వాసం లేని వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించారని మండిపడ్డారు. తిరుపతి రోడ్లు, టీటీడీ గోవిందరాజ సత్రాల కమీషన్లతో తన కుమారుడి ఎన్నికల ఖర్చు పెట్టుకున్న వ్యక్తి.. 3నెలల్లో వంద గోవులు చనిపోయాయని ఆరోపించడం ఏమిటని ప్రశ్నించారు. తిరుమలకు, ఒంటిమిట్టలో కల్యాణానికి సతీసమేతంగా మీ నాయకుడిని తీసుకొచ్చే ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పురుగులు పట్టిన దాణాను ఆవులకు పెట్టకూడదని 2024 ఏప్రిల్ 1న విజిలెన్స్ నివేదికలో ఉంటే అప్పుడెలా పెట్టారంటూ వీడియోలు విడుదల చేశారు. అసత్య ప్రచారంలో ఎవరెవరు ఉన్నారో వారి కాల్ డేటా ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మహేశ్ యాదవ్ తదితరులు టీటీడీ చైర్మన్‌ను కోరారు.

జూన్ 1 నుంచి కాఠ్‌మాండూకు విమానం

విశాఖపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విశాఖ-బెంగళూరు-నేపాల్ లోని కాఠ్‌మాండూ మధ్య జూన్ 1 నుంచి ప్రత్యేక విమాన సర్వీస్‌ను నడపనున్నట్టు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఈ సర్వీస్ (ఐఎక్స్ 2744) విశాఖలో ప్రతిరోజూ రాత్రి 11.15 గంటలకు బయలుదేరి 12.55కు బెంగళూరు చేరుతుంది. అక్కడ ప్రయాణికులు కొన్ని గంటలపాటు నిరీక్షించాలి. బెంగళూరులో ఉదయం 5.05 గంటలకు బయలుదేరి 8.05 గంటలకు కాఠ్‌మాండూకు చేరుకునేలా ఎయిర్ ఇండియా షెడ్యూల్ విడుదల చేసింది.

రాళ్లేద్దాం..!

(మొదటి పేజీ తరువాయి)

విజయసాయి రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రచారం చేశారు. బాంబీపోటులో తవ్వకాలు చేసి సంపద దోచుకున్నారంటూ ఆరోపణలు చేశారు. ఇవన్నీ అసత్యాలని తర్వాత తేలింది. అయితే టీడీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గత ఎన్నికల్లో వైసీపీ లబ్ధిపొందింది. ఇప్పుడు అదే పంథాలో కుల, మత, ప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు వైసీపీ ముఠా అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. ఫేక్ పోస్టులు పెడుతున్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా విద్వేషాలు రెచ్చగొడుతున్నారు.

విధ్వంసక రచన

- పాస్టర్ ప్రవీణ్ మృతిని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో హిందువులపైకి క్రైస్తవులను రెచ్చగొట్టాలని వైసీపీ ప్రయత్నించింది. వైసీపీ నేత జాన్ బెన్నీ లింగం... హిందువులను ఊచకోత కోస్తానంటూ మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్‌ను హత్య చేశారంటూ జూపూడి ప్రభాకర్ కూడా రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఆయన మృతిని అడ్డు పెట్టుకుని లబ్ధిపొందాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టడంతో వైసీపీ పట్ల హిందువులలో వ్యతిరేకత రాకుండా జగన్ అర్జెంటుగా హిందూ ధర్మ పరిరక్షకుడిగా అవతారం ఎత్తారు. గత వారంలో ఒకే రోజున జగన్ హిందూ ధర్మ పరిరక్షకుడంటూ సోషల్ మీడియాలో 40కి పైగా పోస్టులు ప్రత్యక్షమయ్యాయి.
- వైసీపీ నేతలు ఓవైపు హిందువులపైకి క్రైస్తవులను రెచ్చగొడుతూనే.. మరోవైపు ప్రభుత్వం పట్ల హిందువులలో వ్యతిరేకత కలిగించేలా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే టీటీడీ గోశాలలో మూడు నెలల్లో వంద గోవులు మరణించాయని ఆ పార్టీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ కూడా అయిన భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు.
- కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో అనంతపురం జిల్లా హనకనహాళ్‌లో రాములోరి రథానికి టీడీపీ నేతలు నిప్పంటించారంటూ వైసీపీ సోషల్ మీడియా విపరీతంగా ప్రచారం చేసింది. గ్రామస్తులు గుర్తించడంతో వ్యవహారం సద్దుమణిగేలా టీడీపీ పెద్దల మంతనాలు చేశారంటూ అసత్యాలు వ్యాపింపజేసింది. చివరకు పోలీసుల విచారణలో వైసీపీ కార్యకర్త ఈశ్వర్ రెడ్డి ఈ పని చేశారని తేలింది. అతడ్ని అరెస్టు చేశారు.

టీటీడీ గోశాలలో 3 నెలల్లో 100 గోవులు చనిపోయాయంటూ తాజాగా వైసీపీ విష ప్రచారం చేసింది. జగన్ రోత పత్రిక దీన్ని రక్తి కట్టించింది. 3 నెలలుగా ఆవులు మరణిస్తుంటే జగన్ పత్రికలో ఎందుకు రాయలేదు? ఈ విషయాన్ని ఎందుకు కనిపెట్టలేకపోయింది? స్థానిక వైసీపీ నేతలు ఎందుకు మాట్లాడలేదు?

ఇప్పుడే విషయం తెలిసినట్టుగా వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో హడావుడి చేశారు. గోశాలలో 100 ఆవులు మరణించాయని చెబుతూ, సాక్ష్యంగా ఫొటోలు కూడా చూపించారు. అయితే, ఆయన చూపించిన పలు ఆవుల కళేబరాల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావు. ఎక్కడెక్కడివో ఫొటోలు చూపించి నమ్మబలికే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడంతోపాటు విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ కుట్ర చేసిందనే విమర్శలు వస్తున్నాయి.

ఆసాంతం కుట్రలు, అబద్ధాలే

ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా వైసీపీ కుట్రలు, అబద్ధాలనే నమ్ముకుంది. 2019 ఎన్నికల ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వంపై ఎన్నో అసత్యాలు ప్రచారం చేసింది. కుల, మత, ప్రాంతాలపరంగా చీలికలు తెచ్చేందుకు యత్నించింది. సీఎం అయ్యాక కూడా జగన్ తీరులో మార్పు రాలేదు. ఎన్నో అబద్ధాలు చెప్పారు. మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలని చూశారు. ముద్రగడ, హరిరామజోగయ్యను అడ్డం పెట్టుకుని కుల విద్వేషాలకు కుట్రలు చేశారు. వైసీపీ అసలు స్వరూపాన్ని తెలుసుకున్న ప్రజలు 2024 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్న జగన్ మళ్లీ ఫేక్ ప్రచారం మొదలుపెట్టారు. శాంతిభద్రతల నిప్పు రాజేసి రాష్ట్రాన్ని రావణకాష్టం చేయాలని చూస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది. ప్రజలకు వాస్తవాలను వివరించి అప్రమత్తం చేయాలి.

అంబేడ్కర్ సెంటిమెంట్‌తో ఆటలు

- ఇటీవల తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారని, ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికొదిలేసిందంటూ వైసీపీ సోషల్ మీడియా హోరెత్తించింది. కానీ పోలీసుల విచారణలో వైసీపీ నాయకుడే ఈ పని చేశారని తేలింది. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించి అరెస్టు కూడా చేశారు.
- ఏలూరు జిల్లా భీమడోలు మండలం పొలసానిపల్లిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు చెప్పుల దండ వేసిన ఘటన జరిగింది. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వానికి ముందే సమాచారం ఉంది.

ఎస్సీ వర్గీకరణపై గప్‌చుప్

రాజీవ్ రంజన్ మిశ్రా సారథ్యంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మార్చిలో రాష్ట్ర కేబినెట్ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. దానిపై ఇప్పటి వరకు నేరుగా స్పందించని వైసీపీ దొంగచాటుగా మతం పేరుతో, అంబేడ్కర్ సెంటిమెంట్‌తో ఎస్సీలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోంది.

వక్ఫ్ బిల్లుపై దొంగాట

వక్ఫ్ సవరణ బిల్లు సందర్భంగా వైసీపీ ద్వంద్వ వైఖరి పాటించింది. ఎన్డీయేకు బలమున్న లోక్‌సభలో ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు వైసీపీ ప్రకటించింది. కానీ ఎన్డీయేకు సంఖ్యాపరంగా తక్కువ మంది ఉన్న రాజ్యసభలో మాత్రం విప్ జారీ చేయకుండా దొంగాట ఆడింది. ఎన్డీయే కూటమి లేకున్నా వైసీపీ వక్ఫ్ బిల్లు విషయంలో లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో మరోలా వ్యవహరించింది.

సిసోడియా అవుట్!

- రెవెన్యూ నుంచి చేనేత-జౌళి శాఖకు బదిలీ
- సీసీఎల్ఏ జయలక్ష్మికి అదనంగా రెవెన్యూ బాధ్యతలు
- కాటమనేని భాస్కర్‌కు హెచ్ఆర్‌డీఐ అదనం
- నిరీక్షణలో ఉన్న ఐదుగురు ఐఏఎస్‌లకు పోస్టింగులు
- ఎస్ఐఆర్‌డీ కమిషనర్‌గా ముత్యాలరాజు
- రైతు బజార్ల సీఈవోగా మాధవీలత
- నీలకంఠారెడ్డి ఎయిడ్స్ నియంత్రణకు
- ఆయుష్ కమిషనర్‌గా దినేశ్‌కుమార్
- గిరిజన గురుకులాల సొసైటీకి గౌతమి



అమరావతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియాను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో చేనేత-జౌళి శాఖకు పంపుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయనకు కీలకమైన రెవెన్యూ, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ శాఖలు అప్పగించింది. ఎంతో ప్రాధాన్యమిచ్చినా ఆయన నిలబెట్టుకోలేకపోయారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తుల దందాలకు ఆయన సహకరించారని.. కొంత మందిని తన పేషీల్లో కూర్చోబెట్టుకుని మరీ ప్రోత్సాహించారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా తన కింద పని చేసిన ఒక కీలక ఉద్యోగి వ్యవహారంలో ఆయన దురుసుగా ప్రవర్తించారన్న విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా నిఘా విభాగంతో విచారణ చేయించారు. ఆ నివేదిక చూశాక ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైనా.. స్పెషల్ సీఎస్ స్థాయి అధికారి కావడంతో చేనేత-జౌళి శాఖకు బదిలీతో సరిపెట్టినట్లు తెలుస్తోంది. అలాగే కొన్ని శాఖల అదనపు బాధ్యతల నుంచి కూడా ఆయన్ను తప్పించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), ప్రత్యేక సీఎస్ జయలక్ష్మికి అదనంగా రెవెన్యూ శాఖ బాధ్యతలు అప్పగించారు. అలాగే ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌కు మానవ వనరుల అభివృద్ధి సంస్థ (హెచ్ఆర్‌డీఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు.

ఎట్టకేలకు పోస్టింగ్స్..

జగన్ జమానాలో కీలకంగా వ్యవహరించిన కొంత మంది ఐఏఎస్‌లను కూటమి ప్రభుత్వం రాగానే పక్కన పెట్టింది. దాదాపు పది మందికి పోస్టింగ్స్ ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి వారు పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు వారిలో కొందరికి శాఖలు కేటాయించింది. రేవు ముత్యాలరాజును పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఐఆర్‌డీ) కమిషనర్‌గా నియమించింది. ఏపీ రైతు బజార్ల సీఈవోగా కె.మాధవీలత, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఎండీగా కె.నీలకంఠారెడ్డి, గిరిజన సంక్షేమ గురుకుల విద్య సొసైటీ కార్యదర్శిగా ఎం.గౌతమి, ఆయుష్ కమిషనర్‌గా కె.దినేశ్‌కుమార్ నియమితులయ్యారు. దినేశ్‌కుమార్ ఫైబర్‌నెట్ ఎండీగా ఉన్నప్పుడు ఆ కార్పొరేషన్ చైర్మన్ జీవీరెడ్డితో వివాదం రేగడం.. ఎండీపై ఆరోపణలు చేసిన జీవీరెడ్డి రాజీనామా చేయడం.. తదనంతరం దినేశ్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీచేయడం తెలిసిందే.

వానలు.. వడగాడ్పులు

- ఉత్తరాంధ్రలో వడగళ్లవాన.. ప్రకాశంలో గాలివాన బీభత్సం
- కోస్తా, సీమల్లో కొనసాగిన ఎండ తీవ్రత

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం ఓ వైపు ఎండలు మండిపోగా, మరోవైపు అకాల వర్షాలు కురిశాయి. వాతావరణ అనిశ్చితితో కోస్తాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఉత్తరాంధ్రలో అల్లూరి జిల్లా సహా అక్కడక్కడా వడగండ్ల వాన కురిసింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 54.7మిల్లీమీటర్లు, ప్రకాశం జిల్లా కనిగిరిలో 43మి.మీ., అల్లూరి జిల్లా బుట్టాయిగూడెంలో 39.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మరోవైపు, కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల ఎండ తీవ్రత పెరిగింది. ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.8, కడప జిల్లా ఒంటిమిట్ట, పల్నాడు జిల్లా రావిపాడులో 41.4, అన్నమయ్య జిల్లా వత్తలూరు, నంద్యాల జిల్లా పాములపాడులో 41.2, నందిగామలో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 54 మండలాల్లో 40 డిగ్రీల కన్నా ఎక్కువ ఎండ రికార్డు అయ్యింది. సోమవారం ఉత్తరాంధ్ర, కోస్తాలోని 11 మండలాల్లో తీవ్రంగా, 98 మండలాల్లో ఓ మోస్తరు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక, ప్రకాశం జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. దర్శి, ముండ్లమూరు ప్రాంతాల్లో బొప్పాయి తోటలు ధ్వంసమవడంతో రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. కనిగిరిలో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలి డబ్బుగొట్టు వెంకటలక్ష్మమ్మ (55) అనే మహిళ మృతి చెందింది.



ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం సుంకరవారిపాలెంలో గాలివానకు విరిగిపడిన బొప్పాయి చెట్లు

రైలుపై విరిగిపడిన చెట్టు



కైకలూరు స్టేషన్‌లో తిరుపతి-పూరి రైలుపై పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

కైకలూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపోయి విద్యుత్ లైన్లు ధ్వంసం కావడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఆదివారం రాత్రి 8.45 గంటలకు కైకలూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-1 పైకి తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చిన సమయంలో భారీ వర్షంతోపాటు ఈదురుగాలులకు స్టేషన్‌ను ఆనుకుని ఉన్న సరుగు చెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడింది. అనంతరం రైలు బోగీపై పడింది. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఆ చెట్టును తొలగించారు.



రూప

రూప అనే ఆడ జాగిలానికి హ్యాండ్లర్‌గా కానిస్టేబుల్ పి. సుబ్బారావు వ్యవహరిస్తున్నారు. లేబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన దీని వయసు 6 సంవత్సరాల 3నెలలు. మందు పాతరలు కనుగొనటంలో దీనికి ఎంతో నైపుణ్యం ఉంది.

ఆర్మీ అనే పేరు గల జాగిలానికి కానిస్టేబుల్ పి. శ్రీనివాసరావు హ్యాండ్లర్‌గా ఉన్నారు. దీని వయసు నాలుగేళ్లు. లేబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన ఈ మగ జాగిలం వయసు తక్కువైనప్పటికీ నేర పరిశోధనలో మాత్రం ఎంతో చురుగ్గా వ్యవహరిస్తుంది.

గుంటూరు పోలీసులకు నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడుతున్న జాగిలాల్లో మార్షల్ అత్యంత సీనియర్. ఈ మగ జాగిలం వయసు తొమ్మిదేళ్లు. దీనికి హ్యాండ్లర్‌గా హెడ్ కానిస్టేబుల్ సంజీవరావు వ్యవహరిస్తున్నారు. లేబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన ఇది మందుపాతరలను గుర్తించడంలో పేరొందింది.



గుంటూరు పోలీసులకు నేర పరిశోధనలో ఉపయోగపడుతున్న జాగిలం మాక్స్. వయసు ఏడేళ్లు. బెల్జియం మాలినోయిస్ జాతికి చెందిన ఈ మగ జాగిలానికి కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన కనుసన్నల్లోనే ఇది పనిచేస్తుంది.



మాక్స్



పోలీసు జాగిలం.. బిజీబిజీ..!

- రాజధాని అమరావతితో జాగిలాలపై పెరిగిన పనిభారం
- సీఎం, డిప్యూటీ సీఎం, మాజీ సీఎంల ఇళ్ల వద్ద భద్రతా విధులు
- అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వద్ద తనిఖీలు షరా మామూలే
- వీటితోపాటు నేర పరిశోధన, మందుపాతరల అన్వేషణ భారమూ
- అమరావతిలో వీవీఐపీల కార్యక్రమాలతో జాగిలాలు ఉక్కిరిబిక్కిరి

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

పనిభారం మనుషులకే కాదు.. పోలీసు జాగిలాలకూ తప్పడం లేదు. అమరావతి రాజధాని కారణంగా వాటికి క్షణం తీరిక ఉండటం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇళ్ల వద్ద రోజువారీ తనిఖీలకు తోడు అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు రక్షణ బాధ్యతలతో అవన్నీ బిజీ బిజీగా ఉంటున్నాయి. దానికితోడు రాజధాని పరిధిలో ముమ్మరంగా జరుగుతున్న వీవీఐపీల భారం కూడా పడటంతో ఈ జాగితాలు పనిభారంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

నేర పరిశోధనలో కీలకం

నేరస్థుల అడుగుజాడలు, మందుపాతరల ఆచూకీ గుర్తించడంలో పోలీసు జాగిలాల పాత్ర కీలకం. దీంతో వీవీఐపీల భద్రతతో పాటు వారి నివాసాల వద్ద, వారు ప్రయాణించే మార్గాల్లో కోసం వీటినే ఉపయోగిస్తున్నారు. గుంటూరు జిల్లా పోలీసు శాఖ సంరక్షణలో ఉన్న నాలుగు జాగిలాలు కూడా మందుపాతరలను కనుగొనటంలో ఎంతో శిక్షణ పొందాయి. నేరం జరిగిన ప్రాంతాల్లో ఆధారాలతో పాటు బాంబులు, మందుగుండు సామగ్రి, మత్తు పదార్థాలను గుర్తించడం, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కనిపెట్టడంలో అవి అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాయి.

కేసుల ఛేదనలో...

గుంటూరులో డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించడంలో ఒక జాగిలం కీలక పాత్ర పోషించింది, అతి తక్కువ సమయంలో డ్రగ్స్ నిల్వలు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి పోలీసులకు దారి చూపింది. అలాగే ఒక ప్రసిద్ధ కార్యక్రమంలో అనుమానాస్పద బాంబును జాగిలాల సాయంతో పోలీసులు గుర్తించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ఒక దోపిడీ కేసులో, నేరస్థులు ఎక్కడికి పారిపోయారో గుర్తించడంలో డాగ్ స్క్వాడ్ సహకారం కీలకంగా మారింది. గుంటూరు జిల్లాలో నేర పరిశోధనల్లో ఈ జాగిలాలు నిత్యం పోలీసులకు సహకారం అందిస్తున్నాయి.

అమరావతితో మరింత పని

రాజధాని అమరావతి ప్రాంతం కూడా గుంటూరు జిల్లా పరిధిలోనే ఉండటంతో వీటికి పనిభారం పెరిగింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన దగ్గర నుంచి ముగిసే వరకు వీటి పాత్ర ఎంతో కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ముఖ్యమంత్రి, మంత్రుల కార్యక్రమాలు పెరిగాయి. ఆ సమయంలో కూడా వీటికి పని ఎక్కువగా ఉంటోంది. గుంటూరు పోలీసు పరిధిలో ఏడు జాగిలాలు ఉండగా అందులో ఒకటి ఇటీవలే మరణించింది. మరో రెండు రిటైర్ అయ్యాయి. ప్రస్తుతం నేర పరిశోధనలో నాలుగు జాగిలాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. అదేవిధంగా స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే రోజుల్లోనూ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ముందురోజు నుంచే ఈ జాగిలాలు విధులు నిర్వహిస్తాయి. ఈ వేడుకల్లో కూడా పాల్గొని తమ విన్యాసాలు ప్రదర్శిస్తాయి. గత స్వాతంత్ర్య దినోత్సవం రోజుల ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకలకు మంత్రి లోకేశ్ వచ్చారు. ఆ సమయంలో సీనియర్ పోలీస్ డాగ్‌గా పేరొందిన మార్షల్ తన హ్యాండ్లర్ సంజీవరావు తో కలసి లోకేశ్‌కు ఎదురేగి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికింది.

రోజుకు రెండు పూటలే ఆహారం

హైదరాబాద్‌లోని కుక్కపిల్లల విక్రయ కేంద్రం నుంచి 3నెలల వయసులో ఈ జాగిలాలను తీసుకొచ్చి శిక్షణ ఇస్తారు. వీటి ఆలనా పాలనా మొత్తం హ్యాండ్లరే చూసుకోవాలి. ఉదయం 6గంటలకే నిద్ర లేపి ఎక్సర్‌సైజ్‌లు చేయించడంతో వీటి దినచర్య ప్రారంభమవుతుంది. అనంతరం ఒక్కో జాగిలం ఒక్కో ప్రదేశానికి డ్యూటీకి వెళ్లిపోతుంది. ఇవి రోజుకు రెండు పూటల ఆహారం తీసుకుంటాయి. రోజు మొత్తం మీద 500 గ్రాముల ఆహారం ఇస్తారు. రాయల్ కెనైల్, మాక్సీ అడల్ట్ అనే నాన్‌వెజ్‌తో కూడిన డ్రై ఫీడ్‌ను అందిస్తారు. నాలుగు రోజులకోసారి చొప్పున ఒక్కో జాగిలానికి విశ్రాంతి కల్పిస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.